www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
సోమవారం
02-12-2024
సంపుటి : 01 | సంచిక : 210 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




సైబర్ సవాళ్లను..

## డబుల్ 'ఏఐ'తో ఎదుర్కోండి

పోలీసు సిబ్బందిపై పనిభారాన్ని తగ్గించేందుకు
సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి

59వ అఖిల భారత డీజీపీ/ఐజీల ముగింపు సమావేశంలో ప్రధాని మోదీ

**దిల్లీ:** డిజిటల్ మోసాలు, సైబర్ నేరాలు, కృత్రిమ మేధ ఆధారిత డీప్‌ఫేక్‌ను దుర్వినియోగం చేయడం వంటి వాటిపై ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. వీటి కారణంగా ఎదురవుతున్న సవాళ్లను డబుల్ ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆస్పిరేషనల్ ఇండియా)ని.. మిగతా2లో...

2





సంక్రాంతి తర్వాత

# రైతు భరోసా అమలు

## భట్టి విక్రమార్క నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీ వేశాం

- మారీచుల మాయమాటల నమ్మొద్దు
- సోనియాగాంధీ గ్యారంటీగా నేను చెబుతున్నా
- రేషన్ కార్డులపై సన్నబియ్యం పంపిణీ చేస్తాం
- రూ.7లక్షల కోట్ల అప్పుతో కేసీఆర్ తమకు ప్రభుత్వాన్ని అప్పగించారు
- ఇప్పటి వరకు 25.35 లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణాలు మాఫీ చేశాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు శుభవార్త చెప్పారు. ఈ ప్రభుత్వం రైతు భరోసా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగ తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా సొమ్ము జమ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. రేషన్ కార్డులపై సన్నబియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. 'మారీచుల మాయ మాటల నమ్మొద్దు..సోనియాగాంధీ గ్యారంటీగా నేను చెబుతున్నా' అని రైతులకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మీడియాతో మాట్లాడారు. రైతు భరోసాపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీ వేశామని, అసెంబ్లీలో చర్చించి త్వరలో విధివిధానాలు ఖరారు చేస్తామని సీఎం తెలిపారు. రూ.2లక్షల రైతు రుణమాఫీ ఎలా పూర్తి చేశామో.. రైతు భరోసా కూడా అదేవిధంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు.రూ.7లక్షల కోట్ల అప్పుతో కేసీఆర్ తమకు ప్రభుత్వాన్ని అప్పగించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. "ప్రభుత్వం ఇంత అప్పుల్లో ఉందని కేసీఆర్, హరీశ్‌రావు, ఆర్థిక మంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్, అధికారులు ఎవరూ చెప్పలేదు. మే అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ఆస్తులుఅప్పులపై శ్వేతపత్రం విడుదల చేశాం. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రతి నెలా రూ.6,500 కోట్లు వడ్డీ చెల్లిస్తున్నాం. భారీగా ఉన్న అప్పు చూసి కూడా అధైర్యపడకుండా పాలన సాగిస్తున్నాం. కేసీఆర్ బకాయి పెట్టిన రూ.7,625 కోట్ల రైతు బంధు మేం అధికారంలోకి వచ్చిన వెంటనే చెల్లించాం. ఇప్పటి వరకు 25.35 లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణాలు మాఫీ చేశాం. మిగతా 9 ఏళ్లు కూడా అన్ని కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహిస్తామనే నమ్మకం కలిగింది. నెహ్రూ నుంచి నేటి వరకు రైతులకు తొలిప్రాధాన్యం ఇస్తున్నది కాంగ్రెస్‌పార్టీయే. రుణమాఫీ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను పదేళ్లపాటు మోసం చేసింది" అని రేవంత్‌రెడ్డి విమర్శించారు.

పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య పెంపును

## సవాల్ చేస్తూ పిల్

గరిష్ఠంగా 1200 మంది ఓటర్లను 1500కు పెంచుతూ ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం

నేడు విచారణ జరుపనున్న 'సుప్రీం'..!

2



ఐసీసీ ఛైర్మన్‌గా బాధ్యతలు

## స్వీకరించిన జైషా

అత్యంత పిన్నవయస్కుడిగా రికార్డు

2



జనాభా తగ్గుదల అనేది

## ఆందోళనకర అంశం

ఆర్ఎస్ఎస్ చీఫ్ భాగవత్

2



బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనకు

## ఏమాత్రం తేడా లేదు

- కాంగ్రెస్ గ్యారంటీల గారడీ..
- 6 అబద్ధాలు, 66 మోసాల పేరుతో బీజేపీ ఛార్జ్‌షీట్
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

2



## రాష్ట్ర ఆదాయం పెంచే సత్తా కాంగ్రెస్‌కు లేదు

- సుపరిపాలన అని చెప్పాల్సింది సీఎం కాదు, ప్రజలు
- ఎన్నికలకు ముందే రైతుబంధు వేసేందుకు మేం సిద్ధమయ్యాం.. కాంగ్రెస్ అడ్డుకుంది
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు



2

విభజన అంశాలపై నేడు ఏపీ, తెలంగాణ

## అధికారుల కమిటీ భేటీ

రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలపై చర్చ

సీఎస్‌ల నేతృత్వంలో జరుగనున్న భేటీ

2



ఏటూరు నాగారంలో

# భారీ ఎన్‌కౌంటర్

ఏడుగురు మావోయిస్టుల మృతి

తెలంగాణ గ్రేహౌండ్స్, యాంటీ మావోయిస్ట్ స్క్వాడ్ సంయుక్తంగా ఆపరేషన్



2

మరిన్ని తాజా వార్తల కోసం
స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 90 | ₹ 112 |
| స్కిన్‌తో | స్కిన్‌లెస్ |
| ₹ 162 | ₹ 185 |

ప్రభుత్వ ఏర్పాటుపై

## బీజేపీదే తుది నిర్ణయం

- పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటా
- ఆ విషయంలో నా వైపు నుంచి ఎటువంటి అభ్యంతరాలు లేవు
- తేల్చేసిన ఏక్‌నాథ్ షిండే..

2






డిసెంబర్ 4న మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించిన తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్పర్సన్ కల్వ సుజాత గుప్త. ఆమె వెంట బండారు సుబ్బారావు, బెల్దె శ్రీధర్, ఎం.మోహన్ శ్యాం ప్రసాద్ తదితరులు ఉన్నారు.
- విశ్వంభర, హైదరాబాద్

రోశయ్య వర్ధంతి సభకు

## తరలిరావాలి

మీడియా కమిటీ ఛైర్మన్ కొటిక విఠల్




2

# సైబర్ సవాళ్లను.. డబుల్ 'ఏఐ'తో ఎదుర్కోండి

(మొదటి పేజీ తరువాయి)

ఉపయోగించడం ద్వారా అధిగమించాలని పోలీసులకు పిలుపునిచ్చారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో నిర్వహించిన 59వ అఖిల భారత డీజీపీ/ఐజీల సమావేశం ముగింపు సందర్భంగా ప్రధాని ప్రసంగించారు. అర్బన్ పోలీసింగ్‌లో తీసుకున్న చర్యలను ప్రశంసిస్తూ.. దేశంలోని 100 నగరాల్లో వాటిని అమలు చేయాలని సూచించారు.
పోలీసు సిబ్బందిపై పనిభారాన్ని తగ్గించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. పోలీసింగ్ విషయంలో 'స్మార్ట్'కు సరికొత్త నిర్వచనమిస్తూ.. వ్యూహాత్మక వైఖరి, నిశిత పరిశీలన, పరిస్థితులకు తగ్గట్టు మారడం, విశ్వసనీయత, పారదర్శకతలను అలవర్చుకోవాలని సూచించారు. భద్రతా సవాళ్లపై విస్తృత చర్చలు జరిగాయని, వాటిని కట్టడి చేసేందుకు అమలు చేయాల్సిన ప్రతివ్యూహాలపై ప్రధాని మోదీ సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఓ అధికారిక ప్రకటన వెలువడింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ తదితరులతోపాటు దాదాపు 1000 మంది ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనకు ఏమాత్రం తేడా లేదు

### కేంద్రమంత్రి, బీజేపీరాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్ పాలనకు ఏమాత్రం తేడా లేదని కేంద్రమంత్రి, బీజేపీరాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ గ్యారంటీల గారడీ.. 6 అబద్ధాలు 66 మోసాల పేరుతో బీజేపీ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ''కాంగ్రెస్ పార్టీ అలవికానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని ఈ ఏడాదిలో నెరవేర్చలేదు. వందరోజుల్లో నెరవేరుస్తామన్న హామీలు ఏడాది గడిచినా పూర్తి చేయలేదు. ప్రజా సమస్యలు పరిష్కరించని ఈ ప్రభుత్వం విజయోత్సవాలు చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలను చూసి ప్రజలు నివ్వెరపోతున్నారు.గతేడాది డిసెంబర్ 9న అందరికీ రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. ఏడాది గడిచినా రుణమాఫీ అందరికీ పూర్తి కాలేదు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పారు. ఇప్పటివరకు ఈ ప్రభుత్వం ఒక్కసారి కూడా రైతుభరోసా ఇవ్వలేదు. ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైంది. పదేళ్లపాటు నియంతృత్వపాలన, కుటుంబపాలన, అవినీతి పాలన సాగించింది. నిరంకుశ, అవినీతి పాలనను పదేళ్ల తర్వాత ప్రజలు గద్దె దించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనకు ఏమాత్రం తేడా లేదు'' అని కిషన్‌రెడ్డి విమర్శించారు.

## రాష్ట్ర ఆదాయం పెంచే సత్తా కాంగ్రెస్‌కు లేదు

### - మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు

**విశ్వంభర, హైదరాబాద్:** సుపరిపాలన అని చెప్పాల్సింది సీఎం కాదు, ప్రజలని తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం మంచి ఆర్థికవృద్ధితో రాష్ట్రాన్ని కాంగ్రెస్‌కు అప్పగించిందని, కానీ ఇప్పటి ప్రభుత్వానికి ఆదాయం పెంచే సత్తా లేదని విమర్శించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను అమలు చేసే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదన్నారు. ''రూ.7లక్షల కోట్ల అప్పు అని కాంగ్రెస్ నేతలు ఏడాదికాలంగా చెబుతు న్నారు. ప్రభుత్వ అప్పులన్నీ బహిరంగ రహస్యమే. ఏటా అసెంబ్లీలో కాగ్ ప్రవేశపెట్టే నివేదికల్లో ఉంటాయి. నాడు సీఎల్పీగా ఉన్న భట్టి విక్రమార్కకు రాష్ట్ర అప్పుల గురించి తెలియదా? గత ఎన్నికలకు ముందే రైతుబంధు వేసేందుకు మేం సిద్ధమయ్యాం. కానీ, కాంగ్రెస్ అడ్డుకుంది'' అని హరీశ్‌రావు అన్నారు. సంపూర్ణ రుణమాఫీతోపాటు వరంగల్ డిక్లరేషన్ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

### ఏటూరునాగారంలో

# భారీ ఎన్‌కౌంటర్



**విశ్వంభర, ఏటూరు నాగారం :** ములుగు జిల్లాలోని ఏటూరు నాగారం చల్పాక అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. తెలంగాణ గ్రేహౌండ్స్, యాంటీ మావోయిస్ట్ స్క్వాడ్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి. ఎన్‌కౌంటర్‌పై పోలీసులు అధికారికంగా ధ్రువీకరించలేదు.మృతుల్లో మావోయిస్టు కీలక నేతలున్నట్లు తెలుస్తోంది. ఇల్లందు నర్సంపేట ఏరియా కమిటీ కార్యదర్శి భద్రు అలియాస్ పాపన్నతో పాటు అతడి దళ సభ్యులు మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుల్లో కురుసం మంగు అలియాస్ భద్రు అలియాస్ పాపన్న (35), ఎగోలపు మల్లయ్య అలియాస్ మధు(43), ముస్సకి దేవల్ అలియాస్ కరుణాకర్(22), ముస్సకి జమున (23), జైసింగ్ (25), కిశోర్ (22), కామేశ్ ( 23) ఉన్నట్లు సమాచారం.

### విభజన అంశాలపై నేడు ఏపీ, తెలంగాణ

# అధికారుల కమిటీ భేటీ

**విశ్వంభర, అమరావతి:** విభజన అంశాలపై ఏపీ, తెలంగాణ అధికారుల కమిటీ సోమవారం మధ్యాహ్నం మంగళగిరిలోని ఏపీఏసీ కార్యాలయంలో భేటీ కానుంది. రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలపై చర్చించనున్నారు. ఏపీ, తెలంగాణ సీఎస్‌ల నేతృత్వంలో అధికారులు భేటీ కానున్నారు.

## రోశయ్య వర్ధంతి సభకు తరలిరావాలి

### మీడియా కమిటీ ఛైర్మన్ కౌటిక విఠల్

**విశ్వంభర, హైదరాబాద్ :** వివాదరహితుడు, నిరాడంబరుడు, 16 సార్లు ఆర్థిక మంత్రిగా , ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రిగా పనిచేసిన కొణిజేటి రోశయ్య 3వ వర్ధంతి సందర్భంగా డిసెంబర్ 4న హైటెక్స్‌లో నిర్వహించే కార్యక్రమానికి ఆర్యవైశ్యులు పెద్దఎత్తున తరలిరావాలని మీడియా కమిటీ ఛైర్మన్ కౌటిక విఠల్ విలేకరుల సమావేశంలో కోరారు. ప్యాప్షి హల్ నందు వైశ్య జర్నలిస్టులు,పత్రికల,మీడియా ఎడిటర్లు,యజమానులతో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వ్యక్తిత్వం, పని విధానం, రాజకీయ చతురతను, వై శ్య జాతికి వారు చేసిన సేవలను వైశ్యులందరికి తెలిసేలా విస్తృత కవరేజీ చెయ్యాలని కోరారు.

### పోలింగ్ కేంద్రాల్లో

# ఓటర్ల సంఖ్య పెంపును సవాల్ చేస్తూ పిల్

**దిల్లీ :** ఒక్కో పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1200 మంది ఓటర్లను 1500కు పెంచుతూ ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించనున్నది. ప్రకాశ్ సింగ్ పిటిషన్ దాఖలు చేయగా.. సీజేఐ జస్టిస్ సంజీవ్ కన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం విచారించనున్నారు. ప్రతి నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్‌లలో ఓటర్ల సంఖ్యను పెంచుతూ ఈ ఏడాది ఆగస్టులో ఎన్నికల సంఘం దాకలు చేసిన ఉత్తర్వులను ప్రకాశ్ సింగ్ సవాల్ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్యను పెంచాలనే నిర్ణయం ఏకపక్షమని.. డేటా ఆధారంగా నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నారు. అక్టోబర్ 24న ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ అంశంపై కమిషన్ వైఖరిని వెల్లడించేందుకు వీలుగా పిటిషన్ కాపీని పంపాలని ఎన్నికల సంఘం న్యాయవాదికి పిటిషనర్‌ను ఆదేశించింది.
పోలింగ్ స్టేషన్లలో 1200 నుంచి 1500కు ఓటర్ల సంఖ్యను పెంచడం వల్ల ఓటు వేయడానికి ఎక్కువ సమయం పడుతుందని పిటిషనర్ తరపున న్యాయవాది అభిషేక్ సింఘ్వీ అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎక్కువ క్యూ ఉండడంతో ఓటర్లు నిరుత్సాహానికి గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ ఎక్కువ మంది ఓటు వేసేలా చూడడం లక్ష్యమని, ఈవీఎం వినియోగం వల్ల ఓటింగ్ ప్రక్రియ గతంలో కంటే తక్కువ సమయం పడుతుందన్న విషయాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. ఓటింగ్ ప్రక్రియ సమయాన్ని తగ్గించేందుకు పోలింగ్ స్టేషన్లలో ఈవీఎంల సంఖ్యను పెంచేందుకు ఎన్నికల సంఘం ప్రయత్నిస్తోందని ధర్మాసనం పేర్కొంది.ఈ నిర్ణయం మహారాష్ట్ర, జార్ఖండ్‌ల అసెంబ్లీ ఎన్నికలపై (పూర్తయిన ఎన్నికలు), వచ్చే ఏడాది జరగనున్న బీహార్, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం చూపుతుందని పిటిషనర్ పేర్కొన్నారు. సాధారణంగా ఎన్నికలు 11 గంటల పాటు జరుగుతాయని, ఓటు వేయడానికి 60 నుంచి 90 సెకన్ల సమయం పడుతుందని.. దాంతో ఒక పోలింగ్ కేంద్రంలో రోజుకు 490 నుంచి 660 మంది ఈవీఎంల ద్వారా ఓటు వేయవచ్చని పేర్కొన్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో 8090 శాతం వరకు ఓటింగ్ నమోదవుతుందని, దీంతో క్యూలో ఉండి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ క్రమంలో సుమారు 20 శాతం మంది ఓటర్లు పోలింగ్ సమయం ముగిసిన కూడా క్యూలో నిలబడతారని.. నిరీక్షించలేక ఓటు వేసేందుకు ఆసక్తిచూపరని.. ప్రగతిశీల ప్రజాస్వామ్యానికి ఆమోదయోగ్యం కాదని పిటిషన్‌లో పేర్కొన్నారు.



# ఐసీసీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జైషా

**దిల్లీ :** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్‌గా జై షా బాధ్యతలు స్వీకరించారు. ఈ విషయాన్ని ఐసీసీ ఆదివారం ప్రకటించింది. ఈ ఏడాది ఆగస్టులో ఆయన ఐసీసీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఐసీసీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అతిపిన్న వయస్కుడు ఆయనే. గతంలో ఆయన భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు కార్యదర్శిగా పని చేసిన విషయం తెలిసిందే. ఇంతకు ముందు ఐసీసీ ఛైర్మన్ గ్రెగ్ బార్క్లే పని చేసిన విషయం తెలిసిందే. ఆయన నాలుగు సంవత్సరాల పాటు అధ్యక్షుడిగా కొనసాగారు. జై షా రెండేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగుతారు. ఐసీసీ అధ్యక్షుడిగా నియామకమైన భారతీయుడు జై షా. ఇంతకు ముందు దివంగత జగ్‌మోహన్ దాల్మియా, శరద్ పవార్, శశాంక్ మనోహర్, పారిశ్రామికవేత్త ఎన్ శ్రీనివాసన్ ఐసీసీ అధ్యక్షులుగా పని చేశారు. ప్రస్తుతం జై షా ముందు సవాళ్లు ఉన్నాయి. దాయాది దేశం పాక్ వేదికగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ జరగాల్సి ఉంది. ఈ ట్రోఫీ కోసం జట్టును పాక్‌కు పంపేది లేదని భారత్ స్పష్టం చేసింది. ఈ క్రమంలో ఐసీసీ ఛైర్మన్‌గా ఆయన వ్యవహరిస్తారు ? హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించేందుకు ఆ దేశాన్ని ఒప్పించడం సవాల్‌గా మారనున్నది.
కేంద్ర హోంశాఖ మంత్రి, బీజేపీ సీనియర్ నేత అమిత్ షా తనయుడు జై షా క్రికెట్ అడ్మినిస్ట్రేటర్‌గా తన కెరీర్‌ను 2009లో ప్రారంభించింది. అహ్మదాబాద్‌లోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ క్రికెట్‌లో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పని చేశారు. ఆ తర్వాత సెప్టెంబర్ 2013లో గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ (GCA) జాయింట్ సెక్రటరీ నియామకమయ్యారు. ఆ తర్వాత 2015లో బీసీసీఐ బోర్డ్ ఫైనాన్స్, మార్కెటింగ్ కమిటీ సభ్యుడిగా చేరారు. 2019 అక్టోబర్‌లో బీసీసీఐ సెక్రెటరీగా బాధ్యతలు స్వీకరించారు. అతిపిన్న వయసులో బీసీసీఐ సెక్రెటరీ బాధ్యతలు తీసుకున్నారు. బీసీసీఐ కార్యదర్శి పదవీకాలంలో సౌరవ్ గంగూలీతో పని చేశారు. ఆ తర్వాత రోజర్ బిన్నీతో కలిసి పని చేశారు. ప్రస్తుతం బీసీసీఐ అధ్యక్షుడిగా బిన్నీ కొనసాగుతున్న విషయం తెలిసిందే. 2022లో ఐదేళ్లపాటు ఐపీఎల్ మీడియా హక్కులను రూ.48,390 కోట్లకు విక్రయించేలా జై షా కృషి చేశారు. ప్రతి మ్యాచ్ విలువ ఆధారంగా.. ఎన్ఎఫ్ఎల్ తర్వాత ఐపీఎల్ రెండో అత్యంత విలువైన క్రీడగా తీర్చిదిద్దారు. ఇక 2021లో ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడిగా పని చేశారు. ఈ ఏడాది జనవరిలో మరోసారి ఆయనకే ఏసీసీ బాధ్యతలు అప్పగించారు. నవంబర్ 2022లో ఐసీసీ ఫైనాన్స్ అండ్ కమర్షియల్ అఫైర్స్ సబ్‌కమిటీకి చీఫ్‌గా నియామకమయ్యారు. కామన్వెల్త్ గేమ్స్ తదితర ఈవెంట్లలో క్రికెట్‌ని చేర్చడంలో కీలకపాత్ర పోషించారు.

## శ్రీశైలంలో ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన..!

**విశ్వంభర, శ్రీశైలం:** మానవ సేవే మాధవ సేవగా భావించి శ్రీశైల మహ క్షేత్రంలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు శ్రీకృష్ణ యాదవ నిత్యాన్న సత్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మి ప్రసాద్ యాదవ్ తెలిపారు. ఆదివారం సత్ర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరానికి ముఖ్య అతిథిగా వచ్చిన దేవస్థాన కార్య నిర్వహణాధికారి చంద్ర శేఖర్ ఆజాద్ మాట్లాడుతూ క్షేత్రంలో నివసించే వారితోపాటు పరిసరప్రాంతాల్లో ఉండే గిరిజన చెంచు ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలను ఉచితంగా అందించడం హర్షనీయమని నిర్వాహకులను అభినందించారు. శిబిరంలో వివిధప్రాంతాల నుండి వచ్చిన వైద్య నిపుణులు కార్డియాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్స్, డెంటల్, పిడియాట్రిషన్, ఈఎన్టీ, డెర్మటాలజిస్టులతోపాటు పలువురు టెక్నీషియన్లతో ఈవో స్వయంగా మాట్లాడి క్షేత్ర పరిధిలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలను తెలుసుకున్నారు.



ఈ విధమైన శిబిరాల నిర్వహించేందుకు దేవస్థానం సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంటుందని చెప్పారు.
ఉచిత వైద్య శిబిరం నిర్వాహకులు మాట్లాడుతూ క్షేత్ర పరిధిలోని నిరుపేదలకు అరకొర వైద్యం అందుతుండటంవల్ల అనేక రోగాల బారీన పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం స్వయంగా చూసి చలించిన తన మిత్రులైన వైద్యులను సంప్రదించడంతో ఉచితంగా వైద్యపరీక్షలతోపాటు మందుల పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చారని అన్నారు. ఈ శిబిరాన్ని రెండు మాసాలకు ఒకసారి నిర్వహిస్తూ వైద్య నిపుణులతో గిరిజన నివాస ప్రాంతాలకు వెళ్లి సేవలందించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు తెలిపారు. దేవస్థానం అధికారులు సిబ్బందితోపాటు స్థానిక ప్రజలు, యాత్రికులు సుమారు 400 మందికి పైగా వైద్యులను సంప్రదించినట్లు చెప్పారు. ప్రధానంగా ఈ ప్రాంతంలో పుట్టుకతో మూగ, చెవిటి చిన్నారులకు శాశ్వత పరిష్కారానికి కావలసిన వైద్యాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు రామకృష్ణ దంపతులు, సీతారామిరెడ్డి, ఊర్మిళా యాదవ్, సంజీవ్ దంపతులు, దస్తగిరి, సాయికృష్ణ, కిరణ్, బసవయ్య, హరిబాబులతోపాటు యాదవ సంఘం నిర్వాహకులు బాబు, వెంకటేశ్వర్లు, చెంచయ్య, నాగేశ్వరావు, ఆళూరి, నాగార్జునప్రసాద్, మేనేజర్ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

### మాలలు ఐక్యంగా పోరాడి

## ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించాలి: వివేక్ వెంకటస్వామి

**విశ్వంభర, హైదరాబాద్:** మాలలు ఐక్యంగా పోరాడి ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించాలని కాంగ్రెస్ సీనియర్ నేత, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన మాలల సింహగర్జన సభకు ఆ సామాజిక వర్గానికి చెందిన పలువురు ముఖ్యనేతలు హాజరయ్యారు. మాలల ఐక్యత చాటేలా నేతలంతా ఒకే వేదికపైకి వచ్చి నినదించారు. రాష్ట్ర నలుమూలల నుంచి మాలలు భారీగా తరలివచ్చారు.ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ... '' మాలలు కదిలితే ఏం జరుగుతుందో మనం చూపిద్దాం. అంబేద్కర్ మాల, మాదిగ అని ఆలోచించలేదు.. దళితులకు రిజర్వేషన్ ఇచ్చారు. కాకా కాలేజీలో ఎక్కడా మాల, మాదిగ అని తేడా ఉండదు. ఆయన గుడిసెలు ఇచ్చినప్పుడు కూడా మాల, మాదిగ అని మాట్లాడలేదు. రాజకీయపార్టీల్లో మాలలంటే చిన్న చూపు ఉంది. అలాంటి వారికి ఈ సభ చెంపపెట్టు. మనం సమైక్యంగా ఉంటేనే .. మనకు గౌరవం లభిస్తుంది'' అని వివేక్ అన్నారు.



## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై ఇబ్రహీంపట్నం పీఎస్‌లో ఫిర్యాదు



**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఇబ్రహీంపట్నం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. 'గురుకులబాట' కార్యక్రమంలో భాగంగా శేరిగూడలోని ప్రభుత్వ హాస్టళ్లకు ప్రవీణ్‌కుమార్‌తో పాటు బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నేతలు వెళ్లారు. అనుమతి లేకుండా వసతిగృహంలోకి ప్రవేశించారని ప్రిన్సిపల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.రాష్ట్రవ్యాప్తంగా గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వరుస మరణాలు, ఇతర విషాద ఘటనల నేపథ్యంలో.. ఆయా విద్యాసంస్థల్లో నెలకొన్న పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు బీఆర్ఎస్ తరఫున 'గురుకుల బాట' పేరుతో కార్యక్రమాన్ని చేపట్టారు. ''గురుకుల విద్యాసంస్థల నిర్వహణలో అపార అనుభవమున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులతో కమిటీని భారాస ఏర్పాటు చేసింది. ఆ కమిటీ రాష్ట్రంలోని అన్ని గురుకుల విద్యాసంస్థలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లు, రెసిడెన్షియల్ కాలేజీలను కమిటీ సందర్శిస్తోంది.

### పాలమూరు ప్రజలు

## మళ్లీ వలస పోయే పరిస్థితి తేవొద్దు: నిరంజన్‌రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** పరిశ్రమల కోసం లగచర్లలో ఎప్పుడో భూములు గుర్తించామని భారాస నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు కొత్తగా భూములు తీసుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలమూరు పచ్చగానే ఉందని.. ఇప్పుడు వలసలు లేవని పేర్కొన్నారు. ప్రజలు మళ్లీ వలస పోయే పరిస్థితి తేవొద్దన్నారు. ''రూ.7,500 కోట్ల రైతుబంధు ఇవ్వలేక చేతులెత్తేశారు.. వారికి రూ.30 వేల కోట్ల బోనస్ ఎలా ఇస్తారు? రైతుబంధు ఎగవేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోంది. ఎంత మందికి బోనస్ ఇచ్చారు? కేసీఆర్ హయాంలో ఎన్‌కౌంటర్లు అనేవే లేవు. వాటిని మళ్లీ ఎందుకు పునరుద్ధరించారు?'' అని నిరంజన్‌రెడ్డి (BRS) ప్రశ్నించారు.

# ప్రభుత్వ ఏర్పాటుపై బీజేపీదే తుది నిర్ణయం

### ఏక్‌నాథ్ షిండే..

**ముంబయి :** మహారాష్ట్ర సీఎం పదవిపై రాష్ట్ర ఆపద్ధర్మ సీఎం ఏక్ నాథ్ షిండే పెదవి విప్పారు. అధికార మహాయుతి కూటమిలోని మూడు మిత్ర పక్షాల మధ్య సమన్వయ లోపం లేదని కొట్టి పారేశారు. ప్రభుత్వంలో అధికార పంపిణీపై తన పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని ఆదివారం తెలిపారు. ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ తర్వాత ఆరోగ్య కారణాల పేరుతో ఏక్ నాథ్ షిండే తన సొంతూరికి వెళ్లారు. ఆదివారం ఠాణేకు బయలుదేరడానికి ముందు మీడియాతో మాట్లాడుతూ ఏక్ నాథ్ షిండే తన ఆరోగ్యం బాగానే ఉందన్నారు.
గత రెండున్నరేండ్లుగా సీఎం గానూ, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో విశ్రాంతి లేకుండా పని చేయడం వల్ల ఇంటికెళ్లి విశ్రాంతి తీసుకున్నానని ఏక్ నాథ్ షిండే చెప్పారు. ప్రభుత్వ ఏర్పాటు విషయంలో తన వైపు నుంచి ఎటువంటి అభ్యంతరాలు లేవని బీజేపీ అగ్ర నాయకత్వానికి హామీ ఇచ్చానని ఏక్ నాథ్ షిండే తెలిపారు. ప్రభుత్వ ఏర్పాటు విషయంలో శివసేన నుంచి పూర్తి మద్దతు ఉంటుందన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో హోంమంత్రి ఎవరికి ఇస్తారన్న విషయమై తదుపరి భేటీలో ఖరారవుతుందన్నారు. మరోమారు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జరిగే సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. తమకు మెజారిటీ కట్టబెట్టిన రాష్ట్ర ప్రజలకు జవాబుదారీగా ఉంటామని, ప్రతిపక్షానికి కాదన్నారు.

## జనాభా తగ్గుదల అనేది ఆందోళనకర అంశం



**నాగ్‌పూర్:** జనాభా తగ్గుదలపై ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. జనాభాలో క్షీణత కొనసాగితే సమాజం దానంతట అదే నశించిపోతుందని పేర్కొన్నారు. నాగ్‌పూర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ప్రసంగించిన ఆయన.. కుటుంబ ప్రాధాన్యాన్ని చాటిచెప్పారు. కుటుంబాలు సమాజంలో భాగమని తెలిపారు. ''జనాభా తగ్గుదల అనేది ఆందోళనకర అంశం. జనాభా శాస్త్రం ప్రకారం సంతానోత్పత్తి రేటు 2.1 కన్నా దిగువకు వెళ్తే.. సమాజం నశించే ప్రమాదం ఉంది. దానిని ఎవరూ అంతం చేయాల్సిన అవసరం లేదు. ఈ సమస్యతో ఇప్పటికే అనేక భాషలు, సంస్కృతులు కనుమరుగయ్యాయి. భారత జనాభా విధానం కూడా ఈ రేటు 2.1 కన్నా తక్కువ ఉండకూడదని చెబుతోంది. మన దేశానికి సంబంధించి ఇది కనీసం మూడుగా ఉండాలి. ఈ సంఖ్య చాలా కీలకం. ఎందుకంటే సమాజ మనుగడకు అది అవసరం'' అని మోహన్ భాగవత్ పేర్కొన్నారు.19602000 మధ్య రెట్టింపైన ప్రపంచ జనాభా పెరుగుదల రేటు ఆ తరవాత నుంచి తగ్గుముఖం పడుతోందని నివేదికలు చెబుతున్నాయి. ప్రతి మహిళ 2.1 మందిని కంటేనే పాతతరాన్ని భర్తీ చేసే స్థాయిలో జననాలు జరుగుతాయి. దీన్ని జనాభా భర్తీ రేటు అంటారు. 2.1కి దరిదాపుల్లో ఉన్న దేశాల్లో భారత్, అర్జెంటీనా, ట్యునీసియా ఉన్నాయి. 2.1కన్నా తక్కువ రేటు ఉన్న దేశాల్లో అమెరికా, బ్రెజిల్, మెక్సికోలు ఉండగా.. చైనా, జపాన్, దక్షిణ కొరియాల్లో అంతకన్నా తక్కువ కనిపిస్తోంది.

### నిఖేశ్ కుమార్‌కు

## 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్



**విశ్వంభర, హైదరాబాద్:** గండిపేట మండలం పీరంచెరువు పెబెల్‌సిటీ గేటెడ్ కమ్యూనిటీలోని నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నిఖేశ్ కుమార్ ఇంట్లో ఏసీబీ సోదాలు ముగిశాయి. ఆయన్ను అధికారులు అదుపులోకి తీసుకుని.. నాంపల్లి ఏసీబీ కార్యాలయానికి తరలించారు. ఉదయం 6 గంటలకు న్యాయమూర్తి నివాసంలో హాజరుపర్చారు. నిఖేశ్ కూమార్‌కు జడ్జి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించారు. అనంతరం ఏసీబీ అధికారులు ఆయన్ను చంచల్‌గూడ జైలుకు తరలించారు నిఖేశ్ కుమార్‌కు మొయినాబాద్‌లో 6.5 ఎకరాల వ్యవసాయ భూమి, మూడు ఫామ్ హౌస్‌లు, శంషాబాద్, మియాపూర్‌లో 2 కమర్షియల్ కాంప్లెక్స్‌లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆయనతో పాటు బంధువుల పేరుతో భారీగా ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. శనివారం ఉదయమే ఏసీబీ అధికారులు నికేశ్‌కుమార్ ఇంటికి చేరుకున్నారు. ఆయన సమక్షంలోనే సోదాలు ప్రారంభించారు. మరికొన్ని బృందాలు మొయినాబాద్ మండలం తోల్కట్ట, సజ్జన్‌పల్లి, నక్కలపల్లి ఫాంహౌస్‌లతోపాటు బంధువులు, సన్నిహితులకు సంబంధించిన 19 ప్రాంతాల్లో తనిఖీలునిర్వహించి అక్రమాస్తుల దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.17,73,53,500గా తేలింది. బహిరంగ మార్కెట్‌లో సదరు అక్రమాస్తుల విలువ దాదాపు రూ.100కోట్లు ఉంటుందని అంచనా. నిఖేశ్‌ను అరెస్టు చేసినట్లు ఏసీబీ శనివారం రాత్రి వెల్లడించింది.

హైదరాబాద్‌లో

## బుల్లితెర నటి శోభిత ఆత్మహత్య



**విశ్వంభర, హైదరాబాద్:** కన్నడ బుల్లితెర నటి శోభిత ఆత్మహత్యకు పాల్పడ్డారు. గచ్చిబౌలి శ్రీరాంనగర్ కాలనీలోని సీ బ్లాక్‌లో ఉన్న ఆమె.. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులకు సమాచారం అందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన గచ్చిబౌలి పోలీసులు.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. బ్రహ్మగంతు, నినిదలే సీరియల్స్‌తో పాటు పలు సినిమాల్లో నటించిన శోభిత.. గతేడాది వివాహం చేసుకున్నారు. భర్త సుధీర్‌తో కలిసి శ్రీరాంనగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బెంగళూరు తరలించనున్నట్టు సమాచారం.

రాజమహేంద్రవరం నుంచి

## ముంబయికి నేరుగా విమాన సర్వీసు




**విశ్వంభర, రాజమహేంద్రవరం:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి ముంబయికి నేరుగా విమాన సర్వీసు ప్రారంభించినట్టు ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు మధురపూడి విమానాశ్రయం నుంచి ముంబయి సర్వీసు ప్రారంభించినట్టు చెప్పారు.తొలి సర్వీస్ ఆదివారం సాయంత్రం '6 ఈ 582' విమానం సాయంత్రం 4.50 గంటలకు ముంబయిలో బయలుదేరి సాయంత్రం 6.45కు రాజమహేంద్రవరం చేరుకుంటుందని తెలిపారు. '6 ఈ 583' విమానం రాత్రి 7.15కు రాజమహేంద్రవరంలో బయలుదేరి రాత్రి 9.05కి ముంబయి చేరుకుంటుందని తెలిపారు. రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం ఒక గంట 50 నిమిషాలు ఉంటుందని జ్ఞానేశ్వరరావు వెల్లడించారు.

డిసెంబర్ 9 నుంచి

## అసెంబ్లీ శీతాకాల సమావేశాలు



**విశ్వంభర, హైదరాబాద్:** ఈ నెల 9 నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో రైతు భరోసా విధివిధానాలు, కులగణన వివరాలపై ప్రధానంగా చర్చ జరిగే అవకాశం ఉన్నది. అయితే ఈ సమావేశాల్లో.. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ భావిస్తోంది. ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అటకెక్కించడంపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఎండగట్టాలని నిర్ణయించింది.
రైతు భరోసా విధివిధానాలపై అసెంబ్లీలో చర్చిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ ఉదయం ఒక ప్రకటన చేశారు. కులగణన వివరాలపై కూడా ఈ సమావేశాల్లో చర్చ జరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్ ఏడాది పాలన తనకు సంతృప్తినిచ్చిందని ఆయన పేర్కొన్నారు. అంతేగాక సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు వేస్తామని ప్రకటించారు.

## ఐఐటీ రామయ్యను కలువడం ఆనందకరం

### మాజీ మంత్రి హరీశ్‌రావు ట్వీట్

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమానికి బాసటగా నిలిచిన, ఐఐటీనే తన ఇంటిపేరుగా మార్చుకున్న సరస్వతీ పుత్రుడు ఐఐటీ రామయ్యను కలుసుకోవడం ఆనందంగా ఉన్నదని హరీశ్‌రావు ఆదివారం ట్వీట్ చేశారు. 98 ఏండ్ల వయస్సులో కూడా రామయ్య సమాజం గురించి ఆలోచించడం గొప్పవిషయమని వెల్లడించారు. సిద్దిపేటతో ఆయనకున్న అనుబంధాన్ని, జ్ఞాపకాలను తనతో పంచుకున్నారని చెప్పారు. రామయ్య నూరేళ్లకు పైబడి ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షిస్తున్నట్టు పేర్కొన్నారు.

## వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్న నటుడు శ్రీకాంత్

**విశ్వంభర, వేములవాడ:** ప్రముఖ టాలీవుడ్ నటుడు శ్రీకాంత్ ఆదివారం వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరస్వామి, పార్వతీ అమ్మవార్లకు ఆయనతో అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. ఆ తర్వాత ఆలయ అధికారులు ఆశీర్వచన మండపంలో అర్చకులు శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కార్తీకమాసంలో ఉపవాసాలు, ప్రత్యేక పూజల అనంతరం స్వామివారిని దర్శించుకున్నట్లు తెలిపారు. తొలిసారిగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి చాలా ఆనందంగా ఉందన్నారు. త్వరలో రామ్ చరణ హీరోగా నటించిన గేమ్ ఛేంజర్ సినిమాలో కీలకపాత్రలో నటిస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి పండగకి జనవరి 10న రిలీజ్ అవుతుందని చెప్పారు. అలాగే, కల్యాణ్ రామ్, సాయిధరమ్ తేజ్ మూవీలో నటిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, సోలోగా మరో సినిమాలోనూ నటిస్తున్నానన్నారు. తన తనయుడు రోషన్ 'ఛాంపియన్' మూవీలో హీరోగా నటిస్తున్నాడని.. ఈ మూవీని ప్రముఖ సినీ నిర్మాత స్వప్న దత్ నిర్మిస్తున్నట్లు చెప్పారు.




# కేంద్రం వైఖరికి నిరసనగా మళ్లీ రైతుల పోరుబాట

- ఈ నెల 6న ఢిల్లీకి పాదయాత్ర
- తక్కిన రాష్ట్రాల్లో అసెంబ్లీకి మార్చ్
- రైతు సంఘాల నాయకుల ప్రకటన
- అన్నదాతల డిమాండ్లను కేంద్రం పట్టించుకోకపోవడంపై ఆగ్రహం



**విశ్వంభర, చండీగఢ్:** కేంద్రం వైఖరికి నిరసనగా రైతులు మళ్లీ పోరుబాట పట్టారు. తమ డిమాండ్ల విషయంలో మోదీ సర్కారు నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టేందుకు మరోసారి కదం తొక్కడానికి సన్నద్ధమయ్యారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధతతో పాటు పలు డిమాండ్లపై రైతులు చాలాకాలంగా ఆందోళన చేస్తున్నా కేంద్రం స్పందించడం లేదు. వారితో చర్చలకు సైతం సుముఖత చూపడం లేదు. దీంతో కేంద్రం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతుల డిమాండ్ల సాధనకు ఈ నెల 6న దేశ రాజధాని ఢిల్లీకి పాదయాత్ర నిర్వహించాలని పంజాబ్‌కు చెందిన రైతు నేత శర్వణ్ సింగ్ పంధేర్ పిలుపునిచ్చారు.
దేశంలోని రైతులందరూ వారివారి నేతలు, సంఘాల ఆధ్వర్యంలో పాదయాత్రగా ఢిల్లీకి కదిలి రావాలని కోరారు. సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని భద్రతా దళాలు ఫిబ్రవరి 13న నిలిపివేయడంతో వారు పంజాబ్, హర్యానా సరిహద్దుల్లోని శంభు, ఖనౌరి ప్రాంతాల్లో నిలిచిపోయారని పంధేర్ ఆదివారం మీడియా సమావేశంలో చెప్పారు. శంభు, ఖనౌరిలలో రైతులు 293 రోజుల నుంచి ఆందోళన చేస్తున్నారన్నారు.

**ఉద్యమ కార్యాచరణ ఇలా..**

రైతుల పట్ల కేంద్రం నిర్లక్ష్య వైఖరిపై శర్వణ్ సింగ్ మండిపడుతూ శంభు నుంచి దేశ రాజధానికి ర్యాలీ నిర్వహించాలని కోరారు. ఈ మేరకు ఆయన ఉద్యమ కార్యాచరణను వివరించారు. తొలుత రైతులందరూ శంభు వద్ద కలిసి గ్రూప్‌లుగా ఏర్పడాలని, మొదటి గ్రూప్ రైతులకు శత్నాం సింగ్ పన్ను, సురీందర్ సింగ్ చౌతాలా, సుర్జిత్ సింగ్ ఫూల్, బల్జీందర్ సింగ్ నాయకత్వం వహిస్తారని చెప్పారు. ఈ గ్రూప్ తమకు కావాల్సిన నిత్యావసరాలను తీసుకుని ఢిల్లీ వైపు శాంతియుతంగా ర్యాలీగా వెళ్లాలన్నారు. రైతులు ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాదయాత్ర కొనసాగిస్తారని, తర్వాత రోడ్డు పక్కన రాత్రుళ్లు గడుపుతారన్నారు. అయితే ఒక్కో గ్రూప్‌లో ఎంతమంది ఉండాలన్న విషయాన్ని తర్వాత తెలియజేస్తామన్నారు. కేరళ, ఉత్తరాఖండ్, తమిళనాడు తదితర రాష్ట్రాల రైతులు డిసెంబర్ 6న ఆయా రాష్ట్రాల అసెంబ్లీలకు ప్రదర్శన నిర్వహించాలని రైతు నేత గుర్మనీత్ కోరారు. కాగా, ఖనౌరి సరిహద్దులో ఎస్‌కేఎం నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ తన ఆమరణ నిరాహార దీక్షను కొనసాగించారు.
ఈ ఏడాది ఫిబ్రవరి 18 నుంచి రైతులతో కేంద్రం ఎలాంటి చర్చలు జరపలేదని పంధేర్ తెలిపారు. తమ నుంచి కేంద్రం దూరంగా పారిపోతున్నదని ఆరోపించారు. కాంట్రాక్ట్ వ్యవసాయం తమకెంతమాత్రం ఆమోద యోగ్యం కాదని, పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధతను తాము కోరుతున్నామన్నారు. ఐదేండ్ల పాటు ధాన్యం, మక్కజొన్న, పత్తి పంటలకు కనీస మద్దతు ధరతో ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేస్తాయని కేంద్ర మంత్రులు అర్జున్ ముండా, పీయూష్ గోయల్, నిత్యానంద్ రాయ్‌లు తమకు ఇచ్చిన హామీలను అప్పుడే తిరస్కరించినట్టు ఆయన చెప్పారు.

రైతుల డిమాండ్లివి

తాము పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కావాలని రైతులు ప్రధానంగా కోరుతున్నారు. రుణమాఫీ చేయాలని, రైతులు, రైతు కూలీలకు పెన్షన్ ఇవ్వాలని, విద్యుత్ చార్జీలు పెంచరాదని, రైతులపై పెట్టిన పోలీస్ కేసులు ఎత్తివేయాలని, 2021 లఖింపూర్ ఖీరి బాధితులకు న్యాయం చేయాలని, భూ సేకరణ చట్టం 2013ను పునరుద్ధరించాలని, ఆందోళనలో మరణించిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం అందజేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## రైతులను నిండుగా ముంచి రైతు సంబురాలా?

- దేశంలోనే అత్యంత వేగంగా గ్రాఫ్ పడిపోయిన సీఎం రేవంత్
- ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొడితే ఊరుకునే ప్రసక్తే లేదు
- మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి




**విశ్వంభర, ఖలీల్‌వాడి :** రేవంత్‌రెడ్డి బై డిఫాల్ట్ ముఖ్యమంత్రి అయ్యాడని, రెండు రోజుల క్రితం మహబూబ్‌నగర్ సమావేశంలో ఫ్రస్ట్రేషన్, పరేషాన్‌లో ఏమేమో మాట్లాడారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రైతులను నిండా ముంచి రైతు పండుగ చేసుకోవటంలో అర్థం లేదని అన్నారు. ఆదివారం ఆయన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారం చేపట్టిన ఏడాదిలోనే దేశంలోనే అత్యంత వేగంగా గ్రాఫ్ పడిపోయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని సర్వేలు చెబుతున్నాయని వెల్లడించారు. ఆరు గ్యారెంటీలు, 13 హామీలు, 420 వాగ్దానాలు ఇచ్చి ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. హామీలు అమలు చేయలేక నిత్యం కేసీఆర్ మీద పడి అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు.
రాష్ట్రంలో రుణమాఫీ రైతులందరికీ కాలేదన్న సంగతి రుణమాఫీ కానీ రైతులకు తెలుసని చెప్పారు. ఎన్నికల సమయంలో 60 లక్షల మంది రైతులకు 40 రూ. వేల కోట్ల రుణమాఫీ అని అంచనా వేసింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. రాష్ట్రంలో 24 లక్షల మంది రైతులకు కేవలం రూ. 20 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ జరిగిందని వివరించారు. ఇంకా 36 లక్షల మంది రైతులకు 20 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేయాల్సి ఉందని తెలిపారు. ప్రతి రైతుకు రేవంత్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారం ఎకరానికి ఎగ్గొట్టిన రూ.12 వేల బోనస్, రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతుబంధును ఎగ్గొట్టే కుట్ర చేస్తుందనడానికి తుమ్మల నాగేశ్వర్‌రావు మాటలే నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొడితే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ. 2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుబంధు ఇవ్వకపోతే ప్రభు త్వం కూలిపోవడం ఖాయమని హెచ్చరించారు. హామీలు నెరవేర్చకపోతే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అంతంచేస్తారని చెప్పారు. కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల్లో ఫామ్‌హౌస్ ఉంటే తాను రాజీనామా చేస్తానని, లేకపోతే రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని సవాల్ విసిరారు.

## శ్రీశైలంలో తెలంగాణ రాజకీయ ప్రముఖులు

### స్వామి అమ్మవార్లను దర్శించుకున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వంశీ కృష్ణ

విశ్వంభర, శ్రీశైలం: శ్రీశైల శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను తెలంగాణ రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి అనసూయ సీతక్క, అచ్చంపేట శాసనసభ్యులు వంశీకృష్ణ దర్శించుకున్నారు. ఆదివారం తెల్లవారు జామున ఆలయ ప్రధాన గోపురం వద్దకు చేరుకున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వంశీకృష్ణలకు దేవస్థానం పీఆర్వో శ్రీనివాసరావు ఆలయ సంప్రదాయం ప్రకారం ఘనంగా స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ప్రాకార మండపంలో వేద పండితులతో వేదాశీర్వచనాలు వల్లించారు. మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వంశీకృష్ణలకు తీర్థప్రసాదాలు, పరిమళ విభూది, స్వామి అమ్మవార్ల జ్ఞాపికలను అంద జేశారు.
అనంతరం టీజీ లక్ష్మీ వెంకటేశ్ భవన్ మల్లికార్జున నిత్యాన్నదాన సత్రానికి మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వంశీకృష్ణ వచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన అల్పాహారం వారు స్వీకరించారు. ఈ సందర్భంగా సత్రంలో యాత్రికులకు అందించే సేవలు సౌకర్యాలను పరిశీలించి భక్తులతో మాట్లాడారు. నాగర్ కర్నూల్, అచ్చంపేట్, కల్వకుర్తి తదితర ప్రాంతాల ఆర్యవైశ్యులు శ్రీశైల క్షేత్రంలో చేస్తున్న అన్నదాన సేవలు అభినందనీయమని నిర్వాహకులను మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ శ్రీశైల క్షేత్రాభివృద్ధిలో భాగస్వాములం అవుతామన్నారు. తమవంతు సహకారాన్ని అందించి యాత్రికులకు మౌలికవసతులు, వసతి గదుల నిర్మాణాలు చేపట్టేందుకు దేవస్థానం సహకారం కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్రం డైరెక్టర్లు బచ్చు రామకృష్ణ, సురేష్, ఆంజనేయులు, రామయ్య పాల్గొన్నారు.



ఇచ్చిన హామీలను

## తుంగలో తొక్కిన రేవంత్ సర్కారు

- పార్టీ మారిన నాయకులకు పరాభవం తప్పదు
- భద్రాచలం ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గెలుపు ఖాయం
- బీఆర్ఎస్ చర్ల మండల సమావేశంలో ఎమ్మెల్సీ మధు
- 'స్థానికం'లో శ్రేణులు శ్రమించాలి : రాష్ట్ర నేతలు రాకేశ్‌రెడ్డి, రేగా

**విశ్వంభర, చర్ల :** ఆరు గ్యారెంటీలను విస్మరించి ప్రజలను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సమాధి కడదామని ఎమ్మెల్సీ తాతా మధు పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను రేవంత్ సర్కారు తుంగలో తొక్కిందని విమర్శించారు. బీఆర్ఎస్ మండలం కన్వీనర్ దొడ్డి తాతారావు అధ్యక్షతన చర్లలో ఆదివారం జరిగిన పార్టీ మండలస్థాయి విస్తృతస్థాయి సమావేశంలో తాతా మధు మాట్లాడారు. స్వార్థంతో పార్టీకి వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో చేరిన వారికి పరాభవం తప్పదని స్పష్టం చేశారు. భద్రాచలం నియోజకవర్గానికి కచ్చితంగా ఉప ఎన్నిక వస్తుందని, అప్పుడు కూడా బీఆర్ఎస్ గెలుపు ఖాయమవుతుందని స్పష్టం చేశారు. ప్రజలు కూడా బీఆర్ఎస్‌ని గెలిపించి.. పార్టీ మారిని వారికి, చేర్చుకున్న వారికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ.. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు శ్రమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నేతలు మానే రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్ పాల్గొన్నారు.




## కెనడాలో లక్షలాది వీసాలకు ముగియనున్న గడువు!




**కెనడా:** కెనడాకు పెరుగుతున్న వలసలను కట్టడి చేసేందుకు జస్టిన్ ట్రూడో ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కీలక విషయం వెల్లడైంది. వచ్చే ఏడాది చివరి నాటికి లక్షలాది మంది వలసదారుల తాత్కాలిక పర్మిట్‌ల గడువు ముగియనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. వీరిలో అనేక మంది స్వచ్ఛందంగా దేశం వీడతారని అంచనా వేస్తున్నామని కెనడా ఇమిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ తెలిపారు.సెప్టెంబర్ 2024 డిసెంబర్ 2025 మధ్య కాలంలో దాదాపు 4.9 మిలియన్ల తాత్కాలిక వీసాదారుల గడువు ముగియనుందని కెనడా ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఇదే విషయాన్ని కామన్స్ ఇమిగ్రేషన్ కమిటీ ముందు కన్జర్వేటివ్ ఎంపీ టామ్ మియాక్ ప్రస్తావించారు. దేశం నుంచి వెళ్లిపోయే వారి విషయంలో ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటోందని ఆయన ప్రశ్నించారు. ఇందులో 7.66 లక్షల స్టడీ పర్మిట్ల గడువు డిసెంబర్ 2025 నాటికి ముగిసిపోతుందని, వారందరినీ కెనడియన్ బార్డర్ సర్వీసెస్ ఏజెన్సీ ట్రాక్ చేస్తుందా? అని అడిగారు. దీనిపై మంత్రి మిల్లర్ బదులిస్తూ.. దేశాన్ని వీడేందుకు అనేక మార్గాలు ఉన్నాయని, ఇందులో ఎక్కువ మంది స్వచ్ఛందంగానే వెళ్లిపోతారని అంచనా వేస్తున్నామని చెప్పారు. అయితే, తాత్కాలిక వీసాదారులందరూ దేశాన్ని వీడిపోవాల్సిన అవసరం లేదని, అందులో కొందరు రెన్యూవల్స్ లేదా పోస్టుగ్రాడ్యుయేట్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. వాటి గడువు తొమ్మిది నెలల నుంచి మూడేళ్లు ఉంటుందన్నారు. గడువు తీరినా ఇక్కడే ఉండిపోయే వారిపై చట్టపరమైన చర్యలకు సంబంధించిన అంశాన్ని సీబీఎస్ఏ పర్యవేక్షిస్తుందన్నారు.


## బీఆర్ఎస్ పార్టీయే ప్రజలకు అండ

### కాంగ్రెస్, బీజేపీ నుంచి 200 మంది బీఆర్ఎస్‌లో చేరిక

**విశ్వంభర, న్యూశాయంపేట :** అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజల కష్టసుఖాల్లో బీఆర్ఎస్ పార్టీయే పాలుపంచుకుంటుదని మాజీ చీఫ్‌విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాసర్ పేర్కొన్నారు. హనుమకొండ 49వ డివిజన్ నాగేంద్రనగర్‌కు చెందిన బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు 200 మంది కంది యాదగిరి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు విష్ణువర్ధన్, రాజు అధ్యక్షతన ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. దాస్యం వినయ్‌భాసర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల పక్షాన పోరాడేది కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనన్నారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్లు సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, మర్రి యాదవరెడ్డి పాల్గొన్నారు.

## నేపాల్‌కు పోటెత్తిన విదేశీ పర్యాటకులు.. భారత్ నుంచే అధికం!

**ఖాట్మండ్:** హిమాలయ పర్వతాలు, ప్రకృతి అందాలతో ఆకట్టుకొనే నేపాల్‌కు విదేశీ పర్యాటకులు భారీగా పోటెత్తుతున్నారు. ఈ ఏడాది నవంబర్ వరకు 10లక్షల మందికి పైగా విదేశీ పర్యాటకులు విమానాల్లో తరలివచ్చినట్లు అధికారులు వెల్లడించారు. వీరిలో భారత్ నుంచి వచ్చిన వారే అధికమని పేర్కొన్నారు. జనవరి నుంచి నవంబర్ వరకు 10,55,533 మంది విదేశీ పర్యాటకులు సందర్శించారని నేపాల్ టూరిజం బోర్డు తెలిపింది. గడిచిన 11 నెలల కాలంలో భారత్ నుంచి 2,93,231మంది పర్యాటకులు వచ్చారని.. తమ దేశ పర్యాటకంలో భారత్ అతిపెద్ద మార్కెట్ వనరుగా మరోసారి నిలిచిందని ఓ ప్రకటనలో ఎన్‌టీబీ పేర్కొంది. భారత్ నుంచి గతేడాది కన్నా ఈసారి పర్యాటకుల తాకిడి 2.1శాతం పెరిగినట్లు తెలిపింది. అయితే, మొత్తంగా వృద్ధి కనబడినప్పటికీ.. గతేడాది నవంబర్‌లో సందర్శించిన వారి సంఖ్య (24,443మంది)తో పోలిస్తే ఈసారి అదే మాసంలో 18.5శాతం (19915మంది)తగ్గుదల నమోదు కావడం గమనార్హం. మరోవైపు, డిసెంబర్‌లో విదేశాల నుంచి దాదాపు 70వేల మందికి పైగా అదనంగా వచ్చే అవకాశం ఉందని.. తద్వారా మొత్తంగా ఈ ఏడాది విదేశీ పర్యాటకుల సంఖ్య 1.11మిలియన్లకు చేరవచ్చని ఎన్‌బీటీ అంచనా వేస్తోంది.



# విషవలయంలోకి నెడుతున్న అభివృద్ధి, వికాసాలు

- ఆధునికాభివృద్ధితో పెను సవాలుగా మారిన కాలుష్యం
- నేడు జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం

**అభివృద్ధి, వికాసాలు మనిషిని సమస్యలనుంచి విముక్తున్ని చేసే బదులు మరింతగా విషవలయంలోకి నెడుతున్నాయి. ఆధునికాభివృద్ధితో కాలుష్యం పెను సవాలుగా మారింది. పట్టణాలు, నగరాలు కాలుష్యకాటుతో నివాసయోగ్యం కాకుండా తయారవుతున్నాయి. మన దేశంలో రాజధాని ఢిల్లీతోపాటు పలు నగరాల్లో ఇటువంటి పరిస్థితులు నెలకొన్నాయి. భోపాల్‌లో విషవాయువు 15 వేల మంది ప్రాణాలు తీసి, ఆరు లక్షల మంది నగరవాసుల జీవితాల్లో కల్లోలంనింపి ఇప్పటికి 40ఏళ్లు అవుతున్నది. రాజ్యాంగం దేశ పౌరులకు అన్నివిధాలా రక్షణ కల్పించింది. సమానత్వాన్ని కాంక్షించింది. కానీ రాజ్యాంగం ఉనికిలోకి వచ్చిన నాటి నుంచే చట్టా ల అమలు ప్రశ్నార్థకంగా మిగులుతూనే ఉన్నది. ఎన్ని చట్టాలున్నా వాటి అమలు కీలకం. ఏ దేశం లో నైనా సమర్థమైన పాలన మాత్రమే చట్టానికి ఆయువు పోయగలుగుతుంది. భోపాల్ విషాదం లో చట్టాల ఉల్లంఘనే ప్రధాన సమస్య.**

### 40ఏళ్ల క్రితం భోపాల్ గ్యాస్ దుర్ఘటన..

సరిగ్గా 40 ఏళ్ల క్రితం 1984 డిసెంబర్ 2న మధ్య ప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ నగరంలో 'యూనియన్ కార్బైడ్ కెమికల్స్' ఫ్యాక్టరీలో నుంచి విషవాయువులు వెలువడి నగరంలోని వేలాదిమంది ప్రజలను నిమిషాలలో మట్టుబెట్టాయి. ఈ ఘోరకలిని అందరూ గుర్తుంచుకునే విధంగా కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 2ను 'జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం'గా ప్రకటించింది. భోపాల్ దుర్ఘటన వల్ల 8 నుంచి 10 వేల మంది మరణించగా, మొత్తంగా 25,000 మంది ఈ గ్యాస్ లీకేజీ అనంతర పరిణామాలతో మరణించినట్లు మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. అంతే కాకుండా పరోక్షంగా 5 లక్షలమందికి పైగా ప్రజలు అనారోగ్యాల బారినపడ్డారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద పారిశ్రామిక కాలుష్య ఘోరకలి. అయితే ఈ విషాదాంతం ప్రపంచ దేశాలకు ఒక కనువిప్పు కాగా, భారతదేశంలో మాత్రం ప్రభుత్వాలకు కనువిప్పు కలుగలేదు.

### జీవచ్ఛవాల్లా బతుకుతున్న బాధితులు..

సంఘటన జరిగి నేటికి 40 సంవత్సరాలు కావస్తున్నా, ఇప్పటికీ దాదాపు రెండున్నర లక్షల మంది వైద్యం చేయించుకుంటూనే ఉన్నారు. ఇంకా విషవాయువు వెలువడిన ప్రాంతం చుట్టుప్రక్కల ప్రజలు జీవచ్ఛవాల్లా బతుకుతున్నారు. బాధాకరమైన విషయమేమిటంటే సంఘటన జరిగి 33 ఏళ్లు కావస్తున్నా ఇప్పటికీ ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లో విషపదార్థాల తొలగింపు పూర్తి కాలేదు. అక్కడి భూగర్భ జలాలపై ఇంతవరకు 15 అధ్యయనాలు జరిగినా వ్యర్థాల తొలగింపు, భూగర్భ జలాల శుద్ధి జరగలేదు. నేటికీ ప్రమాద బాధితులు నష్టపరిహారం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

ఈ ప్రమాదానికి కారణమైన "యూనియన్ కార్బైడ్ కెమికల్స్" యజమాని ప్రమాదం జరిగిన నాలుగు రోజుల తరువాత భారత్‌కు వచ్చాడు. అతడిని 1984 డిసెంబర్ 7న అరెస్ట్ చేశారు. అయితే ఎంత త్వరగా అరెస్ట్ చేశారో అంతే త్వరగా ప్రధాన నిందితుడు వారెన్ అండర్సన్ 'భారత్‌కు మళ్లీ తిరిగి వస్తానని హామీ ఇచ్చి' ప్రభుత్వ లాంఛనాలతో అమెరికాకు వెళ్ళిపోయాడు. యూనియన్ కార్బైడ్ సంస్థను యాజమాన్యం మరో కంపెనీకి అమ్మడం వలన బాధితులు ఎవరిని ఆశ్రయించాలో తెలియడం లేదు. ఇంతా చేస్తే బాధితులకు దక్కిన తలసరి నష్టపరిహారం కూడా 15 వేలకు మించలేదు.

ప్రపంచీకరణ పేరుతో అభివృద్ధి చెందిన దేశాలు వర్ధమాన దేశాల ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. విదేశీ కంపెనీలు అభివృద్ధి పేరుతో భారత్ లాంటి వర్ధమాన దేశాలలో పరిశ్రమలు స్థాపించి లాభాలు పిండుకొంటున్నాయి. మన ప్రభుత్వాల ఉదాసీనత వలన దేశ ప్రజల ప్రాణాలు, దేశ పర్యావరణాన్ని ఫణంగా పెట్టి పారిశ్రామిక అభివృద్ధి జరుగుతోంది. భోపాల్ దుర్ఘటనలో మరణించినవారంతా



పేదప్రజలే కావడంతో ప్రమాదంలో మరణించిన వారి సంఖ్యను లెక్కపెట్టకుండా సామూహికంగా ఖననం చేశారు.

### నిర్లక్ష్యమే ఆ ఘోర కలికి కారణం..

దేశంలో ఆహారపదార్థాల ఉత్పాదకత పెంచి ఆహార సంక్షోభం నుంచి బయటపడేందుకు హరితవిప్లవం ప్రారంభించారు. దీనికి ఊతం ఇచ్చేందుకు రసాయనిక ఎరువులు, పురుగు మందులు అవసరమయ్యాయి. అలాంటి ఒకానొక పురుగుమందు 'సెవిన్'. దీని తయారీకి 1969లో యూనియన్ కార్బైడ్ కంపెనీని భోపాల్‌లో నెలకొల్పారు. మిథైల్ ఐసొసైనేట్ (ఎంఐసీ) అనే విషవాయువుతో రసాయనిక ఎరువులు తయారు చేయటం ప్రారంభించారు. 1976 నుంచే అక్కడ పని చేస్తున్న ట్రేడ్ యూనియన్లు ఎంఐసీ ప్రమాదాన్ని గురించి యాజమాన్యానికి చెబుతూనే ఉన్నాయి. అవి భయపడినట్లుగానే భోపాల్ దుర్ఘటన జరిగి పెను విషాదాన్ని మిగిల్చింది. 1982లో యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీలో 45 మంది కార్మికులు విషవాయు ప్రభావానికి గురై చావు అంచులకు వెళ్లారు. పత్రికల్లో 1980ల నుంచే హెచ్చరికల కథనాలు వచ్చాయి. కానీ ప్రభుత్వాలు ఈ హెచ్చరికలను పెడచెవిన పెట్టాయి. ఫ్యాక్టరీలో ప్రమాదకర పరిస్థితులను కంపెనీ యాజమాన్యం పట్టించుకోలేదు. ప్రభుత్వాల అలసత్వమూ, బహుళ జాతి కంపెనీ యాజమాన్యానికి ఉన్న నేరపూరిత నిర్లక్ష్యమూ కలిసి అతి పెద్ద పారిశ్రామిక ప్రమాదానికి దారి తీసింది.

### భోపాల్ గ్యాస్ ప్రమాదం దేశంలోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర చర్చ..

భోపాల్ గ్యాస్ ప్రమాదం దేశంలోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రమాదకర వాయువులతో నడిచే కంపెనీలు జనావాసాల మధ్య, అదీ ఓ మహానగరంలో ఉండటం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. ఈ నేపథ్యం లో జరిగిన ప్రాణనష్టానికి పరిహారంగా భారత ప్రభుత్వం యూనియన్ కార్బైడ్ కంపెనీని రూ. 320 కోట్లు ఇవ్వమని కోరింది. ఈ దుర్ఘటనపై విచారణచేసిన ప్రత్యేక కోర్టు బాధితులకు 350 కోట్లు పరిహారం ఇవ్వాలని తీర్పు చెప్పింది. అయితే 1989లో కోర్టు బయట జరిగిన ఒప్పందంలో 47 కోట్ల పరిహారం ఇచ్చి కంపెనీ చేతులు దులుపుకొన్నది! విషవాయువుతో దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉంటాయన్న నిపుణుల హెచ్చరికలతో సుప్రీంకోర్టు బాధితుల కోసం ప్రత్యేక దవాఖానా నడపాలని కంపెనీని ఆదేశించింది. అది కూడా ఆచరణలో అమలు కాలేదు.

భోపాల్ దుర్ఘటన జరిగిన నాలుగు దశాబ్దాల తర్వాత కూడా భోపాల్‌గ్యాస్ పీడిత్ సంఘర్ష్ మోర్చా, ఇతర సంఘాలు ఇప్పటికీ న్యాయం కోసం పోరాడుతున్నాయి. మధ్యప్రదేశ్ సర్కారు మొదటినుంచి బాధితుల పక్షాన నిలువటం లేదు. సుప్రీంకోర్టులో నడుస్తున్న కేసులో మృతుల సంఖ్యను కూడా ప్రభుత్వం సరిగా తెలియ జేయటం లేదు. మృతులు 5వేల మంది అని, మరోసారి 15వేల మందని పత్రాలు దాఖలు చేయడం నిర్లక్ష్యానికి నిలువుటద్దం. భోపాల్ బాధితుల పక్షాన పౌర, ప్రజాసంఘాలు నేటికీ పెద్ద ఎత్తున పోరాటాలు కొనసాగిస్తున్నాయి. రంగస్థల నటుడు హబీబ్ తన్వీర్ ఈ దురంతంపై 'ఏక్ జహరీలీ హవా' అనే విషాద నాటకం రూపొందించారు. 2002లో డొమినిక్ లాపెరే, జేవియర్ మూర్ 'నైట్ ఇన్ భోపాల్' అనే పుస్తకం రాసి బాధితులకు అంకితం ఇచ్చారు.

### గుణపాఠాలు నేర్చుకోని ప్రభుత్వాలు..


ఈ విషాదం తర్వాతనైనా ప్రభుత్వాలు కాలుష్య నియంత్రణకు, ప్రమాదాల నివారణకు ఏ గుణపాఠాలు నేర్చుకోలేదు. ఆచరణాత్మక చర్యలు పక్కన పెట్టి, చట్టాలతోనే సరిపెట్టారు. భోపాల్ దుర్ఘటన నేపథ్యంలో కేంద్రం 1986లో 'పర్యావరణ పరిరక్షణ చట్టం' తెచ్చింది. దానికంటే ముందే 1974లో జాతీయ స్థాయిలో, రాష్ట్రాల స్థాయిలలో కాలుష్య నివారణ మండలి విభాగాలు ఏర్పాటయ్యాయి. ప్రమాదకర రసాయనాల నిల్వ, వాటి దిగుమతి నిబంధనలు, ప్రమాదకర వ్యర్థపదార్థాల నిర్వహణ, వాటి రవాణా నిబంధనలు, జీవ రసాయనాల తయారీ, నిల్వ, ఎగుమతిదిగుమతి నిబంధనలు లాంటివి ఉనికిలోకి వచ్చాయి. అలాగే.. 1996లో జాతీయ పర్యావరణ ట్రిబ్యునల్ చట్టం; రసాయన ప్రమాదాల నివారణ, ప్రతిస్పందన నిబంధనలు; పారి శ్రామిక వ్యర్థాల నిర్వహణ, రవాణా నిబంధనలు; శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలు రూపొందాయి. వీటి అమలు ఏ స్థాయిలో ఉన్నదో నేడు దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో ఉన్న కాలుష్య స్థాయిలే తెలియజేస్తున్నాయి. పారిశ్రామిక అభివృద్ధిలో అనుసరించాల్సిన నిబంధనలు పాటించకపోవటం వల్లనే కాలుష్యం పెరుగుతున్నది. నీటినీ, గాలినీ కాలుష్యం విషపూరితం చేస్తున్నది. గంగ నుంచి మూసీ దాకా ఒకే వ్యథ. సర్వత్రా నీటి కాలుష్యం. ఢిల్లీ నుంచి గల్లీ దాకా ఒకటే కథ.. వాయు కాలుష్యం. ఉత్పాదక కార్యకలాపాలతో వచ్చే కాలుష్యాలను నియంత్రించే బాధ్యత ఉత్పత్తిదారుల మీద ఉన్నది. కాలు ష్య నివారణ చర్యల పరిశీలన, అమలు ప్రభుత్వా ల బాధ్యత. కాలుష్యమైనా, భోపాల్ గ్యాస్ దుర్ఘటన అయినా నిబంధనల ఉల్లంఘన ఫలితమే. అభివృద్ధి అంటే పర్యావరణ పరిరక్షణ, దేశ ప్రజ లకు పూర్తి రక్షణతో కూడిన అభివృద్ధి ఉండాలి. అంతేకానీ ప్రజల ప్రాణాలను ఫణంగా పెట్టి పారిశ్రామిక కాలుష్యానికి కారణమవుతున్న ఇలాంటి దుర్ఘటనలు ఇకనైనా ప్రభుత్వాలకు కనువిప్పు కలిగించాలి. దేశంలో ఎన్నో పర్యావరణ చట్టాలున్నా, వాటిని సమగ్రంగా అమలు చేయడం లేదు. ముఖ్యంగా పారిశ్రామిక పర్యావరణ చట్టాలను అమలు చేయడంలో ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి. ఆయా కంపెనీల యాజమాన్యాలకు పూర్తి ఆదేశాలు అందించాలి. అలా చేసినప్పుడే భోపాల్ లాంటి దుర్ఘటనలు మళ్లీ ఉత్పన్నం కాకుండా చూసుకోగలం. ఈ నేపథ్యంలో కాలుష్య వ్యతిరేక చైతన్యాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఉన్నది. తద్వారానే కాలుష్య కోరల నుంచి దేశాన్ని రక్షించు కోగలుగుతాం.

- తీగల ప్రభాకర్ రెడ్డి
సీనియర్ జర్నలిస్టు, పర్యావరణ వేత్త
సెల్: 9948957759

# కవి హృదయ స్పందనే కవిత్వం

- కవిత్వం అల్లడానికి కవి తాత్వికుడు కానవసరం లేదు

**కవిత్వం జనించడానికి భూమిక హృదయం. కవి హృదయ స్పందనే కవిత్వం. కవిత్వం పాఠకులను రంజింప చేస్తుంది. అయితే కవిత్వం అల్లడానికి కవి తాత్వికుడు కానవసరం లేదు. కానీ తాత్విక పునాదులపై నిర్మించబడ్డ కవిత్వం పాఠకులను ఆలోచింపజేస్తుంది. తెలుగు కవిత్వ పరిణామాన్ని అనేకమంది విమర్శకులు పరిశోధకులు విశ్లేషించారు. ఈ విశ్లేషణలన్నీ చారిత్రక కోణం లోనో, సామాజిక కోణంలోనో మరే ఇతర ప్రాతిపదికల పైనో జరిగాయి కానీ తాత్విక నేపథ్యంలో తెలుగు కవిత్వ పరిణామాన్ని విశ్లేషించిన పరిశోధకులు డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి.**






తెలంగాణ అస్తిత్వ నిర్మాణంలో సైద్ధాంతిక పునాదులు వేసిన కీలక సాహితీవేత్తల్లో చెప్పుకోదగిన వారు డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి . తెలంగాణ సాహిత్యపు ఔన్నత్యాన్ని సాధికారికంగా నినదించిన ఉద్యమ స్వరం ఆయనది. ఒకానొక సందర్భంలో సురవరం ప్రతాపరెడ్డి గురించి మాట్లాడుతూ " సురవరం ప్రతాపరెడ్డి పయనం ఆయన కోరుకున్నట్టు జరగలేదు. ఆనాటి తెలంగాణ సమాజం ఎట్లా డిమాండ్ చేస్తే అట్లా పయనించినాడు" ( వినిర్మాణం పుట 79 ). అంటారు సుంకి రెడ్డి నారాయణరెడ్డి. ఈ మాటలు సుంకిరెడ్డి కి కూడా వర్తిస్తాయి. మొదట కవిగా ప్రారంభమైన ఆయన ప్రస్థానం విమర్శకుడిగా, సంపాదకుడిగా, పరిశోధకుడిగా, చరిత్రకారుడిగా, పాఠ్య గ్రంథాల రచయితగా, అస్తిత్వ ఉద్యమాల నిర్మాతగా, వక్తగా, తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక భూమిక అందించిన మేధావిగా బహుముఖీనంగా సాగింది. ఇందుకు కారణాలు అనేకం. సుంకిరెడ్డి విద్యార్థిగా పరిశోధకుడిగా యూనివర్సిటీలో ఉన్న నాటికి విప్లవోద్యమ ప్రభావం తీవ్రంగా ఉంది. ఆ ప్రభావంతోనే ఉస్మానియా రైటర్స్ సర్కిల్ స్థాపించి 'ఈతరం యుద్ధ కవిత' ను తన సంపాదకత్వంలో వెలువరించారు. ఉద్యోగ జీవితంలో తొలినాళ్లలో పనిచేసిన శ్రీకాకుళంలో శ్రీకాకుళ సాహితి వంటి సంస్థలు స్థాపించడానికి ఈ ఉద్యమ ప్రభావమే కారణం. ఈ ప్రభావాలన్నీ 'తాత్విక నేపథ్యంలో తెలుగు కవిత్వ పరిణామం' గ్రంథ రచనకు హేతువులే. కవిత్వం పై పరిశోధన చేసే నేటి పరిశోధక విద్యార్థులకు కర దీపం వంటి గ్రంథమిది.

తాత్వికత అంటే ఏమిటి, తత్వశాస్త్ర ఆవిర్భావ పరిణామ వికాసాలను, ఆదిమ సమాజం నుండి ప్రజాస్వామ్య వ్యవస్థ వరకు సమాజాల ధోరణులను, శాస్త్రానికి వివిధ శాస్త్రాలకు మధ్య ఉన్న సంబంధాలను సుంకిరెడ్డి నారాయణరెడ్డి ఈ గ్రంథంలో సాధికారికంగా చర్చించారు. ' తత్వశాస్త్రం సాహిత్యంతో పాటు మిగతా అన్ని రంగాలతో అన్యోన్య సంబంధం కలిగి ఉంటుంది. తత్వశాస్త్రం సాహిత్యం పరస్పర ఆశ్రయ ఆశ్రితాలు' అని సూత్రీకరించారు. సాహిత్యం పై తత్వశాస్త్రం ప్రభావం అధికంగా ఉన్నప్పటికీ తత్వశాస్త్రం పై సాహిత్య ప్రభావం తక్కువగా ఉంటుందని తేల్చి చెప్పారు.

ప్రాచీన తెలుగు కవిత్వంలోని తాత్విక లోతులను ఆవిష్కరించారు. నన్నయ భారతం మొదలు వేమన వరకు ప్రాచీన కవుల తాత్వికతను పూర్వ మీమాంస ఉత్తర మీమాంస, అద్వైతం విశిష్టాద్వైతం శుద్ధాద్వైతం నేపథ్యంలో చర్చించారు. వేమన వీరబ్రహ్మం, నాజరయ్య వంటి కవుల రచనల్లో ఆధునిక సంస్కరణ భావాల బీజాలు కనిపిస్తాయని పేర్కొన్నారు.

ఆధునిక కవిత్వంలో వివిధ ధోరణులపై సమగ్ర విశ్లేషణ ఈ గ్రంథంలో చోటు చేసుకున్నది. ఆధునిక యుగారంభ దశలో భారతీయ సంస్కర్తలపై కవులపై పాశ్చాత్య తాత్వికుల మానవవాద ప్రజాస్వామిక వాదాల ప్రభావం దృష్ట్యా ఈ యుగాన్ని సాంప్రదాయక పద్ధతిలో భావ కవిత్వం నవ్య కవిత్వం అనకుండా ప్రజాస్వామిక యుగంగా నిర్వచించారు. పాశ్చాత్య విద్యతో ప్రభావితులైన భారతీయులు ఎందరో గొప్ప తాత్వికులుగా ఎదిగారు. బ్రహ్మ సమాజం ఆర్య సమాజం వంటి సంస్థలు సంస్కరణ ఉద్యమానికి శ్రీకారం చుట్టాయి. ఈ ప్రభావమంతా సాహిత్యం పై కనిపిస్తుంది. ఈ పరిణామాల వల్ల ఆధునిక కవిత్వం పరిఢవిల్లింది. ఈ అంశాలన్నీ సుంకిరెడ్డి నారాయణరెడ్డి గారి సిద్ధాంత గ్రంథంలో సవివరంగా కనిపిస్తాయి. గురజాడ, వేమన తదితరుల మానవతావాదం పై చర్చిస్తూ రెండు మానవతా వాదాల గురించి లోతైన విశ్లేషణ కనిపిస్తుంది. ఆధునిక సాహిత్యంలో వచ్చిన భావ కవిత్వ యుగం, భావ కవిత్వం పై తిరుగుబాటు దశ, అభ్యుదయ కవిత్వ యుగం, మొదలైన కవిత్వ ఉద్యమాల గురించి చర్చించడమే కాక ఆయా యుగాల్లో వచ్చిన కవుల కవిత్వ తాత్వికతను సోదాహరణంగా నిరూపించారు. మార్క్సిస్టు సిద్ధాంత భూమిక, డాడాయిజం, సర్రియలిజం, అరాచక వాదం, వాస్తవికవాదం మానవతావాదం మొదలైన వాదాలతో అభ్యుదయ వాదానికి ఉన్న సంబంధాన్ని లోతుగా చర్చించారు. అభ్యుదయ కవిత్వంలో మధ్యతరగతి జీవిత చిత్రణ, తెలంగాణ పోరాట కవిత్వం, ఆంధ్ర రాష్ట్రోద్యమ కవిత్వం మొదలైన అంశాల తాత్విక నేపథ్యాన్ని విశ్లేషించారు. దిగంబర కవిత్వం విప్లవ కవిత్వం వాటి తాత్విక దృక్పథాలపై విమర్శకుల అభిప్రాయాలు జోడించడంతోపాటు ఆయా కవిత్వ ఉద్యమాల తాత్విక నేపథ్యాన్నివిశ్లేషించారు.

ప్రజాస్వామిక భావన, ప్రేమ సిద్ధాంతం. ' వర్ణ వివక్ష, స్త్రీ వివక్ష మొదలైన వాటిని తొలుత గురజాడ ప్రవేశ పెట్టాడని, భావకవులు వాటిని కాల్పనికంగా అభివ్యక్తం చేశారని సుంకిరెడ్డి నారాయణరెడ్డి పరిశోధనలో తేల్చారు. సాంప్రదాయిక కవిత్వం నుంచి ఆధునిక కవిత్వంలోనికి, భావ కవిత్వ దశ నుంచి అభ్యుదయ కవిత్వ దశలోకి , అభ్యుదయ కవిత్వం నుంచి విప్లవ కవిత్వం లోనికి కవిత్వ పరిణామ దశలను సంధి యుగాలుగా పేర్కొనడం ఈ పరిశోధకుడు సాధించిన నవ్యత. ఈ సంధి సమయంలో ఏర్పడ్డ స్తబ్దతను, ఆ స్తబ్దతను ఛేదించడానికి కవులు చేసిన ప్రయత్నాలను అనేక ఉదాహరణల ద్వారా ఈ పరిశోధనా గ్రంథంలో సుంకిరెడ్డి నిరూపించారు.

దిగంబర కవుల తాత్వికతను గురించి చర్చిస్తూ ఆ కవిత్వంలో కనిపించిన అరాచక వాదం 19వ శతాబ్దంలో రష్యా లో వచ్చిన అరాచక వాదానికి పోలికే లేదని స్పష్టం చేశారు. దిగంబర కవుల్లో ఉన్న ఆదర్శ తత్వం, అరాచకతత్వం, ఆవేశం గురించి వివరించడంతో పాటు ఆరుగురు కవుల్లో కేవలం నగ్నముని నిఖిలేశ్వర్ చెరబండ రాజు మాత్రమే మార్క్సిస్టు సిద్ధాంతం పై మొగ్గు చూపారని సూత్రీకరించారు. ఏ దృక్పథం నుంచి ఏ తిరుగుబాట్ల ప్రభావంతో రాసినా దిగంబరకవులు అప్పటి తెలుగు కవితా రంగంలో స్తబ్దతను ఛేదించారని, సమాజంలోని అన్యాయాలను అక్రమాలను శక్తివంతంగా బయటపెట్టగలిగారని తేల్చి చెప్పారు.

'దిగంబర కవులకు కొనసాగింపుగా సమాజంలోనూ సాహిత్యంలోనూ నెలకొన్న స్తబ్దతను, నిరుత్సాహ వాతావరణాన్ని ఎన్నికల తతంగాన్ని , ప్రజాస్వామిక సామ్యవాదాన్ని విమర్శించి, ధ్వంసించి,తిరుగుబాటు చేసి సాయుధ పోరాటాన్ని మెచ్చి విప్లవ దృక్పథానికి, తిరిగి వర్గ దృక్పథానికి నాంది ప్రస్తావన చేశారు తిరగబడు కవులు . ఈ రకంగా విప్లవ కవిత్వ యుగం ఆవిర్భవించడానికి విప్లవ కవిత్వం ఉద్యమరూపం పొందడానికి తగిన ప్రాతిపదికను ఏర్పరిచారు' అంటారు డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి. ఈ సూత్రీకరణలన్ని భావి పరిశోధకులకు దిక్సూచి వంటివి. ఈ గ్రంథం 1985 90 కాలంలో రాసినప్పటికీ నేటికీ ప్రాసంగికత కోల్పోలేదు. పైపెచ్చు నేడు సాహిత్యంలో వస్తున్న విభిన్న ధోరణులను మరింత లోతుగా అధ్యయనం చేయడానికి ఆకరగ్రంథం గా ఉపయోగపడుతుంది. సునిశితమైన విమర్శ, స్పష్టమైన సూత్రీకరణ, సాధికారికమైన శోధన సుంకిరెడ్డి గారి ప్రత్యేకత. కాల్పనికత అనుభూతి తత్వాన్ని గురించి చర్చిస్తూ కాల్పనిక తత్వానికి ఉండే ప్రత్యేక లక్షణాలను నిర్ధారించారు. ప్రతీకలతో ఇమేజరీలతో అనుభూతి తత్వంతో కూడిన భావుకత కు ప్రాధాన్యతనిచ్చే కవిత్వమే కాల్పనిక కవిత్వం అంటారు. ఈ నిర్వచనం ద్వారా భావుకత, అనుభూతి, అలంకారికత, రూప ప్రాధాన్యత కాల్పనిక కవిత్వ లక్షణాలుగా పేర్కొన్నారు. భవిష్యత్తులో సాహిత్య చరిత్రలు రాసే రచయితలకు కూడా ఇటువంటి సూత్రీకరణలు ఒక మార్గ నిర్దేశనం చేస్తాయి. తెలుగులో ఉన్న అతికొద్ది ప్రామాణిక పరిశోధనా గ్రంథాల సరసన చేర్చవలసిన గొప్ప గ్రంథమిది.

సాహిత్య విద్యార్థులు పరిశోధక విద్యార్థులు విశ్వవిద్యాలయాలలో సాహిత్యాన్ని బోధించే ఆచార్యులు తప్పక చదువవలసిన గ్రంథం.



- డాక్టర్ సాగర్ల సత్తయ్య
7989117415

# అధ్వాన్నంగా పెద్దగోల్కొండ టూ కొల్లపడకల్ రోడ్డు

- రెండు లైన్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిందని వెల్లడించిన పీఏసీఎస్ చైర్మన్
- రోడ్డుకు మరమ్మతులు చేసి ఇబ్బందులు తొలగించాలని వినతి
- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లిన మాజీ సర్పంచ్‌ల సంఘం సభ్యులు
- తక్షణమే స్పందించి అధికారులకు ఫోన్ చేసిన మాజీ మంత్రి సబితా
- మరమ్మతులు చేయాలని ఆదేశాలు జారీ



**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండలం నాగారంలో పెద్దగోల్కొండ నుంచి కొల్లపడకల్ వెళ్లే రెండు లైన్ల రోడ్డు దెబ్బతిందని పీఏసీఎస్ వైస్ చైర్మన్, మాజీ సర్పంచుల బృందం సభ్యులు మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆదివారం సబితా ఇంద్రారెడ్డిని కలిసి సమస్యను వివరించారు. ప్రధానంగా పెద్దగోల్కొండ నుంచి కొల్లపడకల్ వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిందని, తక్షణమే మరమ్మతులు చేసి ఇబ్బందులు తొలగించాలని కోరారు. అనంతరం ఆమె స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మహేశ్వరం పీఏసీఎస్ వైస్ చైర్మన్ దేవరపల్లి వెంకటేశ్వర రెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు గాదె థామస్ రెడ్డి, మాజీ సర్పంచులు బండారు లింగం ముదిరాజు, మంత్రి రాజేష్, మాజీ రంగారెడ్డి జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఎంఏ సమీర్, రమేష్, మల్లేష్, శ్రీకాంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వీరేశం పరామర్శ



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని శోభనాద్రిపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొండకింది శేఖర్ రెడ్డి ఇటీవల ఓ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని రామన్నపేట మండల కేంద్రంలోని బీసీ కాలనీలో జరిగిన కారు ప్రమాదంలో ఆయనకు గాయాలయ్యాయి. దీంతో వెంటనే ఆయనను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నాడు. అయితే ఆదివారం ఆయనను స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శించారు. ప్రమాద వివరాలను తెలుసుకొని తొందరగా కోలుకోవాలని కోరారు. అనంతరం మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకట్ రాజిరెడ్డి, గుత్తా నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిర్మించారు.. వదిలేశారు!



**విశ్వంభర, మేడిపల్లి:** గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ నీటి సరఫరా పథకం మధ్యలోనే నిలిచిపోయింది. ట్యాంకు నిర్మాణాలు పూర్తయిన నీటి సరఫరా అందకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకంలో భాగంగా ట్యాంకు నిర్మించింది. అయితే తర్వాత కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ ట్యాంకు నిరుపయోగంగా మారింది. దీంతో నీటికోసం గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. చేసేదేమిలేక కొంతమంది తమ వార్డులలో సొంతంగా బోర్లు వేసుకొని దాహార్తిని తీర్చుకుంటున్నారు. అయితే ఒక్కో బోరుకు దాదాపు 40 నుంచి 50 నీటి కలెక్షన్లు బిగించుకొని వంతుల వారిగా పలు కుటుంబాలు నీటిని వాడుకుంటున్నారు. ఈ బోర్లకు నీటిని వాడుతున్న కుటుంబాలే మరమ్మత్తులు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే ఏవైనా శుభకార్యాలకు ఇతరులను ప్రాధేయపడాల్సిన పరిస్థితి కట్లకుంట గ్రామంలో నెలకొంది. దీంతో పాటు అడుగంటుతున్న భూగర్భ జలాలు వేధిస్తున్నాయి. కొంతమంది గ్రామాలను విడిచి పట్టణాలకు వలస వెళ్తున్నారు. అయితే మిషన్ భగీరథ నీటి సరఫరా ఎందుకు జరగడం లేదని అడిగినా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమస్యను గుర్తించి త్వరలోనే పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# నిరుపేదలకు నిత్యావసర సరుకులు



**విశ్వంభర, మహబూబాబాద్:** ప్రజలకు బియ్యం, కూరగాయలు పంపిణీ చేసినట్లు గ్లోబల్ పీస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా బాలు నాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక జిల్లా ఎక్సైజ్, ప్రోహిబిషన్ కార్యాలయం సమీపంలోని సీపీఎం కాలనీలో నివాసం ఉంటున్న పేదలకు గ్లోబల్ పీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10వేల విలువ గల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ సేవే మాధవ సేవగా భావించి ప్రార్థించే పేదల కన్నా సహాయం చేసే చేతులే మిన్న అనే నినాదంతో ముందుకు వెళుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా ఇలాంటి కార్యక్రమాలు చేసినప్పుడే సమాజం మనుగడ పురోగతి సాధిస్తుందన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో భిక్షపతి, గుగులోత్ వేణు గోపాల్, బి.సురేందర్ నాయక్, రూపి రెడ్డి, నవీన్ రెడ్డి, ఎస్.కె బషిరుద్దీన్, భూక్య స్వర్ణలత, భూక్య భరత్ నాయక్, జి.బాదుర్, తదితరులు పాల్గొన్నారు.

## బస్ డిపోలో వనభోజనాలు



**విశ్వంభర, మెట్ పల్లి:** కార్తీక మాసం పురస్కరించుకొని టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశానుసారం మెట్ పల్లి బస్ డిపోలో డిపో మేనేజర్ పి దేవరాజ్ ఆధ్వర్యంలో వనభోజనా మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ మేరకు ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది విధుల్లో చాలా ఒత్తిడికి లోనవుతారన్నారు. అందుకే డిపో సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ పవన్, సెక్యూరిటీ ఆగయ్య, ఏఎంఎఫ్ ఎల్ ఆర్‌కే రెడ్డి, నగేష్, రాఘవ నాగన్న, మహేష్, ఆర్టీసీ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలన అంటేనే దగా..!

**మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్**



**విశ్వంభర, హుజూర్ నగర్:** తెలంగాణ రాష్ట్రంలో మున్నూరు కాపులకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసినందున స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మున్నూరు కాపులు వ్యతిరేకంగా పనిచేస్తామని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్ పేర్కొన్నారు. ఆదివారం హుజూర్ నగర్‌లో మున్నూరు కాపు సంఘం కార్తీక వనభోజనం మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జల్లేపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో మున్నూరు కాపులకు కార్పొరేషన్ ప్రకటించిన ప్రభుత్వం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్నూరు కార్పొరేషన్ బదులుగా సొసైటీ ఏర్పాటు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్నూరు కాపులకు చెప్పడం శోచనీయమన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత పదేళ్లు పరిపాలించిన కేసీఆర్ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. మళ్లీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా మోసం చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు అమలు చేయకపోవడం సరికాదన్నారు. కాపు కార్పొరేషన్ సంబంధించి జీఓను కూడా విడుదల చేసి 8 నెలలు గడిచిన అమలు చేయకపోవడం అన్యాయం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ మాదిరిగానే కాంగ్రెస్ పార్టీ కూడా మోసం చేస్తుందన్నారు.

**రాజకీయ పార్టీలకు బుద్ధి చెప్పాలి..**

తెలంగాణలో ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులు కూడా మున్నూరు కాపుల మోసం చేయడం అందరూ బాబు సమాజాన్ని మోసం చేయడమేమన్నారు. రాష్ట్రంలో మున్నూరు కాపులు 60 లక్షల మంది ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో కాపులను మోసం చేసిన రాజకీయ పార్టీలకు బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. ముఖ్యంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా మున్నూరు కాపులకు ఎమ్మెల్యే టికెట్ల విషయాలు అన్యాయం చేశారని ఆవేదన చెందారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 22 మంది ఎమ్మెల్యేలు ఉండగా ఇప్పుడు అసెంబ్లీలో నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారని అన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా మున్నూరు కాపులను అణగదొక్కేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఓట్లు మావి సీట్లు మాకు కావాలని పేర్కొన్నారు. జనాభా ప్రకారం ఎమ్మెల్యే ఎంపీ ఎన్నికల్లో టికెట్లు కేటాయించకుండా కాపులను నిర్లక్ష్యం చేశారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలలో మున్నూరు కాపు భవనానికి రెండు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని, ప్రతి జిల్లాలో రెండు ఎకరాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.

రాజకీయ బలమైన శక్తిగా ఏర్పడాలి..

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మున్నూరు కాపులకు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్లు నియమించి రూ.3వేల కోట్ల నిధులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని అన్నారు. మున్నూరు కాపులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేసినా వారికే స్థానిక సంస్థల ఎన్నికల్లో మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. మున్నూరు కాపులు తెలంగాణలో రాజకీయ బలమైన శక్తిగా ఏర్పడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలలో కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పదవీకాలం పూర్తయిన జిల్లా కమిటీలను కొత్తగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం గ్లోబల్ అసోసియేషన్ ఫౌండింగ్ మెంబర్ రజనీకాంత్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోల నాగేశ్వరరావు, లీగల్ సెల్ కన్వీనర్ ఊస రఘు, వుసా రవి, గాలి శ్రీనివాస్ నాయుడు, జిల్లా ఎన్నికల పరిశీలకులు చదల సత్యనారాయణ, కొలపాటి వెంకటేశ్వర్లు, ధూళిపాల ధనంజయ నాయుడు, అంబటి నాగేశ్వరరావు, వుసా పురుషోత్తం, శ్రీనివాసు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## మారింది పాలకులే.. పాలన కాదు

ఈటల రాజేందర్




**విశ్వంభర, ఎల్బీనగర్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపుమేరకు రేపటి నుంచి డిసెంబర్ 6 వరకు వివిధ రూపాల్లో నిరసనలు, ఆందోళనలు చేపట్టనున్నారు. ఈ మేరకు 6 అబద్ధాలు.. 66 మోసాల పేరిట ఆదివారం రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ పాల్గొన్నారు. అయితే డిసెంబర్ 7న మహేశ్వరం నియోజకవర్గం సరూర్‌నగర్ డివిజన్ లోని సరూర్‌నగర్ స్టేడియంలో జరగబోయే భారీ బహిరంగ సభ స్థలాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, రూరల్ జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి పరిశీలించారు.

## క్రీడలతో మానసికోల్లాసం



విశ్వంభర, మిర్యాలగూడ: క్రీడలతో మానసికోల్లాసమని ఎమ్మెల్యేలు నోముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్గొండ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. నల్గొండ పట్టణంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తనయుడు, స్వర్గీయులు ప్రతీక్ రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్గొండ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే లక్ష్యంతో కోమటిరెడ్డి వెంకటరెడ్డి గత ఐదేళ్లుగా నల్గొండలో క్రికెట్ టోర్నీ ఏర్పాటు చేయడం చాలా గర్వకారణమన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు అండంగా ఉంటారనే పేరు తెచ్చుకున్న గొప్ప నాయకులు అన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## 'క్రెడిబుల్ రాన్వే ఫ్యాషన్ వాక్' పోస్టర్ ఆవిష్కరణ



**విశ్వంభర, బషీర్ బాగ్:** ప్రతి ఒక్కరిలో దాగిఉన్న టాలెంట్‌ను ప్రోత్సహించాలని తెలంగాణ ఫిల్మ్ డైరెక్టర్ డిపార్ట్మెంట్ జాయింట్ సెక్రెటరీ కస్తూరి శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్‌లో మిర్యాల ఉప్పు మోడల్ అండ్ యాడ్ ఏజెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'క్రెడిబుల్ రాన్వే ఫ్యాషన్ వాక్' ఫ్యాషన్ షోకు సంబంధించిన వాల్ పోస్టర్ కస్తూరి శ్రీనివాస్ జాయింట్ సెక్రెటరీ ఆఫ్ డైరెక్షన్ డిపార్ట్మెంట్, వీఎంసీ ప్రొడక్షన్ ప్రొడ్యూసర్ విజయకుమార్, మ్యూజిక్ డైరెక్టర్ రమణ ఓగేటి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అనిల్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం బీఎంసీ ప్రొడక్షన్ ప్రొడ్యూసర్ విజయకుమార్ మాట్లాడుతూ ఇలాంటి మంచి ఈవెంట్లని ఎప్పటికీ ఫిల్మ్ ఇండస్ట్రీ ప్రోత్సహిస్తుందన్నారు. అయితే ప్రత్యేకంగా హ్యాండ్లూమ్ సంస్థను అభివృద్ధి చేయడానికి, మన సంస్కృతిని, తరువాతి తరానికి తెలియజేయడానికి కృషి చేయాలన్నారు. అయితే శశిధర్ పటేల్ మిర్యాల, రాకేష్ నాయుడు ఉప్పు కలిసి మిర్యాల ఉప్పు మోడల్ అండ్ యాడ్ ఏజెన్సీ ప్రైవేట్ లిమిటెడ్, మిర్యాల ఉప్పు ఎంటర్టైన్మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అను సంస్థలను స్థాపించినట్లు వారు తెలిపారు. ఇంతవరకు మన హైదరాబాదులో జరగని విధంగా క్రెడిబుల్ రన్వే ఫ్యాషన్ బాక్స్ పేరుతో ఫ్యాషన్ షో నిర్వహిస్తున్నామని ఫ్యాషన్ షో డైరెక్టర్ రాకేష్ నాయుడు ఉప్పు తెలిపారు. ఈవెంట్ బిగ్గెస్ట్ ఈవెంట్ ఇన్ హైదరాబాద్‌గా నిర్వహిస్తున్నామని, ఈ ఈవెంట్‌లో 200 ప్లస్ మోడల్స్, అండ్ డిఫరెంట్ టైప్స్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనర్ అండ్ ఫ్యాషన్ మేక్ అవర్స్ అండ్ మోడల్ ఫోటోగ్రాఫర్స్ అందరికీ సైతం అవకాశం కల్పిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. షో నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్స్ అండ్ డిజైనర్స్, మేక్ ఓవర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ పాయిజన్ ఘటనల్లో ఆర్ఎస్ ప్రవీణ్ పాత్ర

- ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగేలా కుట్రలు
- విద్యార్థుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా ప్లాన్
- ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే తగిన గుణపాఠం చెప్తారు
- టీపీసీసీ అధికార ప్రతినిధి యోగేశ్వర్ రెడ్డి




**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు దూసుకుపోతున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకే సంక్షేమ గురుకుల ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కుట్రకు బీఆర్ఎస్ నాయకులు తెర లేపారని టీపీసీసీ అధికార ప్రతినిధి వెదిరె యోగేశ్వర్ రెడ్డి అన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకులాలకు సెక్రటరీగా ఉన్న సమయంలో హాస్టళ్లలో ఫుడ్ కాంట్రాక్టర్లను, వర్కర్లను నామినేటెడ్ పద్ధతిలో నామినేషన్ చేశారన్నారు. అయితే వాళ్లే ఇప్పటికే కొనసాగుతుండడంతో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు వారితో ఉన్న సన్నిహిత సంబంధాలను ఆసరాగా చేసుకొని వారి ద్వారా ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగేలా కుట్రలు పన్నుతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు ప్రాముఖ్యతనిస్తూ సంక్షేమ హాస్టళ్లలో డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచడంతో విద్యార్థుల్లో ప్రభుత్వంపై, అమలు చేస్తున్న విద్యా విధానం పట్ల విశ్వసనీయత బాగా పెరిగిందన్నారు. దీనిని చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వాన్ని దెబ్బతీసి ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చడంతోపాటు విద్యార్థుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా భారీ కుట్రలు పన్ని విద్యార్థుల ప్రాణాలతో ఆడుకుంటున్నారు పేర్కొన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్‌కు తగిన గుణపాఠం చెప్తారని ఆయన హెచ్చరించారు.

**రాజకీయం చేయడం సరికాదు..**

పేద, మధ్య తరగతి విద్యార్థులు తినే భోజనం విషయంలో రాజకీయం చేయడం సరికాదని, ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో రాష్ట్రంలో యువత సంతోషంగా ఉన్నారని చెప్పారు. ప్రజా ప్రభుత్వ ఏర్పాటుకు ముందు మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడానికి కాస్త సమయం అవుతుందని, కానీ ఇచ్చిన ప్రతి హామీని నేరవెర్చుతుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్న పార్టీలు గత పదేళ్ల నుంచి పదవులను అడ్డం పెట్టుకోని అవినీతితో ప్రజా వ్యతిరేక విధానాలతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి రాష్ట్రాన్ని నాశనం చేశారని విమర్శించారు. నాడు సోనియా గాంధీ మిగులు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని ఇస్తే.. బీఆర్ఎస్ నాయకులు పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకొని లక్షల కోట్లు అప్పులు చేశారని విమర్శించారు. నేడు అప్పులో ఉన్నా రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పతంలో ముందుకు తీసుకెళ్తుందన్నారు. గత ప్రభుత్వంలో చేసిన తప్పులతోపాటు అవినీతిని బయటకు తీసి, అలాగే ఇప్పటి వరకు గురుకులాల్లో జరిగిన పరిణామాలపై దర్యాప్తు పూర్తయిన వెంటనే బాధ్యులపై చట్టపరమైన తగిన చర్యలు తీసుకుంటామని యోగేశ్వర్ రెడ్డి తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో వ్యాసరచన పోటీలు

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** డిసెంబర్ 2 ప్రజా పాలన విజయోత్సవ సభలో భాగంగా పెద్ద శంకరంపేట మండల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత ప్రాథమికోన్నత ప్రాథమిక కేజీబీవీపీ పాఠశాలలో విద్యార్థులకు పునరుత్పాదక శక్తి అనే అంశంపై ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మండల విద్యాధికారి డి వెంకటేశం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంది రాజేశ్వర్, కేజీబీఎస్ఓ పర్యవేక్షణను విజయవంతంగా నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీలను కేజీబీ పాఠశాలలో నిర్వహించగా విద్యార్థులు పాల్గొన్నారు

# కార్పొరేట్ల కోసమే బ్యాంకుల ప్రైవేటీకరణ

- ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మహిళలు పోరాడాలి
- సామాన్య ప్రజల పొదుపు దోపిడీకి గురవుతారు
- బ్యాంకు ఉద్యోగుల భద్రతకు పెను ముప్పుగా మారనుంది
- దేశాభివృద్ధికి బ్యాంకింగ్ రంగం ఆర్థిక వెన్నెముక
- అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి బీఎస్ రాంబాబు




**విశ్వంభర, నారాయణగూడ:** అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దోపిడీదారులకు కోసమే మోదీ ప్రభుత్వం బ్యాంకుల ప్రైవేటీకరణ చేస్తుందని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఏఐబీఈఏ) జాతీయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బీఎస్. రాంబాబు ఆరోపించారు. హైదరాబాద్‌లోని నారాయణగూడలో ఉన్న తాజ్ మహల్ హోటల్‌లో ఆదివారం ఇండియన్ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ మహిళా విభాగం కన్వీనర్ జి.పద్మ అధ్యక్షతన బ్యాంకు మహిళా ఉద్యోగుల సదస్సు జరిగింది. దేశాభివృద్ధి, పురోగతికి ఊతమివ్వడానికి కీలకమైన పాత్ర పోషించేది ప్రభుత్వరంగ బ్యాంకులేనని గుర్తు చేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్‌ను మరింత బలోపేతం చేయడానికి బదులుగా ప్రైవేటీకరిస్తే సామాన్య ప్రజల పొదుపు దోపిడీకి గురవడంతోపాటు బ్యాంకు ఉద్యోగుల భద్రతకు పెను ముప్పుగా మారుతుందన్నారు.

### ప్రైవేటీకరణ.. దుర్మార్గం

దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడటానికి బ్యాంకుల జాతీయకరణ చేపట్టాలని దేశ వ్యాప్తంగా ఏఐబీఈఏ చేసిన అనేక పోరాటాల ఫలితంగానే ఆనాటి ప్రధాని ఇందిరా గాంధీ బ్యాంకుల జాతీయకరణ చేపట్టిందన్నారు. నాటినుంచి దేశాభివృద్ధికి బ్యాంకింగ్ రంగం ఆర్థిక వెన్నెముకగా మారిందన్నారు. ఆర్థిక వ్యవస్థతో పాటు అభివృద్ధికి వనరులను పెంపొందించడంలో బ్యాంకులు కీలక పాత్ర పోషిస్తూ బ్యాంకులో జమ చేసిన సామాన్య ప్రజల పొదుపును కాపాడుతున్నాయన్నారు. ఇందిరా గాంధీ బ్యాంకుల జాతీయకరణ చేస్తున్న సమయంలో జనసంఘ్, ఆర్ఎస్ఎస్‌లు తీవ్రంగా వ్యతిరేకించాయని, అయితే ప్రస్తుతం జనసంఘ్, ఆర్ఎస్ఎస్ విధానాలనే బీజేపీ అనుసరిస్తూ బ్యాంకుల ప్రైవేటీకరణ చేపడుతుందని తెలిపారు. ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణతో ప్రజా సొమ్ము లూటీ జరిగే ప్రమాదంతోపాటు బ్యాంకు ఉద్యోగుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందని, భవిష్యత్తులో పెన్షన్ విధానం కూడా కనుమరుగవుతుందని తెలిపారు. నష్టాల్లో కూరుకున్న ప్రభుత్వరంగ బ్యాంకులను లాభాల్లో తెచ్చిన ఘనత బ్యాంకు ఉద్యోగులదేనని గుర్తు చేశారు. లాభాల్లో ఉన్న ప్రభుత్వరంగ బ్యాంకులను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. ప్రజా సొమ్ము భద్రత కోసం మరియు తమ ఉద్యోగ భద్రత కోసం మోదీ ప్రభుత్వ ప్రైవేటీకరణ ప్రయత్నాలను ఓడించడానికి, ప్రభుత్వ రంగ బ్యాంకులను రక్షించడానికి బ్యాంకు ఉద్యోగులు బలమైన పోరాటానికి సిద్ధంకావాలని ఆయన కోరారు.

### 48 శాతం మహిళా ఉద్యోగులే..

అన్ని ప్రభుత్వరంగ బ్యాంకుల్లో 48 శాతం మహిళా ఉద్యోగులున్నారని, అలాంటి బ్యాంకు ఉద్యోగులలో సగభాగమైన మహిళా ఉద్యోగులు బ్యాంకుల ప్రైవేటీకరణను తీవ్రంగా ప్రతిఘటించాలని అలాగే విస్తృతమైన పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఇండియన్ బ్యాంకు ఫీల్డ్ జనరల్ మేనేజర్ రాజేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులందరూ సమ్మతితో అత్యున్నత నైతికతకు అనుగుణంగా ఇండియన్ బ్యాంకు తన వ్యాపారాన్ని నిర్వహిస్తూ లాభాల్లో నడుస్తుందని తెలిపారు. పని ప్రదేశంలో వివక్ష, లైంగిక వేధింపులు గురైన కొన్ని సంఘటనలు తన దృష్టికి ఇండియన్ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ తీసుకొచ్చిందన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా ఇండియన్ బ్యాంకు యాజమాన్యం కఠిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి ఇండియన్ బ్యాంకు ఫీల్డ్ జనరల్ మేనేజర్ జి. రాజేశ్వర రెడ్డి, ప్రముఖ కాన్సర్ వైద్య నిపుణురాలు డా. మౌనిక బోపన్న, ప్రముఖ పాత్రికేయురాలు అజిత కాట్రగడ్డ, ఇండియన్ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ చైర్మన్ కె. రాధాకృష్ణ, అధ్యక్షులు ఎంఎస్. కుమార్, ప్రధాన కార్యదర్శి పీవీ కృష్ణ రావు తదితరులు హాజరయ్యారు.

## బ్రహ్మోస్ డైరెక్టర్ జనరల్‌గా జైతీర్థ్ బాధ్యతలు



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ జైతీర్థ్ ఆర్ జోషి బ్రహ్మోస్ డైరెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు. ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. వ్యూహాత్మక క్షిపణి వ్యవస్థల రూపకల్పన, అభివృద్ధిలో డాక్టర్ జోషి విశేష కృషి చేశారు.లాంగ్ రేంజ్ సర్ఫేస్ టూ ఎయిర్ మిస్సైల్ డెవలప్‌మెంట్ కోసం ఆర్ అండ్ డీకి నాయకత్వం వహించారు. అధునాతన క్షిపణుల తయారీలో మూడు దశాబ్దాలుగా కృషి చేస్తున్నారు.

## విద్యార్థులకు సత్కారం




**విశ్వంభర, అంబర్‌పేట్:** అంబర్‌పేట్ పరిధిలోని రికగ్నైజ్డ్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విద్యార్థులకు సత్కారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులను ప్రైవేట్ స్కూల్ టీచర్స్ సత్కరించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం 2024లో మొదటి స్థానంలో ఉత్తీర్ణత సాధించిన పదోతరగతి టాపర్స్‌కు మెమోంటోలు అందజేశారు. మేరకు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ



**విశ్వంభర, చైతన్యపురి:** చైతన్యపురి డివిజన్‌లోని బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు తోట మహేష్ యాదవ్ తన నివాసంలో ఆదివారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఎంతో వైభవంగా జరిగింది. ఈ పడిపూజలో భాగంగా స్వాములు, భక్తులు, ప్రముఖులు అయ్యప్ప స్వామిని దర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు తోట మహేష్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా అయ్యప్ప స్వామి మహా పడిపూజను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. మారుతీనగర్ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి తన నివాసం వరకు అయ్యప్ప ఆభరణాలు, పల్లకీ ఊరేగింపును కనులపండువగా నిర్వహించామన్నారు. ఈ పడిపూజలో దాదాపుగా 2000 మందికి పైగా స్వాములు అన్నప్రసాదాన్ని స్వీకరించారన్నారు. అలాగే భవిష్యత్తులో ప్రతి ఏడాది అయ్యప్ప స్వామి మహా పడిపూజను నిర్వహిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. భక్తిభావం అలవర్చుకున్నప్పుడే శాంతియుత సమాజం నెలకొంటుందన్నారు. అనంతరం శబరిమలైకి వెళ్లే స్వాములు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రశాంతంగా అయ్యప్ప స్వామిని దర్శించుకోవాలని సూచించారు.

## ఆంగ్ల భాషపై పట్టు అవసరం

**- డీఆర్‌డీఓ శాస్త్రవేత్త డా .బసంత్ కుమార్**

**విశ్వంభర, ఎల్బీనగర్:** విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు అవసరమని డీఆర్‌డీఓ శాస్త్రవేత్త డా .బసంత్ కుమార్ అన్నారు. ఎల్బీ నగర్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన ఓసీఎల్బీఎన్ చింతల్ కుంట నారాయణ పాఠశాలలో మాస్టర్ ఓరియంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులకు ఆంగ్ల భాష ప్రావీణ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా .బసంత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో తట్టుకొని ఉద్యోగాన్ని త్వరగా సాధించాలంటే ఇంగ్లీష్ ఎంతో ముఖ్యమన్నారు. ఇంగ్లీష్ భాషపై ప్రావీణ్యం పెంచుకుంటే అవకాశాలు పుష్కలంగా వస్తాయన్నారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జ్యూరీ మెంబర్స్ ప్రో. రవి కుమార్, విశ్రాంత లెక్చరర్ సుబ్బారావు, నారాయణ గ్రూప్ స్కూల్స్ జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం హేమెంబెర్, ఆర్ఐ రవి ప్రసాద్, జోన్ నారాయణ విద్య సంస్థల జోన్ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఆర్అండ్‌డీ హెడ్ మహేశ్వరీ, జోనల్ కోర్డినేటర్ గాయత్రీ, చింతల్ కుంట బ్రాంచ్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, ప్రిన్సిపాల్ హరిప్రసాద్, ఏఓ కరుణాకర్, పీఈటీ శ్రీధర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.



## శెట్టిబలిజ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి

**ఏ సమస్య వచ్చినా అండగా ఉండి పని చేస్తా**

**రిజర్వేషన్ల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా**

**టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్**



**విశ్వంభర, ఎల్బీనగర్:** శెట్టిబలిజ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ అన్నారు. వనస్థలిపురం ఎన్జీఓస్ కాలనీలోని ఛత్రపతి శివాజీ గ్రౌండ్స్‌లో గౌడ, శెట్టిబలిజ కులస్తుల కార్తీకమాస వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మధుయాష్కీ గౌడ్ హాజరై మాట్లాడారు. ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉండి పని చేస్తానన్నారు. రాష్ట్ర విభజన తర్వాత శెట్టిబలిజ కులస్తులను గత ప్రభుత్వం బీసీ జాబితా నుంచి తొలగించి రిజర్వేషన్లు వర్తించకుండా అన్యాయం చేసిందన్నారు. ఈ సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎన్ రెడ్డి నగర్, వనస్థలిపురం డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సదాశివుడు, కుట్ల నర్సింహ యాదవ్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్, గౌడ శెట్టిబలిజ సంఘం అధ్యక్షులు పీవీవీ సత్యనారాయణ, ప్రతినిధులు పంపన వెంకటేశ్వరరావు, చింతపల్లి ప్రసాద్ హాజరయ్యారు.

### సమస్యలు పరిష్కరించాలని వినతి..

చైతన్యపురి డివిజన్‌లోని పలు కాలనీ అధ్యక్షులు మధు యాష్కీని కలిసి కాలనీ సమస్యలని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దాము మహేందర్ యాదవ్, సత్యనారాయణ పురం కాలనీ కర్నాటి వెంకటేశ్వరులు, న్యూ మారుతినగర్ అద్యక్షులు కృష్ణమూర్తి, సతీష్ గౌడ్, మహేష్ గౌడ్, నాగార్జున రెడ్డి, కిరణ్, ఠాకూర్, న్యూ మరీతినగర్ కాలనీ సెక్రటరీ ప్రభాకర్ రావు, రాహుల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

## 13గంటలకు పైగా.. కువైట్ ఎయిర్‌పోర్టులోనే భారతీయ ప్రయాణికుల అవస్థలు



**కువైట్:** ముంబయి నుంచి మాంచెస్టర్‌కు బయల్దేరిన విమానం కువైట్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ కావడంతో భారతీయ ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. దాదాపు 13గంటలకు పైగా కువైట్ విమానాశ్రయంలోనే చిక్కుకుపోయారు. దాదాపు 60మందికి పైగా పౌరులు విమానాశ్రయంలో చిక్కుకొని తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. సరైన ఆహారం అందక, సహాయం చేసేవారు లేక ఇబ్బందులు పడుతున్నట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం అమెరికా, యూకే పాస్‌పోర్టులు కలిగిన వారికి మాత్రమే హోటల్ సదుపాయాలు అందించడంతో తాము తీవ్ర అవస్థలు పడినట్లు వాపోయారు.

తమను పట్టించుకోకపోవడంతో కువైట్ ఎయిర్‌పోర్టులో అధికారులతో ప్రయాణికులు వాగ్వాదానికి దిగిన దృశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఎయిర్‌లైన్స్ సిబ్బంది తమను వేధించారని, అమెరికా, యూకే నుంచి వచ్చిన వారికి మాత్రమే ఎయిర్‌లైన్స్ వసతి కల్పించినట్లు పలువురు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ముంబయి నుంచి బయల్దేరిన విమానం బహ్రెయిన్ మీదుగా మాంచెస్టర్ వెళ్లాల్సి ఉందని.. అకస్మాత్తుగా ప్రతి ఒక్కరూ ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు సిద్ధం కావాలని ఎయిర్‌లైన్ సిబ్బంది చెప్పారని ఓ ప్రయాణికుడు తెలిపారు. ఇంజిన్‌లో మంటలు, పొగ వచ్చినట్లు తాను చూశానని మరో ప్రయాణికుడు తెలిపారు. విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయ్యాక కనీసం కూర్చోడానికైనా స్థలం ఇవ్వాలని ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోలేదని.. దీంతో నేలపైనే కూర్చొన్నట్లు సింగ్ అనే ప్రయాణికుడు వాపోయారు. ఈ వ్యవహారంపై గల్ఫ్ ఎయిర్ ఆదివారం రాత్రివరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.

### రంగంలోకి దిగిన ఇండియన్ ఎంబసీ

మరోవైపు, ఈ వ్యవహారంపై కువైట్‌లోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. ప్రయాణికులకు కలిగిన తీవ్ర అసౌకర్యాన్ని గల్ఫ్ ఎయిర్ దృష్టికి తీసుకెళ్లింది. ఎంబసీకి చెందిన బృందం ఎయిర్‌లైన్స్‌తో సమన్వయం చేస్తూ ప్రయాణికులకు సహాయం అందించేందుకు విమానాశ్రయం వద్దకు చేరుకుంది. ప్రయాణికులతో మాట్లాడి ఇబ్బందులను తెలుసుకుంది. ఎయిర్‌పోర్టులోని రెండు లాంజ్‌లను వసతి కోసం ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టింది. జీసీసీ సమ్మిట్ జరుగుతున్న దృష్ట్యా ఎయిర్‌పోర్టు హోటల్‌లో వసతి లేదని.. వీలుని బట్టి అక్కడ వసతి కల్పించేందుకు కృషిచేస్తున్నట్లు 'ఎక్స్' వేదికగా తెలిపింది. కువైట్‌లో దిగిన తర్వాత వీసా పొందే అవకాశం భారత పౌరులకు లేదని.. జీసీసీ సదస్సు కారణంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలూ ఆదివారం మూసివున్నట్లు అధికారులు తెలిపారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



**విశ్వంభర, ములుగు:** ములుగు జిల్లా తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన షేక్ యాకూబ్ పాష సోదరుడు ఇటీవల మృతి చెందాడు. అయితే విషయం తెలుసుకున్న మృతుడి చిన్ననాటి స్నేహితులు ఆర్థిక సహాయం అందించేందుకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు అందరూ కలిసి రూ.10వేల వరకు జమ చేశారు. అనంతరం మృతుడి సోదరుడు షేక్ యాకూబ్ పాషకు అందజేసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో తడిక హరీష్, పోలబోయిన సతీష్, కొత్తపల్లి కుమారస్వామి, మేడిశెట్టి నరేష్, మహేశ్వరి, మహేష్, రంజిత్, నవీన్, నెలటూరి అనిల్, అన్నల స్వప్న, సాంబశివరావు, మిట్టపల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేటలో ఆర్యవైశ్యుల వనభోజనాలు

**- హాజరైన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం**



**విశ్వంభర, రామన్నపేట:** కార్తీక మాసం చివరి ఆదివారం సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని రామన్నపేట మండల కేంద్రానికి చెందిన ఆర్యవైశ్యులు వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు అందరూ వనభోజన కార్యక్రమానికి హాజరై సందడి చేశారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్తీక మాస వనభోజనాలతో ఐక్యత, స్నేహభావం పెంపొందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## దివంగత నేత నోముల నర్సింహయ్యకు ఘన నివాళి

**విశ్వంభర, నాగార్జునసాగర్:** నాగార్జునసాగర్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత నోముల నర్సింహయ్య ప్రజా నాయకుడు అని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. ఈ సందర్భంగా నోముల నర్సింహయ్య 4వ వర్ధంతి సందర్భంగా నిడమానూరు మండలం వేంపాడ్ స్టేజీ వద్ద ఆయన విగ్రహానికి తన తల్లి లక్ష్మితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఆప్కాబ్ చైర్మన్ యడవెల్లి విజేందర్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాధం సంపత్ కుమార్, నియోజకవర్గంలోని వివిధ మండలాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, తెలంగాణ ఉద్యమకారులు, విలేకరులు, మహిళలు, కార్యకర్తలు, నోముల అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# ఆధ్యాత్మిక మార్గం – మార్గశిర మాసం

"మాసానాం మార్గశీర్షిహం "- అన్నారు జగద్గురువు *శ్రీకృష్ణ పరమాత్మ.లక్ష్మీనారాయణ స్వరూపమైన ఈ మాసంలో ప్రతీరోజూ శుభప్రదమైనదే. తొలిరోజు కార్తీకమాసమంతా వ్రతాలు చేసిన వారు పోలిని స్వర్గానికి పంపించుట అనగా నదీ స్నానం చేసి దీపాలు వదలుటతో ప్రారంభమవుతుంది.






మార్గశిర మాసాన్నే 'మార్గశీర్షం' అని కూడా పిలుస్తారు. శీర్షం అంటే అగ్రభాగం అని అర్థం. మాసాలన్నింటిలో అగ్రగణ్యమైనది కాబట్టే దీనికి ఈ పేరు వచ్చింది. అంతేకాదు మార్గశీర్షం ఒక విలక్షణమైన మాసం, అంటే మార్గాలలో శ్రేష్టమైనది. అది ఏ మార్గం అంటే భగవంతుని అనుగ్రహం పొందు భక్తి మార్గం. శ్రీమహా విష్ణువుకు ఎంతో ప్రీతికరమైన మాసం మార్గశిరం. ఈ మాసంలో శ్రీమహావిష్ణువుతో పాటు సూర్య భగవానుడిని పూజించి, ఏ పని చేస్తున్నా "ఓం దామోదరాయ నమః" "ఓం నమో నారాయ నమః" అని మంత్రాలను జపించాలని శాస్త్రాలు వివరిస్తున్నాయి. ప్రతిరోజు బ్రహ్మ ముహూర్తములో తులసి సన్నిధిలోని మట్టి,ఆకులను తీసుకొని "ఓం నమో నారాయణా అనే మంత్రాన్ని స్తుతిస్తూ శరీరానికి రాసుకుని స్నానం చేయాలి.

తెలుగు మాసాల్లో ఒకొక్క మాసం ఒకొక్క విశిష్టతను కలిగి ఉన్నాయి. కార్తిక మాసం నుంచి నేడు మార్గశిర మాసంలో అడుగు పెడుతున్నాం.. ఈ నేపథ్యంలో హిందూ సనాతన ధర్మంలో మార్గశిర మాసం ప్రాముఖ్యత విశిష్ట కలిగింది.

సూర్య భగవానుడు 12 నెలల్లో అంటే ఒక్కొక్క నెలకు ఒక్కొక్క రాశి చొప్పున మారుతూ ఉంటాడు ఇలా మారుతూ ఉండడాన్ని మాస సంక్రమణం అంటారు. ఇలా ఒక ఏడాదికి 12 సంక్రమనలు వస్తాయి. సూర్యుడు తులా రాశి నుండి వృశ్చిక రాశిలోకి ఆగమనం చేయడానికి వృశ్చిక సంక్రమణం అంటారు ఈ మార్గశిర మాసం మహాలక్ష్మి దేవికి మహావిష్ణువుకు సూర్యదేవునికి ఎంతో ప్రీతికరమైనది. హేమంత ఋతువులోని మొదటి మాసం మార్గశిరం.. మృగశిర నక్షత్రం... పూర్ణిమ కలయిక వలన ఈ మాసానికి మార్గశీరమని పేరు. ఈ మాసం గురించి శ్రీకృష్ణ పరమాత్ముడు.. మాసానాం మార్గశీర్షాహం.. మాసాలలో మార్గశిర మాసాన్ని నేనే అని స్వయంగా చెప్పాడు. ఈ మాసం లో చేసే పూజ, హోమం, అభిషేకం, ఇలా ఏ దైవకార్యం చేసినా దానిని స్వయంగా తనే స్వీకరిస్తానని ప్రకటించాడు.శుద్ధ పాడ్యమి నుండి ఈ మాసమంతా "మధుసూదనుడు" అనే నామముతోశ్రీ మహా విష్ణువుని పూజిస్తారు. మార్గశిర మాసం ఎన్నో పర్వాలకు నెలవుగా పరిగణిస్తారు. శ్రీ మహా విష్ణువుకిప్రీతికరమైన ఈ మాసం లో విష్ణు సహస్రనామ పఠనం అనంతకోటి పుణ్య ఫలితాలనందిస్తుంది. గురువారం చేసే పూజలు అత్యంత విశిష్టమైనవిగా పురాణాలు పేర్కొన్నాయి. జ్యోతిష్యాన్ని అనుసరించి ఈ నెలను.. సౌరమాన ప్రకారం ధనుర్మాసమని, చంద్రమానం ప్రకారం మార్గశిర మాసమని అంటారు. ఆధ్యాత్మికం కూడా ప్రసిద్ధిగాంచింది. ఆధ్యాత్మికం గా ప్రసిద్ధమైన ఈ మాసంలో ప్రకృతి సౌందర్యాన్ని, శాంతిని సంతరిస్తుంది.మార్గశిర శుద్ధ తదియ నాడు ఉమామహేశ్వర స్వామి వ్రతం చేసి శివపార్వతులను ఆరాధించడం కొన్ని ప్రాంతాలలో ఉన్నది.మార్గశిర శుద్ధ చవితి,పంచమి రోజున నాగ పూజ చేయడం విశేష ఫలితాన్ని ఇస్తుంది. శుభకార్యాలు ప్రారంభించడానికి అనుకూలమైన రోజుగా చెప్పబడింది.మార్గశిర శుద్ధ షష్టిని స్కాంద షష్టి అని సుబ్రమణ్య షష్టి అని అంటారు. ఈ రోజున సుబ్రహ్మణ్యస్వామిని, సప్తమిని భాను సప్తమి జయ సప్తమి మిత్రసప్తమి అని అంటారు ఈ రోజు సూర్య ఆరాధన చేసి పాయసం నైవేద్యంగా పెడితే మంచి ఫలితాలు కలుగుతాయి.





మార్గశిర అష్టమిని కాలభైరవాష్టమిగా పిలుస్తారు శివుని మరో రూపమే భైరవుడు భైరవుడు అంటే పోషకుడని భయంకరుడని అర్థాలు వస్తాయి. భైరవుని దగ్గర కాలుడు కూడా అణిగి ఉంటాడు. కనుకనే కాలభైరవుడయ్యాడు. భైరవుని శరణ కోరితే మృత్యు భాయం తొలగిపోతుంది. ఈరోజు గంగా స్నానం పితృతర్పణం శ్రాద్ధ కర్మలు ఆచరిస్తే ఏడాది మొత్తం లౌకిక, పారలౌకిక బాధల నుండి విముక్తి కలుగుతుంది. అలాగే భైరవుని వాహనమైన శునకానికి పాలు పెరుగు వంటివి ఆహారంగా ఇవ్వడం మంచిది.

భగవద్గీత జననం:

హిందువులందరికీ భగవద్గీత జన్మించిన మాసంగా పరిగణించే పవిత్రమైన దినం

ఏకాదశిని మోక్ష ఏకాదశిగా చెప్తారు. శ్రీమద్ భగవద్గీత లోకానికి అందిన రోజు. దీనినే వైకుంఠ ఏకాదశి లేక మోక్ష ఏకాదశి సౌఖ్యద ఏకాదశి అంటారు ఈరోజు శ్రీ మహావిష్ణువుకి అత్యంత ప్రీతికరమైన రోజుగా చెప్పబడింది. శ్రీ మహావిష్ణువును తులసీదళాలతో పూజిస్తే పుణ్యం దక్కుతుంది. విష్ణు సహస్రనామ పారాయణం సర్వ పాపాలను తొలగిస్తుంది. ఈరోజున చేసుకొనే ఉత్తర ద్వారా దర్శనం వలన మోక్షం లభిస్తుంది అని పెద్దల వాక్కు. ఈ మాసంలోనే వచ్చే ద్వాదశైని అఖండ ద్వాదశి, మత్స్య ద్వాదశి అంటారు.

మార్గశిర శుద్ధ త్రయోదశి నాడు హనుమద్భక్తులు హనుమత్ వ్రతం ఆచరిస్తారు.మార్గశిర శుద్ధ పౌర్ణమి నాడు దత్తాత్రేయ జయంతి. దత్తాత్రేయుడంటే సాక్షాత్తు త్రిమూర్తి స్వరూపం. అనఘావ్రతం ఆచరించి స్వామిని పూజిస్తే సకల పాపాలు తొలగిపోతాయట. మార్గశిర పౌర్ణమితో అనేక రకమైన వ్యాధులు అనారోగ్య సమస్యలు తొలగిపోతాయి ఈరోజున యమధర్మరాజుని పూజిస్తారు ఈ పున్నమిని కోరల పున్నమి నరక పౌర్ణమి అని కూడా పిలుస్తారు.

శ్రీకృష్ణునికి విశిష్టమైన మాసం...

ఈ మాసంలో గురువారాలలో శ్రీ మహాలక్ష్మి దేవిని పూజిస్తూ.. "మార్గశిర లక్ష్మీ వ్రతం" చేయడంతో పాటు ద్వాదశి అభిషేకం వల్ల మీ కుటుంబంలో అందరి ఆయురారోగ్యాలు మెరుగవుతాయి సంతానము లేని వారికి సంతానం ప్రాప్తిస్తుంది అని, ఆదినారాయణడు సూర్యుడు వృశ్చిక రాశి నుండి ధనుర్రాశుల్లోకి ప్రవేశించే సమయం నుంచి ధనుర్మాసం ప్రారంభమవుతుంది ఈ మాసంలో మహావిష్ణువు వద్ద ఆవు నేతితో దీపాన్ని వెలిగించి విష్ణు సహస్రనామ పఠనం అనంత కోటి పుణ్య ఫలితాలనిస్తుంది. ఈరోజు భగవద్గీత పారాయణం చేస్తారో వారికి విష్ణు కటాక్షం లభిస్తుంది అని విష్ణు పురాణం చెప్తుంది.మార్గశిర మాసంలోని శ్రీ మహావిష్ణువుకి ప్రీతికరమైన ధనుర్మాసం ప్రారంభమవుతుంది.



- కావ్యసుధ
హయత్ నగర్
ఫోన్ : 9247313488

## సైన్స్ ఫెయిర్ తిలకించిన జిల్లా కలెక్టర్



**విశ్వంభర, మహబూబాబాద్:** ఆదివారం తెలంగాణ మోడల్ స్కూల్ మహబూబాబాద్ పట్టణంలో జరుగుతున్న జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన2425, జిల్లాస్థాయి ఇన్స్పైర్ అవార్డుల ప్రదర్శన 2324, కార్యక్రమాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ . ఫెయిర్‌లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను ఆయన తిలకించారు, ఆయన వెంట జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రవీందర్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు ఉన్నారు,

## ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ

**విశ్వంభర, సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజకవర్గం గుమ్మడిదల మండలం రాంరెడ్డిబావి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. అయ్యప్ప స్వాములు వందలాదిగా తరలివచ్చి అయ్యప్ప స్వామి భజనలు, సంకీర్తనలు, అయ్యప్ప స్వామి నామస్మరణతో రాంరెడ్డిబావి గ్రామం మారుమ్రోగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులగా పాల్గొని స్వామి వారిని పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ మరియు వారి సతీమణి సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.



## రైతులకు అవగాహన సదస్సు




**విశ్వంభర, మూస్తాబాద్:** టీడీఎఫ్ జై కిసాన్ ఆధ్వర్యంలో మూస్తాబాద్ మండల రైతులకు వరి కొయ్యలు కాలపెట్టొద్దంటూ అవగాహన సదస్సు రైతులకు సింగల్ సూపర్ ఫాస్పేట్, వేస్ట్ డీకంపోజర్ కిట్స్ ఉచితంగా అందజేయడం జరిగింది. తెలంగాణ ప్రాంతంలో రైతులు వరి కొయ్యాలు కాలుస్తూ కాలుష్యానికి కారణం అవుతున్నారు ,అదేవిధంగా వరి కొయ్యాల కాల్చడం వల్ల భూమి యొక్క సారం పూర్తిగా దెబ్బతింది ఉన్నది, అదే విధంగా అనేక సూక్ష్మజీవులు మరణానికి కారణం అవుతున్నయి, దీనివల్ల భూమి తన యొక్క సారం పూర్తిగా కోల్పోవడం జరుగుతుంది ఎప్పుడైతే భూమి సారం కోల్పోవడం జరుగుతుందో రైతులు అధిక దిగుబడి కోసం ఎక్కువ డిఏపి యూరియా బయటనుంచి కొనుకొచ్చి వాడుతా ఉన్నారు, దీని వలన వ్యవసాయ పెట్టుబడి పెరగాడమే కాకుండా రైతుపై ఆర్థిక భారం పడతా ఉన్నది విచారం వ్యక్త చేయడం జరిగింది, రైతులు తమ యొక్క పొలంలో వరి కొయ్యాలూ కాల్చుకోకుండా మార్కెట్లో దొరికే వివిధ రకాల వేస్ట్ డీకంపోజర్స్ అదేవిధంగా సింగర్ సూపరేట్ ఫాస్పేట్ తో పొలంలో కలియబెడితే అది త్వరగా మొరిగి ఎరువుగా మారుతుందని, తద్వారా భూమికి అనేక రకమైన పోషకాలు అందుతాయని తెలిపారు , రైతులు హార్వెస్టర్ తోని వరి కోసేటప్పుడు ఎంత వీలైతే అంత కింద నుంచి వరి కోయడం వల్ల వరి గడ్డి పశువులకు ఉపయోగపడితే అని తెలియజేశారు, రైతులు కోపరేటివ్ సొసైటీ ద్వారా మార్కెట్లో లభించే ప్యాడి త్రషర్ యంత్రాన్ని కొనుకొచ్చి దానిని పొడిగా మారిస్తే భూమి కూడా సారవంతం అవుతుందని తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం ఇండియా అధ్యక్షులు మట్ట రాజేశ్వర్ రెడ్డి గారు తెలిపారు. అదేవిధంగా ఈ ప్రాజెక్ట్ కి ఆర్థిక సాయం అందిస్తున్న టిడి ఎఫ్ యూఎస్ఏ మాజీ చైర్మన్ టిఆర్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు రైతుల తరపున వ్యక్తం చేయడం జరిగింది.

## కుదురుపల్లి వాగులో క్షుద్ర పూజల కలకలం

**విశ్వంభర, కాటారం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కుదురుపల్లి వాగులో క్షుద్ర పూజల కలకలం రేపాయి. ఆదివారం ఉదయం కుదురుపల్లి గ్రామానికి చెందిన యువకులు వాకింగ్ కు వెళ్లగా వాగులో క్షుద్ర పూజలు చూసి భయాందోళనలకు గురయ్యారు. మేకపోతును బలిచ్చి, కొబ్బరికాయలు, అన్నం బట్టలను ఆ ప్రాంతంలోనే వదిలేసారు. క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లను చూసి జనం ఆందోళన పడుతున్నారు. ఇటీవల వరసగా మహాదేవపూర్ మండల కేంద్రంలో ఒకరి ఇంటి ముందు నిమ్మకాయలు, పసుపు, కుంకుమ, కోడిగుడ్లు పెట్టి సీసీ టీవీ కెమెరాకు చిక్కిన విషయం తెలిసిందే. అదే కుదురుపల్ల అటవీ ప్రాంతంలో క్షుద్ర పూజలు చేస్తున్న వారిని ఆ గ్రామ యువకులు పోలీసులకు అప్పగించారు. వారిని బైండోవర్ చేసిన సంఘటనలు మరువక ముందే మళ్ళీ క్షుద్ర పూజలు చేస్తు అమాయక ప్రజలను డబ్బులు గుంజుతూ, భయాందోళనలకు గురిచేస్తున్నారు.

## నిరుపేదలను ఆదుకోవడమే గాంధీజీ ఫౌండేషన్ ఆశయం

### ప్రాణం ఉన్నంతవరకు సేవ చేస్తాం

### డాక్టర్ కోడి శ్రీనివాస్ దంపతులు

### గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ

**విశ్వంభర, చండూరు:** నిరుపేదలను ఆదుకోవడమే గాంధీజీ ఫౌండేషన్ ఆశయమని, ప్రాణం ఉన్నంతవరకు నిరుపేదలకు సేవ చేస్తామని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాస్ దంపతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కోడి అరుణ మాట్లాడుతూ.. జనవరి 1వ తేదీన ప్రారంభించిన గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు 12వ నెల ఉచితంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ విధంగా రెండేళ్ల వరకు ప్రతీ నెలా 20మంది నిరుపేదలకు ఒక్కొక్కరికి రూ.1000 విలువ చేసే నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రాణం ఉన్నంత వరకు గాంధీజీ ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు ఉచిత నిత్యావసర సరుకుల పంపిణీతో పాటు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. సమాజంలో ఆదర్శవంతంగా జీవించాలని, ఏ ఆసరా లేని నిరుపేదలను ఆదుకోవడమే గాంధీజీ ఫౌండేషన్ ఆశయమన్నారు. గాంధీజీ ఫౌండేషన్ పేదల పక్షపాతి అని, ప్రాణం ఉన్నంతవరకు నిరుపేదలకు సేవ చేస్తూనే ఉంటామన్నారు. గాంధీజీ విద్యాసంస్థల ద్వారా తల్లిదండ్రులు లేని పేద విద్యార్థులకు తక్కువ ఫీజుతో విద్యనందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, బోడ యాదయ్య, బుషిపాక యాదగిరి, బోడ విజయ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలో ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా ఆదివారం రామన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమం ఎంఈఓ ఆధ్వర్యంలో జరిగినది. తహసిల్దార్, ఎంపీడీవో మరియు ఉపాధ్యాయులు తదితరులు హాజరైనారు.



# కంసాలి, వడ్ల, కంచరి, కమ్మరి, శిల్పులు, అందరు విశ్వబ్రాహ్మణులే..



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల స్వర్ణకార సంఘ సమావేశం తదుపరి విశ్వబ్రాహ్మణ సంఘం మరియు స్వర్ణకార సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కన్నెకంటి వెంకటేశ్వ రాచారి విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కుల గణన సర్వేలో విశ్వబ్రాహ్మణ కులం కాకుండా వృత్తి పరంగా వేర్వేరు కులాలను చేర్చి సర్వే చేయడంపై రాష్ట్ర హైకోర్టు స్పష్టత నిచ్చింది. రాష్ట్రం లో బీసీ కులాలను వర్గీకరించిన జీ.ఓ. లో వృత్తులైన కంసాలి, వడ్ల, కంచరి, కమ్మరి, శిల్పి లను విశ్వబ్రాహ్మణ కులంగా పేర్కొంటూ స్పష్టంగా తెలిపింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సమగ్ర కుటుంబ సర్వేలోని ఫారాలలో విశ్వబ్రాహ్మణ కులం కాకుండా వృత్తులను అనుసరించి కంసాలి, వడ్ల, కంచరి, కమ్మరి, శిల్పి లను వేర్వేరు కులాలుగా పేర్కొంది. దీనితో, వేర్వేరు కులాలుగా పేర్కొనడం పట్ల విశ్వ బ్రాహ్మణ సంఖ్య తగ్గి రానున్న కాలంలో ప్రభుత్వ పథకాలలో తీరని అన్యాయం జరుగుతుందని పేర్కొంటూ, విశ్వ బ్రాహ్మణ సంఘాలు రాష్ట్రంలోని 33 జిల్లాల కలెక్టర్లు, బీసీ కమీషన్ కు, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి పలు విజ్ఞాపనలు అందచేశాయి. అయినప్పటికీ, సర్వే ఫారాలలో సరి చేయకుండా కొనసాగించడాన్ని సవాలు చేస్తూ, విశ్వ బ్రాహ్మణ వెల్ఫేర్ అసోషియేషన్ కు చెందిన సీనియర్ అడ్వకేట్ పెందోట శ్రీనివాస్ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. వృత్తి పరంగా కాకుండా కంసాలి, వడ్ల, కంచరి, కమ్మరి, శిల్పి లను ఒకే కులంగా విశ్వ బ్రాహ్మణులుగా ఒకే కోడ్ గా పరిగణించాలని వేసిన పిటీషన్ ను హైకోర్టు జస్టిస్ సూరేపల్లి నందా పరిగణనలోకి తీసుకొని, కంసాలి, వడ్ల, కంచరి, కమ్మరి, శిల్పి లను వేర్వేరుగా కాకుండా, విశ్వబ్రాహ్మణులుగా పరిగణించాలని ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఈ ఉత్తర్వుల పట్ల సీనియర్ అడ్వకేట్ పెందోట శ్రీనివాస్ కు, విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మ వికాసానికి తోడ్పాటునందించిన విశ్వబ్రాహ్మణ తెలంగాణ లీగల్ సెల్ కు కృతజ్ఞతలు తెలిపిన వారిలో నాయకులు కాన్జోజు శ్రీనివాసాచారి, ఆకవరం శ్రీనివాసచారి, చోల్లేటి చంద్రశేఖరాచారి, కాన్జోజు పాండురంగాచారి, కన్నెకంటి ప్రభాకరా చారి, మారోజు రాఘవాచారి, పిన్నోజు వెంకటేశ్వర్లు చారి, కూరెళ్ల బిక్షమాచారి, పిన్నోజు ఉపేందర్ చారి, ఖాన్జోజు వెంకటాచారి, ఆకవరపు ఉదయ్ చారి, కాన్జోజు సైదుల్ చారి, కొల్లోజు నరేష్ చారి, శుభకోటి శ్రీకాంతాచారి, అక్కినపల్లి ఉపేంద్ర చారి, కూరెళ్ళ రామకృష్ణచారి, గిన్నెల సాయికుమార్ చారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా కాలనీల అభివృద్ధి

## సీసీ రోడ్డు నిర్మాణానికి 10 లక్షల రూపాయల సొంత నిధులు

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**విశ్వంభర, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చేరు నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్ గూడ సాయి యాక్సిస్ హోమ్స్ కాలనీలో 60 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఆదివారం స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామాలు పట్టణాలుగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. అమీన్పూర్ మండల పరిధిలోని గ్రామాలు మున్సిపాలిటీలో విలీనం కావడం మూలంగా పెద్ద ఎత్తున నిధులు మంజూరు కావడంతో పాటు అభివృద్ధి శరవేగంగా కొనసాగుతుందని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే జిఎంఆర్ 10 లక్షల రూపాయల సొంత నిధులను అందించారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, శ్రీకాంత్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కార్యకర్తల కు అండగా బీఆర్ఎస్ పార్టీ

**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా మలహర్ రావు మండలం రుద్రారం గ్రామానికి చెందిన బీ ఆర్ ఎస్ పార్టీ కార్యకర్త దుద్దిల్ల నిశాంత్ విద్యుత్ షాక్ తో ఇటీవల మరణించాడు. బి ఆర్ ఎస్ పార్టీ సభ్యత్వ ప్రమాద భీమా ఇన్సూరెన్స్ కంపెనీ నుండి మంజూరైన చెక్కును బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆదేశాల మేరకు మంథని పట్టణంలోని రాజాగృహ లో దుద్దిల్ల నిశాంత్ కుటుంబ సభ్యులకు 2,00,000 / (రెండు లక్షల) చెక్కును మంథని నియోజకవర్గ బీ ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అందచేశారు.

# కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన మండల బీజేపీ నాయకులు



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట బిజెపి మండల అధ్యక్షులు పల్లపు దుర్గయ్య ఆధ్వర్యంలో కేంద్ర మంత్రివర్యులు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం కిషన్ రెడ్డిని వారి నివాసంలో కలవడం జరిగింది. రామన్నపేట మండలంలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయవద్దని, రామన్నపేట మండలంలోని ప్రజలందరూ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని, మండలంలోని ప్రజలు అందరూ వ్యవసాయ మీద ఆధారపడి జీవిస్తున్నారని, కులవృతులు చేసుకొని జీవిస్తున్న ప్రజలందరూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని, పూర్తిగా రామన్నపేట మండల ప్రజల భవిష్యత్తు ప్రమాదంలో పడిపోయిందని, కేంద్ర మంత్రివర్యులకు వివరించడం జరిగింది. లగచర్ల, జగిత్యాల ఇథనాలల్ ఫ్యాక్టరీని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది కాబట్టి, ఆదాని సిమెంట్ ఫ్యాక్టరీని కూడా రద్దు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రామన్నపేట రైల్వే స్టేషన్లో నారాయణద్రి ఎక్స్ ప్రెస్ రైలు నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజ్ కుమార్, సీనియర్ నాయకులు కిసాన్ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి భాషకార్ల నరేందర్ రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు రాపోలు రమేష్, మండల కార్యదర్శి రావుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు అన్నదానం



**విశ్వంభర, నార్కెట్పల్లి:** ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రసిద్ధ శైవ క్షేత్రం గా విరాజిల్లుతున్న నార్కెట్పల్లి మండలంలోని. చెరువుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం కు అమావాస్య రోజు వచ్చే భక్తులకు
శ్రీ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్ర ట్రస్ట్. ప్రతి అమావాస్య లాగానే ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించినారు దాతల సహాయంతో విచ్చేసిన అన్ని కులాల భక్తులకు రుచికరమైన భోజనం ఏర్పాటు చేసినారు. కార్యక్రమంలో. సత్రం అధ్యక్షులు. రంగ శేఖర్, మీలో సోమయ్య, కందగట్ల శ్రీనివాస్, సత్రం సిబ్బంది. ఇతర భక్తులు పాల్గొన్నారు.

# రోడ్డుపై చెత్త వేయకుండా మున్సిపాలిటీ ఆటోలోనే వేయాలి

### తుక్కుగూడ మున్సిపాలిటీ చైర్మన్ బరిగెల హేమలత రాజు గౌడ్



**విశ్వంభర. మహేశ్వరం:** తుక్కుగూడ పురపాలక సంఘం లో 10వ వార్డ్ లో సానిటేషన్ పనులు నిర్వహించడం జరిగింది చైర్మన్ మాట్లాడుతూ ప్రతి ఒక్క వార్డులో సీసీ రోడ్లపై ప్రతిరోజు క్లీనింగ్ చేయాలి అదేవిధంగా రోడ్లపై చెత్త వేయకుండా ప్రజలు మున్సిపాలిటీ ఆటోలో వేయమని చెప్పడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్ పర్సన్ బరిగెల హేమలత రాజు గౌడ్ మున్సిపల్ కమిషనర్ వాణి రెడ్డి, మేనేజర్ పర్వతాలు. డి ఈ. ఎ ఈ.వార్డు కౌన్సిలర్ ,వార్డు ఆఫీసర్స్,కౌన్సిల్ సభ్యులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు .

# మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్




**విశ్వంభర, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజకవర్గం రామచంద్రాపురం మలి వయసులోనూ క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. భారతి నగర్ డివిజన్ పరిధిలోని బిహెచ్ఎల్ గ్రౌండ్స్ లో ఏర్పాటు చేసిన నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను ఆదివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ప్రతి వ్యక్తి తన నిత్య జీవితంలో క్రీడలకు సమయాన్ని కేటాయించాలని కోరారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం లభిస్తుందని తెలిపారు. అనంతరం క్రీడల నిర్వహణకు లక్ష రూపాయల సొంత నిధులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఇక్బాల్, సత్యనారాయణ, శామ్యూల్, పద్మ, క్రీడాకారులు పాల్గొన్నారు.

# పంతు నాయక్ సేవలు చిరస్మరణీయం : మాజీ జెడ్పీటిసి దశరథ్ నాయక్



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్ మాజీ ఎంపీపీ గిరిజనుల ముద్దుబిడ్డ పంతు నాయక్ సేవలు చిరస్మరణీయమని కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. గిరిజన జాతి కోసం తన జాతి అభ్యున్నతి కోసం ఎంతగానో పోరాడిన మహనీయుడు పంతు నాయక్ అన్నారు. అలాంటి పంతు నాయక్ ఈరోజు తమ మధ్యన లేకపోవడం బాధాకరమని అన్నారు. ఆయన భౌతికంగా లేకపోవచ్చు కానీ ఆయన చేసిన సేవలు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా ఉన్నాయని తెలిపారు. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా మైసిగండిలో ఆయన విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి లచ్చిరాం నాయక్ ప్రియా రమేష్ మాజీ సర్పంచ్ తులసి రామ్ నాయక్ ఐక్యవేదిక అధ్యక్షులు రాఘవేందర్ పంతు నాయక్ కుమారుడు భాస్కర్ నాయక్ నాయకులు కృష్ణ గోపాల్ రాజ్ కుమార్ అంజి జగన్ శ్రీకాంత్ భాస్కర్ శ్రీను నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వీరభద్ర స్వామిని దర్శించుకున్న వరంగల్ కుడా చైర్మన్



**విశ్వంభర, హనుమకొండ:** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ఉత్తర తెలంగాణలో సుప్రసిద్ధ కొత్తకొండ శ్రీ భద్రకాళి సమేతా వీరభద్రస్వామి వారిని కొత్తపెల్లి గ్రామంలోని దత్తాత్రేయ సాయిబాబా వార్లను ఈరోజు కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అంతకు ముందు వారికి ఆలయ అధికారులు,అర్చకులు పూర్ణకుంభం గుమ్మడికాయ తో ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం వేద అర్చకులు ఆశీర్వచనం శాలువాతో పాటు తీర్థ ప్రసాదాలు అందజేసి భద్రకాళీ, వీరభద్ర స్వామి వారి ప్రాశస్త్యమైన ఆ పరమశివుడు సహజంగా అతి సౌమ్యుడు.అలాంటి శివుడు దక్షయజ్ఞం తర్వాత అరివిరా భయంకర రూపంలో వీరభద్రుడు అవతరించిన క్షేత్రంగా వెలుగొందుతుందని ఈ ఆలయానికి 100 ఏళ్ల నాటి చరిత్ర ఉందని, ఈ స్వామి వారికీ గుమ్మడి కాయలు, కోర మీసాలు సమర్పించడం ఇక్కడి ప్రత్యేకత అని, సంతానం లేని వారు స్వామి వారికి కోర మీసాలను సమర్పించి మొక్కుకుంటే వారికి తప్పకుండా సంతానం కలుగుతుందని, స్వామి వారికి గుమ్మడికాయలు సమర్పిస్తే తమ కష్టాలు తొలగిపోయి కోరిన కోరికలు నెర వేరుతాయని భక్తుల విశ్వాసం. అందుకే ఇక్కడికి వచ్చే భక్తులు ఆ స్వామి వారికి కొరమీసాలు గుమ్మడి కాయలను సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని అర్చకులు చెప్పుకొచ్చారు.

# రైతుల పక్షాన పోరాడుతాం - కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**విశ్వంభర.మహేశ్వరం:** కందుకూరు మండలంలో రూపుదిద్దుకోనున్న ఫ్యూచర్ సిటికై ఏర్పాటు కానున్న 300 ఫీట్ల రోడ్డు కోసం భూములను కోల్పోతున్న రైతులు ఉదయం కేంద్ర మంత్రి , బిజెపి రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం కిషన్ రెడ్డి ని వారి నివాసంలో కలిసి తమ ఆవేదనను తెలియజేస్తూ, తమకు అండగా నిలబడాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఇష్టం లేకుండా భూసేకరణ చేపట్టే అధికారం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని, రైతులు ఎవరూ కూడా అధైర్య పడొద్దని వారికి భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి.బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకట్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి జంగయ్య యాదవ్, బిజెపి సీనియర్ నాయకులు అమరేందర్ రెడ్డి, మాదారం రమేష్ గౌడ్, వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# హెల్త్ క్యాంప్ లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మల్కాజ్గిరి పార్లమెంట్ ఇంచార్జ్

**విశ్వంభర, కూకట్ పల్లి :** కె.పి.హెచ్.బి కాలనీ టెంపుల్ బస్ స్టాప్ లో ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ మల్కాజ్గిరి పార్లమెంట్ ఇంచార్జ పట్నం సునీత మహేందర్ రెడ్డి హాజరై హెల్త్ క్యాంప్ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్నం సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గౌడ సంఘం సోషల్ వెల్ఫేర్ ఆరోగ్య కార్యక్రమాలు చేయడం చాలా సంతోషకరమని, వారిని అభినందించారు. కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, రాజేష్ గౌడ్, నితీష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంజీవరావు, డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, రేష్మ, స్వరూప గౌడ్, రవీందర్ గౌడ్, నజీర్ బాయ్, శ్రీధర్ చారి, గిరి నాయుడు, అక్బర్, మణి గౌడ్, తదితరులు ఉన్నారు.



# మాలలు ఐక్యంగా ఉండి హక్కులు సాధించు కోవాలి

**విశ్వంభర, ఆమనగల్లు :** సికింద్రా బాద్ పెరేడ్ గ్రౌండ్లో... ఎస్సి వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించే మాలల సింహ గర్జన కు ఆమనగల్ మండల్ లోచెన్నకేశవస్వామి దేవస్థానం నుండి బస్టాండ్ వరకు పెద్ద ఎత్తున భారీ సంఖ్యలో ర్యాలీ నిర్వహించిస్థానిక అంబేద్కర్ విగ్రహాలను పూలమాలవేసి నివాళులు అర్పించి మాల మహానాడు నాయకులు కాలే.మల్లయ్య జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాల మాల మహానాడు నాయకులు .కాలే మల్లయ్య. లండ చంద్రయ్య. గోరేటి నరసింహ.గోరటి దేవేందర్. రమేష్.జగన్. రాజు.చెన్నకేశవులు.వెంకటేష్. యాదయ్య. యువకులు పాల్గొన్నారు.



# వృద్ధా శ్రమానికి వితరణ

**విశ్వంభర, ఎల్బీనగర్:** వనస్థలిపురం లో రెడీ టూ ఫౌండేషన్ ఆద్వర్యం లో కొనసాగుతున్న ఓల్డ్ ఏజ్ హోం కు హైమవతి రూ. 50 వేల విరాళం అందచేశారు. భర్త మోహన్ రావు జ్ఞాపకార్థం హైమావతి వితరణ చేసినట్లు వృద్ధా శ్రమం నిర్వాహకుడు శంకర్ గౌడ్ తెలిపారు. ఓల్డ్ ఏజ్ హోం లో ఎక్కువ మంది వృద్ధులు ఉండడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు అవుతుంది అని ఎవరైనా దాతలు ఉంటే ఈ నెంబర్ కి సంప్రదించండి 8790815527 అని ఆయన తెలిపారు.

# ప్రజావ్యతిరేక శక్తులపై పోరాటం కొనసాగిస్తా: ప్రియాంక గాంధీ



**వయనాడ్:** కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వయనాడ్‌లోని మనంతవాడిలో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని, ప్రసంగించారు. ప్రజలకు ఉన్న హక్కులను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్న శక్తులపై తాము ఎంతో కాలంగా పోరాటం చేస్తుంటే..ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం ప్రజల గురించి కాకుండా తమ స్నేహితుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఆరోపించారు. వయనాడ్‌లో వరదలు సృష్టించిన విలయంలో ప్రజలు తీవ్రంగా నష్టపోయినా కేంద్ర ప్రభుత్వం ఎటువంటి సహాయాన్ని అందించట్లేదని మండిపడ్డారు. వయనాడ్ ఎంపీగా అక్కడి ప్రజల అవసరాలు, హక్కుల కోసం పార్లమెంట్‌లో తన గొంతుకను వినిపిస్తానని..వారి కోసం శక్తివంచన లేకుండా పని చేస్తానని అన్నారు. మన దేశంలో ఉన్న వ్యవస్థలను బలహీనం చేయడానికి ప్రయత్నిస్తున్న వారికి వ్యతిరేకంగా ప్రజలు కలిసికట్టుగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. కేంద్ర ఏజెన్సీలను ఎన్డీఏ ప్రభుత్వం పావులుగా వాడుకుంటూ..ప్రతిపక్షాలను భయపెట్టడానికి ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. రెండు రోజుల కేరళ పర్యటనలో భాగంగా ప్రియాంక, రాహుల్ గాంధీతో కలిసి శనివారం వయనాడ్ లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని తిరువంబాడిలోని ముక్కం, నికంబూర్‌లోని కౌలై, వండూరు, కొయ్‌కోడ్, మలప్పురం జిల్లాల్లో బహిరంగ సభల్లో పాల్గొన్నారు. నేడు మనంతవాడి ప్రాంత ప్రజలను కలిసి, వారి బాగోగులు తెలుసుకున్నారు. ఇటీవల వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో ఎంపీగా కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా విజయం సాధించిన విషయం తెలిసిందే. మొదటి సారి ప్రత్యక్ష ఎన్నికల్లో అరంగేట్రం చేసిన ప్రియాంక గాంధీ .. తొలిఅడుగులోనే వయనాడ్ స్థానం నుంచి భారీవిజయాన్ని నమోదు చేశారు. ఈఉప ఎన్నికలో తనసమీప ప్రత్యర్థిపై 4,10,931 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇదే స్థానంలో తన సోదరుడు రాహుల్ గాంధీ సాధించిన (3.64 లక్షలు) మెజార్టీని ఆమె అధిగమించారు.

## భోపాల్ విషాదంపై ముందే హెచ్చరించిన న్యాయవాది..!

### ఆ ఘటనకు సంబంధించిన తాజాగా వెలుగులోకి పలు కీలక విషయాలు




**భోపాల్:** నలభై ఏళ్ల క్రితం మధ్యప్రదేశ్‌లోని యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ నుంచి వెలువడిన విషవాయువులు పెను విషాదాన్ని మిగిల్చిన విషయం తెలిసిందే. అయితే, ఆ ఘటనకు సంబంధించిన పలు కీలక విషయాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఫ్యాక్టరీ నుంచి విషవాయువులు వెలువడుతున్నాయని, దాన్ని మూసివేయాలని ఘటనకు ముందే నోటీసులు పంపినట్లు షానవాజ్ ఖాన్ (75) అనే న్యాయవాది తెలిపారు. అయితే, ఈ హెచ్చరికలను ఫ్యాక్టరీ యాజమాన్యం కొట్టిపారేసిందని వెల్లడించారు. 1983 మార్చి 4న యూనియన్ కార్బైడ్ ఇండియా లిమిటెట్‌కు షానవాజ్ లీగల్ నోటీసులు పంపారట. 'ప్లాంట్ జనావాసాల మధ్య ఉంది. దీని నుంచి వెలువడుతున్న విషపూరిత వాయువులు, రసాయనాల నిల్వలతో సమీప కాలనీలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే 50 వేల మంది ప్రాణాలకు హాని కలుగుతుంది. 15 రోజుల్లోపు మీ ఫ్యాక్టరీలో విషవాయువులు, ప్రమాదకర రసాయనాల వినియోగాన్ని నిలిపివేయాలి. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు ఎదుర్కోవలసి ఉంటుంది' అని తాను నోటీసులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. 1981లో ఆ ఫ్యాక్టరీలో పనిచేసే ఓ కార్మికుడు విషవాయువు లీకవడంతో మృతి చెందారని ఖాన్ తెలిపారు. ఆ తర్వాత అక్కడ పలు మార్లు ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడంతో స్థానిక ప్రజలు అనారోగ్యానికి గురయ్యారని వెల్లడించారు. ఈ క్రమంలోనే తాను యూసీఐఎల్‌కి లీగల్ నోటీసులు పంపించానన్నారు. అయితే, వాటిని యూసీఐఎల్ కొట్టిపారేసిందని ఖాన్ తెలిపారు. భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ కర్మాగారం నుంచి 1984 డిసెంబర్ 2న అర్ధరాత్రి విష వాయువులు లీకయ్యాయి. ఆ దుర్ఘటనలో 3,787 మంది ప్రాణాలు కోల్పోగా.. దాదాపు 5లక్షల మంది తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దాని బాధితులు ఇంకా న్యాయ పోరాటం చేస్తూనే ఉన్నారు.

## డొనాల్డ్ ట్రంప్‌తో కెనడా ప్రధాని ట్రూడో భేటీ..



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ కెనడా, మెక్సికోలపై 25 శాతం సుంకం విధించనున్నట్లు చేసిన ప్రకటన ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ క్రమంలోనే దీనిపై చర్చించేందుకు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఫ్లోరిడాలోని మార్-ఎ-లాగో ఎస్టేట్ ఈ భేటీకి వేదికైంది. ఇరువురునేతలు వివిధఅంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. 'నేను కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోతో సమావేశమయ్యాను. ఇరు దేశాలు కలిసి పనిచేయడానికి అవసరమైన అనేక అంశాలపై మాట్లాడుకొన్నాం. అక్రమ వలసలు, ఫెంటనిల్ స్మగ్లింగ్ అంశాలు చర్చకు వచ్చాయి. అమెరికా కార్మికులకు నష్టం కలిగించని వాణిజ్యపరమైన అంశాలపై అభిప్రాయాలు పంచుకొన్నాం. చైనా నుంచి వస్తున్న ఫెంటనిల్ కారణంగా మా పౌరులు మాదకద్రవ్యాలకు బాధితులుగా మారడాన్ని చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశా. ఈ భయంకరమైన వినాశనాన్ని అంతంచేసేలా ట్రూడో మాతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారు' అని ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా పేర్కొన్నారు. మరోవైపు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కలిసి పనిచేసేందుకు తాను ఎదురుచూస్తున్నట్లు ట్రూడో ఎక్స్ వేదికగా వెల్లడించారు. గతేడాది కెనడా నుంచి అమెరికాకు దాదాపు 423 బిలియన్‌డాలర్ల ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. వీటిపై 20 లక్షల మంది కెనడా వాసుల ఉద్యోగాలు ఆధారపడ్డాయి. ఈ క్రమంలోనే అగ్రరాజ్యానికి అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ తాను అధికారంలోకి వచ్చాక కెనడా, మెక్సికోలపై అధిక సుంకం విధించనున్నట్లు ప్రకటించారు. చైనా నుంచి దిగుమతులపైనా 10 శాతం సుంకం విధించనున్నట్లు తెలిపారు.

## సోషల్ మీడియా నిషేధంపై మస్క్ విమర్శలు.. ఖండించిన ఆస్ట్రేలియా ప్రధాని



**సిడ్నీ:** ఆస్ట్రేలియా ప్రభుత్వం 16 ఏళ్లలోపు పిల్లలు సామాజిక మాధ్యమాలు వినియోగించకుండా బిల్లు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ప్రపంచకుబేరుడు ఎలాన్ మస్క్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ విమర్శలను ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ ఆల్బనీస్ తప్పుపట్టారు. ఆస్ట్రేలియాలో ఇంటర్నెట్ యాక్సెస్‌ను నియంత్రించడానికి ఈ నిషేధం బ్యాక్ డోర్‌లా ఉందని మస్క్ విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై ఆంటోనీ స్పందిస్తూ "ఎలాన్ మస్క్ ఓ అజెండాను కలిగి ఉన్నారు. ఆయన ఎక్స్ యజమాని. దాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు' అని పేర్కొన్నారు. సోషల్ మీడియా నిషేధంపై ఎవరితోనైనా చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ఆస్ట్రేలియా ప్రభుత్వం గత బుధవారం ఈ నిషేధానికి సంబంధించిన బిల్లును సభలో ప్రవేశపెట్టింది. ఇది 102 ఓట్లతో ఆమోదం పొందింది. దీనికి సెనెట్ ఆమోదంతెలిపితే చట్టరూపందాల్చ నుంది. ఆయా ప్లాట్‌ఫామ్‌ల్లో వయో పరిమితులు ఎలా అమలుచేస్తారన్న దానిపై ఒక ఏడాది సమయం ఇవ్వనున్నట్లు అధికా రులు తెలిపారు. ఒకవేళనిబంధనలుఉల్లంఘిస్తే వారిపై 50మిలియన్ ఆస్ట్రేలి యన్ డాలర్లు (రూ.273 కోట్లకు పైగా) జరిమానా విధిస్తా మని హెచ్చరికలు జారీ చేశారు.

## పొత్తు ప్రసక్తే లేదు.. దిల్లీలో ఒంటరి పోరుకు సిద్ధం: అరవింద్ కేజ్రీవాల్



దిల్లీ: వచ్చే ఏడాది దేశ రాజధాని దిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆమ్ ఆద్మీ పార్టీ కీలక నిర్ణయం తీసుకొంది. ఇండియా కూటమితో పొత్తుకు తాము సిద్ధంగా లేమని.. ఒంటరిగానే పోటీ చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. "దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పొత్తులకు దూరంగా ఉంటుంది. ఒంటరి పోరుకు సిద్ధం అవుతోంది" అని విలేకరుల సమావేశంలో పాల్గొన్న కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఆప్ అధినేత చేసిన ప్రకటనతో ప్రతిపక్ష ఇండియా కూటమికి ఎదురుదెబ్బ తగిలినట్లయింది. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా పంజాబ్‌లో కాంగ్రెస్‌తో పొత్తుకు ఆప్ నిరాకరించిన సంగతి తెలిసిందే. 13 స్థానాల్లో ఒంటరిగా బరిలోకి దిగింది. మరోవైపు, దిల్లీ ఎన్నికల్లో పొత్తు లేకుండా చేస్తామని ఇప్పటికే కాంగ్రెస్ కూడా ప్రకటించింది. ఈ క్రమంలోనే ఆప్ కూడా ఒంటరి పోరుకు సిద్ధమంటూ తాజాగా తెలిపింది. కాగా.. దక్షిణ దిల్లీలోని మాలవీయ నగర్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న కేజ్రీవాల్‌పై ఓ వ్యక్తి దాడికి పాల్పడిన ఘటన సంచలనం రేపింది. మెరుపు వేగంతో స్పందించిన భద్రతా సిబ్బంది అతడిని అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. ఈ దాడిపై కేజ్రీవాల్ స్పందించారు. "అసలు నేను చేసిన తప్పు ఏంటి..? దిల్లీ శాంతి భద్రతల అంశాన్ని లేవనెత్తాను. కేంద్రమంత్రి అమిత్ షా ఈ విషయం లో చర్యలు తీసుకుంటారని ఆశించాను. కానీ, దానికి బదులు పాదయాత్రలో నాపైనే దాడి జరిగింది. ఓ వ్యక్తి నాపై ద్రావకం విసిరాడు. అది ప్రమాదకరం కాదు. కానీ, అది హానికరం కావొచ్చు. మేము ప్రజా సమస్యలను లేవనెత్తాము. మీకు వీలైతే.. గ్యాంగ్‌స్టర్లను అరెస్టు చేయించండి. అంతే కానీ, మమ్మల్ని ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారు" అని ప్రశ్నించారు.

## తీరం దాటిన ఫెంగల్ తుఫాన్.. 16 గంటల తర్వాత తెరచుకున్న చెన్నై ఎయిర్‌పోర్ట్





**చెన్నై:** బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ తీరం దాటింది. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి మధ్య మహాబలిపురం-కారైకాల్ వద్ద తీరం దాటినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది పశ్చిమ-నైరుతి దిశగా కదులుతూ క్రమంగా బలహీన పడుతుందని, దీంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. తమిళనాడు, పుదుచ్చేరిపై తుఫాను విరుచుకుపడింది. భారీ వర్షాలు, వరదలతో ఇరు రాష్ట్రాలు అతలాకుతలమయ్యాయి. తమిళనాడులో కుండపోతగా వర్షాలు కురుస్తుండటంతో చెన్నై సహా పలు జిల్లాల్లో రాకపోకలు స్తంభించాయి.గత 34 గంటల్లో చాలా ప్రాంతాల్లో 20 సెంటీ మీటర్ల నుంచి 27 సెంటీ మీటర్ల మధ్య వర్షపాతం నమోదైంది. చెన్నై నగరవ్యాప్తంగా 134 ప్రాంతాలు నీట మునిగినట్లు అధికారుల అంచనా వేశారు. గాలుల తీవ్రత ఎక్కువగా ఉండటం, కుండపోత వర్షాలతో సహాయక చర్యల్లో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. బలమైన గాలులు వల్ల చాలా ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయని, వాటిని తొలగిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కరెంటు షాక్‌తో ముగ్గురు మరణించారు. ఇక 14 గంటల తర్వాత చైన్నై విమానాశ్రయం తెరుచుకున్నది. ఎయిర్‌పోర్టులోకి నీరు చేరడంతో శనివారం మధ్యాహ్నం విమానాశ్రయాన్ని అధికారులు మూసివేశారు. పలు విమానాలను రద్దుచేశారు. అయితే ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు ఎయిర్‌పోర్టులో తిరిగి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. అయితే విమాన సర్వీసులు మాత్రం ఇంకా అందుబాటులోకి రాలేదు.

### ఏపీలో భారీ వర్షాలు..

ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. తిరుపతి జిల్లాలో తడ దగ్గర జాతీయ రహదారిపై పెద్దఎత్తున వాన నీరు నిలిచింది. జిల్లాలోని సూళ్లూరుపేట తడ, దొరవారిసత్రం, నాయుడుపేట, పెళ్లకూరు మండలాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. సూళ్లూరుపేట, ఏర్పేడు, నారాయణవనం, కేవీబీపురం మండలాల పరిధిలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. తుఫాన్ ప్రభావంతో.. గూడూరు, కోట, వాకాడు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నెల్లూరు జిల్లాలో కుండపోతగా వర్షం కురుస్తున్నది. దీంతో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి.

### ఫెంగల్ తుఫాను ఎఫెక్ట్.. అదుపు తప్పిన ఇండిగో విమానం..!

చెన్నై: బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాను ప్రభావంతో తమిళనాడులో అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చాలా ప్రాంతాల్లో వరదనీరు పోటెత్తింది. చెన్నై విమానాశ్రయంలో సైతం నీరు చేరింది. రన్‌వేలు నీటిలో ఉండటంతో విమానాలు దిగేందుకు, ఎగిరేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. వర్షాల ఉద్ధృతి పెరగడంతో కొన్ని గంటలు విమానాశ్రయాన్నే మూసేయాల్సి వచ్చింది. కాగా చెన్నై విమానాశ్రయంలో ఓ విమానానికి త్రుటిలో ప్రమాదం తప్పింది. ఇండిగో ఎయిర్‌లైన్స్ ఎయిర్ బస్ విమానం ల్యాండ్ అవ్వడానికి ప్రయత్నించగా.. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో నియంత్రణ కోల్పోయింది. దాంతో తిరిగి గాల్లోకి ఎగిరింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెయింజల్ తుపాను శనివారం సాయంత్రం తమిళనాడు తీరాన్ని తాకింది. తీరం వెంబడి గరిష్ఠంగా గంటకు 90 కి.మీ. వేగంతో గాలులు వీస్తున్నాయి. చాలా జిల్లాల్లో రాకపోకలు స్తంభించాయి. చెన్నైలో అత్యంత భారీవర్షాలు కురుస్తున్నాయి. పెనుగాలి, కుండపోత వర్షాల కారణంగా సహాయక చర్యల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. పుదుచ్చేరిలో పర్యాటక ప్రాంతాలనూ మూసేశారు. వాతావరణ పరిస్థితులు కాస్త మెరుగుపడిన తర్వాత ఇండిగో ఎయిర్‌లైన్స్ ఆదివారం ఉదయం విమాన కార్యకలాపాలను తిరిగి ప్రారంభించింది.

## ఈవీఎంలను హ్యాక్ చేయగలనన్న వ్యక్తిపై కేసు



**దిల్లీ:** ఈవీఎంలను హ్యాక్ చేయగలనని పేర్కొన్న ఓ వ్యక్తిపై ముంబయిలో పోలీసు కేసు నమోదు అయ్యింది. మెషీన్ ఫ్రీక్వెన్సీలను వేరుచేయడం ద్వారా ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయగలనంటూ సోషల్ మీడియాలో అతడు చెప్పడాన్ని ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. అవి తప్పుడు, నిరాధారమైన వాదనలని స్పష్టం చేసింది.ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ ను హ్యాక్ చేయడంతోపాటు ట్యాంపరింగ్ చేయగలనంటూ ఓ వ్యక్తి చెబుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవల మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈవీఎంల హ్యాక్ చేయడం గురించి చెప్పినట్లు తెలుస్తోంది. దీనిని తీవ్రంగా పరిగణించిన ఎన్నికల సంఘం.. అతడిని సయ్యద్ షుజాగా గుర్తించింది. ఇతడిపై మహారాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముంబయి పోలీసులు నవంబర్ 30న కేసు నమోదు చేశారు."ఈవీఎంలపై తప్పుడు వాదనలు చేస్తున్న ఈ వ్యక్తిపై ముంబయి సైబర్ పోలీసులు కేసు నమోదు చేశారు. 2019లోనూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇతడిపై దిల్లీలో కేసు నమోదైంది. ప్రస్తుతం ఇతడు ఇతర దేశంలో ఉన్నాడు' అని ఈసీ వెల్లడించింది. ఈవీఎం అనేది స్వతంత్ర వ్యవస్థ కలిగిన మెషీన్ అని.. వైఫై లేదా బ్లూటూత్ వంటి వాటితో దీనిని అనుసంధానం చేయలేమని పేర్కొంది. దీనిని ట్యాంపరింగ్ చేయడం అసాధ్యమని ఎన్నికల సంఘం మరోసారి స్పష్టం చేసింది.

## పెళ్లికి హాజరైన బృందం.. మద్యం సేవించడంతో 40 మంది అరెస్ట్


**పాట్నా:** కొందరు వ్యక్తులు పెళ్లికి హాజరయ్యారు. మద్యం సేవించి డ్యాన్సులు చేశారు. అయితే ఆ రాష్ట్రంలో మద్యంపై నిషేధం ఉంది. ఈ నేపథ్యంలో పెళ్లిలో మద్యం సేవించిన సుమారు 40 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పెళ్లికుమారుడితో కలిసి పెళ్లి బృందం ఊరేగింపుగా పెళ్లి వేదిక వద్దకు చేరుకున్నది. అయితే పెళ్లి ఊరేగింపులో పాల్గొన్న సుమారు 40 మంది వ్యక్తులు మద్యం సేవించారు. కొందరు నాగిని డ్యాన్సు చేశారు. పెళ్లికి హాజరయ్యేందుకు వచ్చే తమ బంధువుల కోసం మద్యం బాటిల్స్ తీసుకువచ్చారు.కాగా, బీహార్‌లో మద్యంపై నిషేధం అమలులో ఉంది. ఈ నేపథ్యంలో పెళ్లి బృందం మద్యం సేవించినట్లు పోలీసులకు తెలిసింది. దీంతో వరుడి తరుపు వారైన 40 మంది వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారికి మద్యం అమ్మిన ఏడుగురు లిక్కర్ వ్యాపారులను కూడా అరెస్ట్ చేశారు. మద్యం బాటిల్స్‌తో పాటు రెండు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## అక్రమ వలసదార్ల కోసం పాక్ హెూటల్‌కు రూ.1,860 కోట్లా: తప్పుబట్టిన వివేక్ రామస్వామి



**వాషింగ్టన్:** అక్రమ వలసదారులకు వసతి కల్పించేందుకు న్యూయార్క్‌లోని పాకిస్థాన్ ప్రభుత్వ హెూటల్‌కు %వి%220 మిలియన్లు (రూ.1860.40 కోట్లు) చెల్లించడాన్ని రిపబ్లికన్ పార్టీ నేత వివేక్ రామస్వామి తప్పుపట్టారు. అక్రమ వలసదారుల కోసం పన్ను చెల్లింపుదారుల నిధులతో విడిది ఏర్పాట్లు చేయడాన్ని ప్రశ్నించారు. అమెరికాలో వారికి ఆశ్రయం కల్పించడానికి న్యూయార్క్ నగర పాలక సంస్థ పాక్ ప్రభుత్వానికి చెందిన రూజ్‌వెల్ట్ హెూటల్‌కు సొమ్ము చెల్లిస్తోందని తెలియడంతో ఈ విధంగా స్పందించారు. ఇటీవల అమెరికాకు చెందిన రచయిత జాన్ లెఫెవ్రే సోషల్ మీడియా వేదికగా పలు విమర్శలు చేశారు. "మాన్హాటన్‌లోని రూజ్‌వెల్ట్ హెూటల్ ప్రస్తుతం పాకిస్థాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ యాజమాన్యం అధీనంలో ఉంది. అందులో అక్రమ వలసదారులకు ఆశ్రయం కల్పించడానికి న్యూయార్క్ నగరం పాకిస్థాన్ ప్రభుత్వానికి %వి%220 మిలియన్లు (రూ.1860.40 కోట్లు) చెల్లిస్తోంది. పాక్ దివాలా తీయకుండా ఐఎంఎఫ్‌తో చేసుకొన్న 1.1 బిలియన్ డాలర్ల డీల్‌లో భాగంగానే.. ఈ హెూటల్‌ను ఎంచుకొన్నారు. ఈ స్వీట్ డీల్‌కు ముందు 2020 నుంచి సదరు స్టార్ హెూటల్ సరైన బుకింగ్స్‌లేక మూతపడే ఉంది " అని పేర్కొన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు థియోడర్ రూస్‌వెల్ట్ పేరుతో ఉన్న ఈ 19 అంతస్తుల భవనం ప్రస్తుతం ఈ వ్యవహారానికి కేంద్రంగా మారుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇందులో 1,200 గదులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పోస్టుకు వివేక్ స్పందిస్తూ.. "అక్రమ వలసదార్లకు పన్ను చెల్లింపుదార్లులే పాక్ ప్రభుత్వ హెూటల్‌లో విడిదిని ఏర్పాటు చేశారు. అంటే నగర పన్నుచెల్లింపుదారులే మన దేశంలో వారు ఉండేందుకు డబ్బు చెల్లిస్తున్నారు. ఇది మరీ విడ్డూరంగా ఉంది" అని పేర్కొన్నారు.అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించిన అనంతరం టెస్లా అధిపతి ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామిలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్) సంయుక్త సారథులుగా నియమించారు. ఏటా ప్రభుత్వం ఖర్చుపెడుతున్న 6.5 ట్రిలియన్ డాలర్లలో దుబారా, అవినీతిని అరికట్టడానికి.. ఫెడరల్ సంస్థలను పునర్నిర్మించడానికి వీరు కృషి చేస్తారని ట్రంప్ ప్రకటించారు. వీరు వాలంటీర్లుగా ప్రభుత్వానికి సహకరిస్తూ, ప్రభుత్వం తరపున పోరాటయోధులుగా ఉంటారని వివరించారు.

## ఖలిస్థాన్ ఉగ్రవాది అర్ష్ దల్లాకు బెయిల్..



**కెనడా:** భారత ప్రభుత్వం ఉగ్రవాదిగా ప్రకటించిన ఖలిస్థానీ వేర్పాటువాది అర్షదీప్ సింగ్ అలియాస్ అర్ష్ దల్లా కు కెనడా లోని కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అతడిని ఇటీవలే స్థానిక పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.అక్టోబర్ 28న కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్‌లోని మిల్టన్‌లో జరిగిన కాల్పుల ఘటనకు సంబంధించి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో జామీను మొత్తాన్ని అందజేసిన అనంతరం దల్లాకు బెయిల్ ఇచ్చినట్లు సమాచారం. అయితే అతడిని తమకు అప్పగించాలని ఇటీవల కెనడాను భారత్ కోరింది. ఈ నేపథ్యంలో అర్ష్ దల్లాకు అక్కడి కోర్టు బెయిల్ ఇవ్వడం గమనార్హం. మన దేశంలో అతడిపై ఉన్న కేసుల్లో దల్లాను ప్రశ్నించడానికి భారత అధికారులకు కోర్టు అవకాశం ఇవ్వలేదని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఈ విషయంపై కెనడా అధికారులతో చర్చించి, తగిన చర్యలు తీసుకుంటామని భారత అధికారులు చెబుతున్నారు.పంజాబ్‌లోని మోగా జిల్లాకు చెందిన దల్లాపై భారత్‌లో హత్య, వేధింపులు, అపహరణ సహా పలు కేసులు ఉన్నాయి. గతేడాది జనవరిలో భారత ప్రభుత్వం అతడిని ఉగ్రవాదిగా ప్రకటించింది. పెద్ద మొత్తంలో డ్రగ్స్, ఆయుధాల స్మగ్లింగ్‌లో అతడి పాత్ర ఉందని కేంద్ర హెూంమంత్రిత్వశాఖ కూడా తెలిపింది. దల్లాకు సంబంధించిన పలు కేసులను ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది. కెనడాలోని మిల్టన్ పట్టణంలో కాల్పుల ఘటనలో అతడిని అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. దీంతో అతడిని తమకు అప్పగించాలని భారత్ పలుమార్లు ట్రూడో ప్రభుత్వాన్ని కోరింది. ఖలీస్థానీ ఉగ్రవాది, గుర్తు తెలియని వారి కాల్పుల్లో హతమైన నిజ్జర్ కు దల్లా సన్నిహితుడు.

# కాకినాడ పోర్టుపై వస్తున్న ప్రశ్నలకు జగన్ జవాబు చెప్పాలి: మంత్రి నాదెండ్ల



**విశ్వంభర, విజయవాడ:** ఏపీలో గత ఐదేళ్లపాటు అక్రమంగా బియ్యం ఎగుమతి చేశారని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. రేషన్ బియ్యం కోసం రూ.12,800 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. విజయవాడలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు."మా ప్రభుత్వం వచ్చాక అక్రమ నిల్వలపై దాడులు చేశాం. కాకినాడలో జూన్ చివరి వారంలో 13 గిడ్డంగుల్లో తనిఖీ చేశాం. పట్టుకున్న బియ్యంలో 25 వేల టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించాం. ఆయా గిడ్డంగుల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేశాం. రేషన్ బియ్యం విషయంలో కాకినాడ పోర్టు పై ప్రత్యేక దృష్టి పెట్టాం. గత ఐదేళ్లపాటు కాకినాడ పోర్టులోకి ఎవరినీ రానివ్వలేదు. ఇక్కడ కేవలం 20 మంది సెక్యూరిటీని ఉంచుతారా..? ఎప్పుడు చూసినా ఇక్కడ 12 వెసల్స్ ఉంటాయి. మిగతా పోర్టుల కంటే కాకినాడ నుంచే ఎక్కువ ఎగుమతులు ఎందుకు జరిగాయి..? వ్యవస్థను గుప్పిట్లో ఉంచుకుని బియ్యం ఎగుమతి చేశారు. ద్వారంపూడి, కన్నబాబు గతంలో ఎందుకు మాట్లాడలేదు. పూర్తిస్థాయిలో పాతుకుపోయిన వ్యవస్థను ప్రక్షాళన చేయాలనే ఈ తనిఖీలు. కాకినాడ పోర్టు వెనక ఎవరున్నారో ప్రజలకు అర్థం కావాలి. ఈ పోర్టు నుంచి స్మగ్లింగ్ మాఫియాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వాస్తవాలు తెలుసుకునేందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్ చేసిన ప్రయత్నం గొప్పది. కాకినాడ పోర్టుపై వస్తున్న ప్రశ్నలకు జగన్ జవాబు చెప్పాలి" అని మంత్రి డిమాండ్ చేశారు.

# చంద్రబాబు సీఎం కావడం ఏపీకి శుభపరిణామం: కోల్ ఇండియా ఎండీ



**విశ్వంభర, విజయవాడ:** ఏపీలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కోల్ ఇండియా ఎండీ ప్రసాద్ తెలిపారు. విజయవాడలో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన బిజినెస్ ఎక్స్‌పో కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చంద్రబాబు సీఎం కావడం ఏపీకి శుభపరిణామమన్నారు. బిజినెస్ ఎక్స్‌పోకి మంచి స్పందన వచ్చిందన్న ఆయన.. ఇలాంటి ఎక్స్‌పోల ఏర్పాటుతో ఇన్నోవేటివ్ ఆలోచనలు వస్తాయన్నారు.

# పపంచం గుర్తించిన అవినీతి నేరాన్ని జగన్ మాత్రమే ఖండిస్తున్నారు: యనమల



విశ్వంభర, అమరావతి: జగన్ చేసిన రూ.1,750 కోట్ల అవినీతిపై ఏసీబీ విచారణ జరపడం సముచితమని తెదేపా సీనియర్ నేత యనమల రామకృష్ణుడు అన్నారు. ఈ అవినీతి ఇతర ప్రజా ప్రయోజనాలకు భిన్నంగా ఉన్నందున విచారణ జరపాలన్నారు. విద్యుత్ కొనుగోళ్లలో జగన్‌కు రూ.1,750కోట్లు ముట్టాయని ఎఫ్‌బీఐ నివేదిక స్పష్టం చేసిందన్నారు. ఆయన వచ్చి పత్రికలను విమర్శించడం అర్ధరహితమని చెప్పారు. ఆయన చేసిన ఆర్థిక నేరం ప్రపంచ వ్యాప్తంగా అందరికీ తెలిసిందని ఎద్దేవా చేశారు. నిరాధారమైన వాదనతో జగన్ పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నాడని యనమల మండిపడ్డారు."ఎఫ్‌బీఐతో పాటు అంతర్జాతీయ వార్తా పత్రికలపై జగన్ ఎందుకు దావా వేయలేకపోయారు? పరువు నష్టం కోసం తెలుగు ప్రముఖ దినపత్రికలను మాత్రమే ఎందుకు ఎంచుకున్నారు. ఆయన కుంభకోణాన్ని ఒక్క సాక్షి తప్ప జాతీయ, అంతర్జాతీయ మీడియాతో పాటు లండన్ ఎకనామిస్ట్ వంటి ఆంగ్ల పత్రికలు కూడా ప్రచురించాయి. ప్రపంచం గుర్తించిన అవినీతి నేరాన్ని జగన్ మాత్రమే ఖండిస్తున్నారు" అని యనమల రామకృష్ణుడు ఎద్దేవా చేశారు.

# తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి రూ. 50 లక్షల విరాళం



**విశ్వంభర, తిరుమల :** కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వర స్వామి చెంత ఉన్న స్విమ్స్ ఆసుపత్రికి ముంబైకి చెందిన జీన్ అండ్ బోమని ఎ దుబాష్ ఛారిటీ ట్రస్ట్ రూ. 50 లక్షలు విరాళంగా అందజేసింది. ఈ మేరకు తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో ఈవో జె శ్యామల రావు చాంబర్‌లో ఆ ట్రస్ట్ ప్రతినిధి చంద్రశేఖర్ చెక్కును ఈవోకు అందజేశారు.

# ట్రాన్స్‌జెండర్ హత్య కేసును ఛేదించిన పోలీసులు



**విశ్వంభర, నెల్లూరు:** నెల్లూరు జిల్లాలో కలకలం సృష్టించిన ట్రాన్స్ జెండర్ హాసిని హత్య కేసును పోలీసులు ఛేదించారు. ట్రాన్స్ జెండర్ల నాయకులు హాసిని, అలేఖ్యల మధ్య ఆధిపత్యపోరే హత్యకు కారణమని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ వెల్లడించారు. హత్య కేసులో 15 మంది ప్రమేయం ఉందని, వీరిలో 12 మందిని అరెస్ట్ చేశామన్నారు. పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు. హాసిని, అలేఖ్యల మధ్య గత కొంతకాలంగా విభేదాలు ఉన్నాయని ఎస్పీ తెలిపారు. వీరిపై తిరుపతి, నెల్లూరు జిల్లాలో పలు కేసులు నమోదయ్యాయన్నారు. హాసినికి సులోచన, షీలా అనే ట్రాన్స్ జెండర్లతోను విభేదాలు ఉన్నాయని, దీంతో అలేఖ్య, సులోచన, షీలాలు కలిసి హాసినీని మరికొందరి సహాయంతో కొడవలూరు మండలం టపాతోపు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఈ నెల 26న దారుణంగా హత్య చేయించారని తెలిపారు. హత్యలో పాల్గొన్న నిందితులంతా నెల్లూరు జిల్లాకు చెందిన వారేనని చెప్పారు. సాంకేతిక ఆధారాలతో కేసును ఛేదించామన్నారు. కేసును పరిశోధించిన కొడవలూరు, విడవలూరు పోలీసులను ఎస్పీ అభినందించారు.

# బతికే ఉందాం.. మరో నలుగురిని బతికిద్దాం..

## 'ఎక్స్'లో లోకేశ్ భావోద్వేగ పోస్టు



**విశ్వంభర, అమరావతి:** తెలుగుదేశం కార్యకర్త శ్రీను ఆత్మహత్యపై మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్'లో భావోద్వేగ పోస్టు చేశారు. అన్నా.. అన్నా.. అని పిలుస్తూ ఎవరికి ఏ కష్టం వచ్చినా సహాయం చేయాలని మెసేజ్ చేసే శ్రీను తనకు ఆపద వస్తే ఒక్క మెసేజ్ చేయాలనిపించలేదా అని ఆవేదన వ్యక్తం చేశారు. దిద్దలేని చాలా పెద్ద తప్పు చేశావు తమ్ముడు, ఐ మిస్ యూ అంటూ తన బాధను వ్యక్తపరిచారు. కష్టమేంటో కూడా అతడు చెప్పుకోలేదని లోకేశ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ఓ అన్నగా తానున్నానని.. వారికి అండగా ఉంటూ అన్ని బాధ్యతల్ని నెరవేరుస్తానని భరోసా ఇచ్చారు. ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా కష్టసుఖాలను పంచుకుందాం అంటూ కార్యకర్తలకు లోకేశ్ పిలుపునిచ్చారు. సమస్యలను కుటుంబం, స్నేహితులు, బంధువులు, పార్టీలో హితులు.. ఎవరితోనైనా షేర్ చేసుకోవాలని సూచించారు. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందని.. దయచేసి ఆత్మహత్య లాంటి తప్పుడు నిర్ణయాలు ఎవరూ తీసుకోవద్దని కోరారు. బతికే ఉందాం మరో నలుగురిని బతికిద్దాం అంటూ పిలుపునిచ్చారు.

# బెజవాడ దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష.. 'ప్రసాద్' పథకం నిధుల సాధనే లక్ష్యం



**విశ్వంభర, విజయవాడ:** కనకదుర్గమ్మ ఆలయ అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం నుంచి తీర్థయాత్ర స్థలాల పునరుజ్జీవనం-ఆధ్యాత్మిక వృద్ధి లక్ష్యంగా నిర్దేశించిన 'ప్రసాద్ పథకం' కింద నిధులు ఏ విధంగా పొందాలనే అంశంపై దేవాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి సమీక్ష నిర్వహించారు. స్థానిక ఎంపీ కేశినేని చిన్ని, దేవాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, దేవస్థానం ఈవో కేఎస్ రామారావు ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.సనాతన ధర్మాన్ని పాటిస్తూ, ఆగమ శాస్త్రాలు, వైదిక ఆచారాల ఆధారంగా మాస్టర్‌ప్లాన్‌లోని అంశాలపై చర్చించారు. ప్రసాద్ పథకం నియమ నిబంధనలు మారుతున్నాయని, అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు, ప్రతిపాదనలు తయారీపై తగిన సూచనలు చేశారు. దేవాదాయ, పర్యాటక శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రణాళికలు రూపొందించినప్పుడే కేంద్రం నుంచి నిధులు విడుదలయ్యే అవకాశం ఉంటుందని ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. గతంలో పాలకులు వైదిక సంప్రదాయాలు, ఆగమ శాస్త్ర విధానాలను పాటించలేదని, తమ ప్రభుత్వం ఆ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ఖచ్చితంగా పాటిస్తుందని మంత్రి ఆనం చెప్పారు. భక్తులు ఎక్కువ సమయం క్యూ లైన్లో నిల్చునే పరిస్థితులు లేకుండా నిరీక్షణ గదులు నిర్మించాలని సూచించారు. వచ్చే వందేళ్లకు భక్తుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రణాళికలు ఉండాలని పేర్కొన్నారు.

# తిరుమలలో భారీ వర్షాలు.. విరిగిపడిన కొండచరియలు



విశ్వంభర, తిరుమల: తుపాను ప్రభావంతో తిరుమలలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రెండో ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు జేసీబీలతో బండరాళ్లను తొలగిస్తున్నారు.

# తిరుపతి స్థానికులకు శ్రీవారి దర్శనం.. మార్గదర్శకాలు జారీ చేసిన టీటీడీ



**విశ్వంభర, తిరుమల:** తిరుపతి స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించాలని ధర్మకర్తల మండలి తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతి నెలా మొదటి మంగళవారం దర్శనభాగ్యం కల్పించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది. డిసెంబరు 3 నుంచి స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించనున్నారు. ఇందుకు సంబంధించి డిసెంబరు 2న తిరుపతిలోని మహతి ఆడిటోరియం, తిరుమల బాలాజీ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో దర్శన టోకెన్లు ఉచితంగా జారీ చేస్తారు. మహతి ఆడిటోరియంలో 2,500 టోకెన్లు, తిరుమలలోని బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో 500 టోకెన్లు ఉదయం 3 నుంచి 5గంటల మధ్య జారీ చేయనున్నారు.

ముందుగా వచ్చిన వారికి తొలి ప్రాధాన్యత క్రమంలో టోకెన్లు కేటాయిస్తారు. దర్శనం టికెట్ పొందడానికి స్థానికులు తమ ఒరిజినల్ ఆధార్‌కార్డు తప్పనిసరిగా చూపించాలి. టోకెన్లు పొందిన భక్తులు దర్శన సమయంలో ఒరిజినల్ ఆధార్‌కార్డు తీసుకురావాల్సి ఉంటుంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని ఫుట్‌పాత్ హాల్ (దివ్యదర్శనం)క్యూలైన్‌లో భక్తులను దర్శనాలకు అనుమతిస్తారు. ఇతర దర్శనాల్లో ఇచ్చే విధంగా దర్శనానంతరం ఒక లడ్డూ ఉచితంగా అందిస్తారు. స్థానికుల కోటాలో దర్శనం చేసుకున్న వారికి తిరిగి 90 రోజుల వరకు దర్శనం చేసుకునేందుకు అవకాశం ఉండదు.

# సోనియాగాంధీ కోసం గంటపాటు ఫోన్ కాల్‌లో వేచిచూశా: నజ్మా హెప్తుల్లా

దిల్లీ: రాజ్యసభ మాజీ డిప్యూటీ ఛైర్‌పర్సన్, ప్రముఖ రాజకీయ నాయకురాలు నజ్మా హెప్తుల్లా స్వీయ జీవితచరిత్ర "ఇన్ పర్స్యూట్ ఆఫ్ డెమోక్రసీ: బియాండ్ పార్టీ లైన్స్" అనే పుస్తకం తాజాగా



విడుదలైంది. ఇందులో ఆమె కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి, తనకు మధ్య జరిగిన ఓ సంఘటన గురించి పంచుకున్న విషయాలు బయటకు వచ్చాయి. అదేంటంటే..1999లో తాను ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ (ఐపీయూ) అధ్యక్షురాలిగా ఎన్నికయ్యానని ఆ విషయం తెలియజేయడానికి అప్పటి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీకి ఫోన్ చేశానని నజ్మా హెప్తుల్లా పేర్కొన్నారు. అయితే ఆమె సిబ్బంది ఒకరు తనతో మాట్లాడి "మేడం బిజీగా ఉన్నారు..లైన్‌లో ఉండండి" అని చెప్పారని, తాను గంటపాటు ఫోన్ లైన్‌లో ఉన్నా సోనియా గాంధీ తనతో మాట్లాడలేదని తెలిపారు. ఈ ఘటనతో తాను తీవ్ర నిరాశకు గురయ్యానని..మళ్లీ ఆ విషయం గురించి సోనియాతో ప్రస్తావించలేదని పేర్కొన్నారు. అయితే అంతకు ముందు ఐపీయూ ప్రెసిడెంట్ పదవికి తన పేరును సిఫార్సు చేసే ముందు ఆమె తనను అభినందనలు తెలిపారని గుర్తు చేసుకున్నారు. అదే సమయంలో అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయికి ఫోన్ చేయగా ఆ విషయం విని ఆయన సంతోషం వ్యక్తం చేశారని అన్నారు. భారత దేశానికి గౌరవం తెచ్చావని మెచ్చుకున్నారని తెలిపారు. 2000 సంవత్సరంలోనూ న్యూయార్క్‌లో జరిగిన "మిలీనియం కాన్ఫరెన్స్ ఆఫ్ ప్రిసైడింగ్ ఆఫీసర్స్" కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా సోనియా గాంధీని ఆహ్వానించగా..తాను రాలేకపోతున్నానని చివరి నిమిషంలో కబురు చేశారని అన్నారు. కాంగ్రెస్ కోసం ఎంతో కృషి చేసిన తనలాంటి వారికి ఆ పార్టీ సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని..దాని వల్ల అగ్రనేతలు, పార్టీ శ్రేణుల మధ్య అభిప్రాయభేదాలు వచ్చాయన్నారు. పార్టీ పెద్దల సలహాలు, సూచనలను పట్టించుకునే వారు కాదని.. అందువల్లే ఎందరో రాజకీయ అనుభవజ్ఞులు కాంగ్రెస్‌ను వీడాల్సి వచ్చిందని రాసుకొచ్చారు. కానీ ఇందిరాగాంధీ హయాంలో పార్టీలోని ప్రతి ఒక్క కార్యకర్తకు ప్రాధాన్యం ఉండేదని..ఆమే స్వయంగా ప్రజల్లోకి, పార్టీ నేతల్లోకి వచ్చి పరిస్థితులను తెలుసుకునేవారని గుర్తు చేసుకున్నారు. భారత రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన నజ్మా హెప్తుల్లా ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ మనవరాలు. మొదట కాంగ్రెస్ నేతగా రాజకీయ జీవితం ప్రారంభించిన ఆమె 1980, 2016 మధ్య ఆరుసార్లు రాజ్యసభ సభ్యురాలిగా పని చేశారు. సోనియా గాంధీతో విభేదాలు రావడంతో 2004లో కాంగ్రెస్‌ను వీడి, భాజపాలో చేరారు. 2012లో భారతీయ జనతా పార్టీ (భాజపా) ఉపాధ్యక్షురాలిగా నామినేట్ అయ్యారు. 2014-2016 మధ్య కేంద్ర మంత్రిగా పనిచేసారు. మణిపూర్ గవర్నర్‌గా ఉన్నారు. ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, మహిళల హక్కులు మొదలైన విషయాల గురించి పలు పుస్తకాలు రచించారు.

# 3న ఏపీ క్యాబినెట్ భేటీ

విశ్వంభర, అమరావతి: ఏపీలో ఈ నెల 3న మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. ఈ నెల 4కు బదులుగా 3నే క్యాబినెట్ భేటీ జరగనుంది. ఈమేరకు ఆదివారం సాయంత్రం 4 గంటల లోగా ప్రతిపాదనలు పంపాలని శాఖాధిపతులకు సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశం పంపారు.

# గరుగుబిల్లిలో అక్రమ మైనింగ్ ఆపాలి.. పవన్ కల్యాణ్‌కు సీపీఐ నేత రామకృష్ణ లేఖ



**విశ్వంభర, అమరావతి:** ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ లేఖ రాశారు. పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలంలో అత్యం మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అక్రమ మైనింగ్‌ను ఆపాలని అందులో కోరారు. ఈ ప్రాంతంలో డ్రిల్లింగ్ వల్ల భూగర్భ జలాలు, తాగునీరు కలిషితమైపోయాయని పేర్కొన్నారు. కిడ్నీ వ్యాధులకు గురై ఇప్పటికే 12 మంది మృతి చెందగా.. అనేక మంది అనారోగ్యం పాలయ్యారని చెప్పారు. అక్రమ మైనింగ్ గోతుల వల్ల కొండపై నుంచి దిగువ పొలాలకు వర్షపు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అత్యం మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌పై కఠిన చర్యలు చేపట్టాలని రామకృష్ణ లేఖలో కోరారు.

# ఫెయింజల్ ఎఫెక్ట్.. విశాఖ-తిరుపతి, విశాఖ-చెన్నై విమానాలు రద్దు



విశ్వంభర, విశాఖ: ఫెయింజల్ తుపాను ప్రభావంతో ఏపీలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ కారణంగా విశాఖ నుంచి పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. తిరుపతిలో భారీ వర్షాల కారణంగా విశాఖ-తిరుపతి విమాన సర్వీసులను రద్దు చేశారు. మరోవైపు చెన్నైలో తుపాను ప్రభావం తీవ్రంగా ఉండటంతో విశాఖ-చెన్నై విమాన సర్వీసులను కూడా రద్దు చేసినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు.తుపాను ప్రభావంతో భారీ వర్షాలకు తిరుమలలో ప్రధాన జలాశయాలు నిండాయి. గోగర్భం జలాశయం రెండు గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తున్నారు. కుమారధార, పసుపుధార, పాపవినాశనం, ఆకాశగంగ జలాశయాల్లో పూర్తిస్థాయికి నీటిమట్టం చేరింది.అన్నమయ్య జిల్లాలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. రైల్వే కోడూరు నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రైల్వేకోడూరు సమీపంలో గుంజన నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పరివాహక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.తుపాను ప్రభావంతో ప్రకాశం జిల్లా కొత్తపట్నం సముద్రతీరం అల్లకల్లోలంగా మారింది. 20 మీటర్ల మేర సముద్రం ముందుకు వచ్చింది. దీంతో కార్తిక మాసం భక్తులు సముద్ర స్నానాలకు వెళ్లొద్దని మెరైన్ పోలీసులు సూచించారు.

# చెట్టును ఢీకొన్న కారు.. ముగ్గురు వైద్యుల మృతి

విశ్వంభర, విడపనకల్లు: అనంతపురం జిల్లాలోని విడపనకల్లు వద్ద కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మరో వ్యక్తికి తీవ్రగాయాలు కాగా.. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలంలో కారు నుజ్జునుజ్జు కాగా.. మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. తీవ్రమైన మంచు వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతులను బళ్లారికి చెందిన ఓపీడీ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు యోగేశ్, గోవిందరాయ, అమరేశ్‌గా గుర్తించారు. వీరంతా హాంకాంగ్ విహారయాత్రకు వెళ్లి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.



## ఆస్ట్రేలియా ప్రైమ్ మినిస్టర్స్ XI జట్టుపై భారత్ గెలుపు

**సిడ్నీ:** బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో డే అండ్ నైట్ టెస్టు మ్యాచ్‌కు ముందు ఆస్ట్రేలియా ప్రైమ్ మినిస్టర్స్ XI జట్టుతో జరిగిన వామప్ మ్యాచ్‌లో భారత్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ ప్రాక్టీస్ మ్యాచ్‌లో నిర్ణీత 46 ఓవర్లలో భారత్ ఐదు వికెట్ల నష్టానికి 257 పరుగులు చేసింది. అంతముందు 43.2 రెండు ఓవర్లకు ఆలౌట్ అయిన ఆస్ట్రేలియా ప్రైమ్ మినిస్టర్స్ XI టీమ్ 240 పరుగులు మాత్రమే చేయగలిగింది.రెండు రోజులపాటు ఈ వామప్ మ్యాచ్ జరగాల్సి ఉండగా.. తొలిరోజు పూర్తిగా వర్షం కారణంగా తుడిచిపెట్టుకుపోయింది. రెండో రోజు 50 ఓవర్ల చొప్పున మ్యాచ్ ఆడేందుకు ఇరు జట్ల కెప్టెన్‌లు ఒప్పుకున్నారు. మ్యాచ్ ప్రారంభమైన కాసేపటి మళ్లీ వర్షం అంతరాయం కలిగించింది. తర్వాత వర్షం తెరపినీయడంతో మ్యాచ్‌ను 46 ఓవర్లకు కుదించారు.ఈ క్రమంలో ఆస్ట్రేలియా ప్రైమ్ మినిస్టర్స్ XI జట్టు 43.2 ఓవర్లలో 240 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. ఓపెనర్ సామ్ కోన్‌స్టాస్ (107), హన్నో జాకబ్స్ (60), జాక్ క్లేటన్ (40) రాణించారు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా 4 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టు నడ్డి విరిచాడు. ఆకాష్ దీప్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన భారత్ 46 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 257 పరుగులు చేసింది.శుభ్‌మాన్ గిల్ (50), యశస్వి జైస్వాల్ (45), నితీశ్ రెడ్డి (42), వాషింగ్టన్ సుందర్ (42), కేఎల్ రాహుల్ (27), రవీంద్ర జడేజా (27) రాణించారు. ఆస్ట్రేలియా ప్రైమ్ మినిస్టర్స్ XI టీమ్ బౌలర్ చార్లీ అండర్సన్ రెండు వికెట్లు తీశాడు.

## నవంబర్ జీఎస్టీ వసూళ్లు ₹1.82 లక్షల కోట్లు

**దిల్లీ:** దేశంలో వస్తు,సేవల పన్ను వసూళ్లు మరోసారి గణనీయ స్థాయిలో నమోదయ్యాయి. నవంబర్ మాసంలో రూ.1.82లక్షల కోట్లు వసూలయ్యాయి. ఇందులో సీజీఎస్టీ రూపంలో రూ.34,141 కోట్లు, ఎస్‌జీఎస్టీ రూపంలో రూ.42,047 కోట్లు, ఐజీఎస్టీ రూపంలో రూ.91,828 కోట్లు సమకూరాయి. సెస్సుల రూపంలో మరో రూ.13, 253కోట్లు వచ్చాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తెలిపింది. దేశీయ లావాదేవీలతో అధిక మొత్తంలో రెవెన్యూ సమకూరినట్లు పేర్కొంది.గతేడాది నవంబర్‌తో (రూ.1.68 లక్షల కోట్లు) పోలిస్తే జీఎస్టీ వసూళ్లలో 8.5శాతం పెరగడం గమనార్హం. 202324 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ వసూళ్లు రూ.1.60 లక్షల కోట్ల మార్కును దాటడం ఇది ఏడోసారి. ఈ ఏడాది అక్టోబర్‌లో రూ.1.87 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు 9శాతం వార్షిక వృద్ధితో రెండో అత్యుత్తమ వసూళ్లు కాగా.. 2024 ఏప్రిల్‌లో అత్యధికంగా రూ.2.10 లక్షల కోట్లు వసూళ్లు వచ్చాయి.

# తుది జట్టులో మూడు మార్పులు ఖాయం

### సునీల్ గావస్కర్




**ముంబయి:** బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ సిరీస్‌లో తొలి టెస్టులో ఘన విజయం సాధించి ఊపుమీదున్న టీమ్ఇండియా.. రెండో మ్యాచ్‌కు సన్నద్ధమవుతోంది. డిసెంబరు 6న అడిలైడ్ వేదికగా ఆరంభమయ్యే రెండో టెస్టు డే/నైట్‌లో, గులాబీ బంతితో జరగనుంది. దీంతో మ్యాచ్‌పై మరింత ఆసక్తి పెరిగింది. మరోవైపు, రెండో టెస్టు కోసం భారత తుది జట్టులో మార్పులు జరిగే అవకాశముంది. తొలి మ్యాచ్‌కు దూరమైన రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ రెండో టెస్టులో ఆడటం ఖాయం. ఈ నేపథ్యంలోనే భారత దిగ్గజ ఆటగాడు సునీల్ గావస్కర్ ఆసీస్‌తో రెండో టెస్టు కోసం తుది జట్టు ఎలా ఉండనుందో అంచనా వేశాడు. రోహిత్, గిల్ రాకతో దేవ్‌దత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్ ప్లేయింగ్ ఎలెవన్ నుంచి బయటకివస్తారని పేర్కొన్నాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో కూడా మార్పులు జరిగే అవకాశముందని గావస్కర్ అభిప్రాయపడ్డాడు.
'కచ్చితంగా రెండు మార్పులు ఉంటాయని నేను భావిస్తున్నాను. రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ తుది జట్టులోకి వస్తారు. బ్యాటింగ్ ఆర్డర్ కూడా మార్పులు ఉంటాయనుకుంటున్నా. కేఎల్ రాహుల్ స్థానంలో రోహిత్, మూడో స్థానంలో శుభ్‌మన్ గిల్ వస్తారు. పడిక్కల్, జురెల్ ప్లేయింగ్ ఎలెవన్ నుంచి బయటకు వెళ్తారు. రాహుల్ ఆరో స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు. మూడో మార్పు ఏంటంటే వాషింగ్టన్ సుందర్ ప్లేస్‌లో రవీంద్ర జడేజా తుది జట్టులోకి వస్తాడు' అని గావస్కర్ పేర్కొన్నాడు.

ఆసీస్‌తో రెండో టెస్టు: సునీల్ గావస్కర్ అంచనా **వేసిన భారత్ తుది జట్టు**
రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్.

# టెస్టు క్రికెట్‌లో సచిన్ రికార్డును బ్రేక్ చేసిన జో రూట్

**లండన్:** ఇంగ్లాండ్ బ్యాటర్ జో రూట్ మరో ఘనత అందుకున్నాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో నాలుగో ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగులు (1630) చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. అంతకుముందు ఈ రికార్డు సచిన్ తెందూల్కర్ (1625 పరుగులు) పేరిట ఉండేది. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టు నాలుగో ఇన్నింగ్స్‌లో రూట్ 23 పరుగులు చేసి ఈ ఫీట్ సాధించాడు. సచిన్ 60 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఘనత అందుకోగా.. జో రూట్ కేవలం 49 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఫీట్ సాధించాడు. ఇప్పటివరకు 150 టెస్టులు ఆడిన అతడు.. 12,777 పరుగులు చేశాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఎక్కువ రన్స్ చేసిన ఆటగాళ్ల జాబితాలో ప్రస్తుతం ఐదో స్థానంలో ఉన్నాడు.
న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో ఇంగ్లాండ్ ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆదివారం 155/6స్కోరుతో రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన కివీస్.. 254 పరుగులకు ఆలౌటైంది. డారిల్ మిచెల్ (84; 167 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్) పదో వికెట్‌గా వెనుదిరిగాడు. న్యూజిలాండ్ నిర్దేశించిన 104 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ 12.4 ఓవర్లలోనే ఛేదించింది. జాకబ్ బెథెల్ (50*; 37 బంతుల్లో), బెన్ డకెట్ (27; 18 బంతుల్లో), జో రూట్ (23*; 15 బంతుల్లో) పరుగులు చేశారు.




టెస్టుల్లో నాలుగో ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లు
జో రూట్ 1630 (49 ఇన్నింగ్స్‌లు)
సచిన్ తెందూల్కర్ 1625 (60 ఇన్నింగ్స్‌లు)
అలిస్టర్ కుక్ 1611 (53 ఇన్నింగ్స్‌లు)
గ్రేమ్ స్మిత్ 1611 (41 ఇన్నింగ్స్‌లు)
శివనారాయణ్ చందర్‌పాల్ 1580 (49 ఇన్నింగ్స్‌లు)

### సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300 టోర్నీలో

## సింధు, లక్ష్యసేన్, గాయత్రీ - ట్రీసాకు టైటిల్స్



**లక్నో:** సయ్యద్ మోదీ అంతర్జాతీయ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్ ట్రీసా జాలీ జోడీ అదరగొట్టింది. ఫైనల్‌లో 2118, 2111 తేడాతో బావో లి జింగ్, లీ కియాన్ (చైనా) ద్వయంపై వరుస గేమ్‌ల విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. గాయత్రిట్రీసా జోడీకిది తొలి సూపర్ 300 టైటిల్ కావడం విశేషం. ఈ టోర్నీలో టైటిల్‌ను గెలిచిన తొలి భారత మహిళల డబుల్స్ జోడీగా రికార్డు సృష్టించింది. ఈ జోడీ 2022 ఎడిషన్‌లో రన్నరప్‌గా నిలిచింది.

**సింగిల్స్ టైటిల్సూ మనవే..**
మహిళల సింగిల్స్ పీవీ సింధు ఘన విజయం సాధించింది. చైనాకు చెందిన వు లు యుపై 2114, 2116తో గెలుపొందింది. 2017, 2022 తర్వాత సింధు మూడోసారి ఈ టైటిల్ గెలుపొందడం విశేషం. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ కూడా ఫైనల్‌లో గెలుపొందాడు. సింగపూర్‌కు చెందిన జియా హెంగ్ జేసన్ తేపై 216, 217తో విజయం సాధించాడు.

**మిక్స్‌డ్ డబుల్స్, పురుషుల డబుల్స్‌లో నిరాశ**
మిక్స్‌డ్ డబుల్స్, పురుషుల డబుల్స్‌లో మాత్రం భారత్‌కు నిరాశే మిగిలింది. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌లో అయిదో సీడ్ తనీషా ధ్రువ్ 2118, 1421, 821తో డెచాపోల్, డెచాపోల్ (థాయ్‌లాండ్) చేతిలో పరాజయం పాలయ్యారు.పురుషుల డబుల్స్ ఫైనల్‌లో పృథ్వీ ప్రతీక్ జోడీ పోరాడింది. 71 నిమిషాలపాటు సాగిన టైటిల్ పోరులో 1421, 2119, 1721తో హువాంగ్ డి, లియు యాంగ్ (చైనా) ద్వయం భారత జోడీపై విజయం సాధించింది.

## సీఎస్కేలోకి వెళ్లడం కష్టమని అప్పుడు అర్థమైంది: దీపక్ చాహర్

**చెన్నై:** ఇటీవల ముగిసిన ఐపీఎల్ మెగా వేలంలో దీపక్ చాహర్‌ను చెన్నై సూపర్ కింగ్స్ తిరిగి దక్కించుకుంటుందని సీఎస్కే అభిమానులు భావించారు. 2018 నుంచి అతడు చెన్నై జట్టులో కీలక ఆటగాడిగా ఉండటమే ఇందుకు కారణం. దీపక్ కూడా చెన్నై జట్టుకే ఆడాలనుకున్నాడు. అతడి కోసం సీఎస్కే గట్టిగానే ప్రయత్నించినా తిరిగి దక్కించుకోవడం సాధ్యం కాలేదు. ఈ ఫాస్ట్ బౌలర్‌ను ముంబయి ఇండియన్స్ రూ.9.25 కోట్లకు సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఐపీఎల్ వేలం, సీఎస్కేతో తనకున్న అనుబంధం గురించి దీపక్ చాహర్ తాజాగా మాట్లాడాడు. 'ప్రారంభం నుంచి మహేంద్ర సింగ్ ధోనీ నాకు మద్దతుగా నిలిచాడు. అందుకే సీఎస్కేలోకి వెళ్లాలనుకున్నా. కానీ, వేలంలో నా పేరు రెండో రోజు రావడంతో తిరిగి చెన్నై జట్టులోకి వెళ్లడం కష్టమని అర్థమైంది. గత సంవత్సరం నా పేరు మొదట వచ్చింది. అందుకే సులభంగా సీఎస్కేలోకి తిరిగి వెళ్లా. ఈ సారి నా పేరు వేలంలోకి వచ్చేసరికి చెన్నై వద్ద రూ.13 కోట్లే ఉన్నాయి. అయినా, నా కోసం రూ.9 కోట్ల వరకు బిడ్ వేసింది' అని దీపక్ చాహర్ వివరించాడు. ఇప్పటివరకు దీపక్ ఐపీఎల్‌లో 81 మ్యాచ్‌లు ఆడి 77 వికెట్లు పడగొట్టాడు. గత సీజన్‌లో మాత్రం ఎనిమిది మ్యాచ్‌లు ఆడి ధారాళంగా పరుగులు ఇవ్వడంతోపాటు ఐదు వికెట్లే తీశాడు. ముంబయి ఇండియన్స్‌లో దీపక్.. బుమ్రాతో కలిసి బౌలింగ్ చేయయనున్నాడు.

# పసిడి రుణాలకు ఫుల్ డిమాండ్

### ఏడు నెలల్లో 50 శాతం పెరిగాయ్ : ఆర్బీఐ



**ముంబయి:** బంగారంపై రుణాలు తీసుకునేవారి సంఖ్య భారీగా పెరిగారు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తినప్పుడు, అత్యవసర అవసరాలకోసం బంగారమే పరమావధిగా కనిపిస్తున్నది. సామాన్యుడి నుంచి సంపన్నవర్గాల వరకు బంగారం ఉంటేచాలు బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలు రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇటీవలకాలంలో ప్రభుత్వరంగ బ్యాంకులు కూడా ఈ రుణాలపై ప్రత్యేక దృష్టి సారించాయి. ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థను కూడా నెలకొల్పాయి.
దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం గడిచిన ఏడు నెలల్లో(ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు) బంగారం తాకట్టుపై రుణాలు 50 శాతం మేర పెరిగాయని రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అక్టోబర్ 18, 2024 నాటికి పసిడి రుణాలు రూ.1,54,282 కోట్లుగా ఉన్నాయి. మార్చి 2024 నాటికి మొత్తం బంగారం రుణాలు రూ.1,02,562 కోట్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైనదాంతో పోలిస్తే గోల్డ్ లోన్లు 56 శాతం అధికమయ్యాయి.
గడిచిన ఏడు నెలల్లో బంగారం రుణాలు రాకెట్ వేగంతో దూసుకుపోయాయని, ఇందుకు ప్రధాన కారణం ఎన్‌బీఎఫ్‌సీ సంస్థలు అన్‌సెక్యూర్డ్ లోన్ల కంటే సెక్యూర్డ్ లోన్లపై ప్రత్యేక దృష్టి సారించడం వల్లనే పెరిగాయని బ్యాంకర్ వెల్లడించారు. అలాగే బంగారం ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోవడంతో రుణ గ్రహీతలు బంగారాన్ని తాకట్టుపెట్టుకొని ఇతర రుణాలను తీర్చుకుంటున్నారని తెలిపారు. పసిడి రుణాల పాలసీలు, విధానాల్లో లోపాలు ఉంటే వచ్చే మూడు నెలల్లో సరిదిద్దుకోవాలని గత నెలలో రిజర్వు బ్యాంక్ అన్ని బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలకు సూచించింది.

గృహ రుణాలు కూడా..
బంగారం రుణాలతోపాటు గృహ రుణాలకు కూడా డిమాండ్ నెలకొన్నది. గత నెల చివరినాటికి దేశవ్యాప్తంగా రూ.28.7 లక్షల కోట్ల గృహ రుణాలు తీసుకున్నారు. అంతక్రితం ఏడాదితో పోలిస్తే 12.1 శాతం పెరిగాయి. దీంతోపాటు క్రెడిట్ కార్డు ద్వారా తీసుకునే రుణాలు ఏడాది ప్రాతిపదికన 9.2 శాతం ఎగబాకి రూ.2.81 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఆన్‌లైన్ ద్వారా జరిపే లావాదేవీలు అధికంగా ఉండటం ఇందుకు కారణమని సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది.

వ్యక్తిగత రుణాలకు దూరం..
బంగారం రుణాలతో పోలిస్తే వ్యక్తిగత రుణాలు తీసుకునేవారు తగ్గుముఖం పడుతున్నారు. ముఖ్యంగా ఈ రుణాలపై రిజర్వు బ్యాంక్ షరతులు విధించడంతో ఆర్థిక సంస్థలు, బ్యాంకులు ఇవ్వడానికి జంకుతున్నాయి. ఇటీవలకాలంలో దేశవ్యాప్తంగా వ్యక్తిగత రుణాలు మొండి బకాయిలు అధికంగా ఉండటంతో సెంట్రల్ బ్యాంక్ పలు కీలక చర్యలు తీసుకున్నది. దీంతో వ్యక్తిగత రుణాలు 3.3 శాతం తగ్గాయని తెలిపింది. మొత్తంమీద బ్యాంకింగ్ రుణాలు 4.9 శాతం అధికమై రూ.172.4 లక్షల కోట్లకు చేరుకున్నాయి.

# వినియోగదారులకు షాక్ ఇచ్చిన చమురు కంపెనీలు..

### వరుసగా ఐదోసారి సిలిండర్ ధర పెంపు



**ముంబయి :** చమురు కంపెనీలు కొనుగోలుదారులకు షాక్ ఇచ్చాయి. వాణిజ్య సిలిండర్ ధరను పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధర రూ.16.50 పెరిగింది. పెరిగిన ధరలు ఆదివారం నుంచి అమలులోకి వచ్చాయి. పెంపు తర్వాత దేశ రాజధాని ఢిల్లీలో వాణిజ్య సిలిండర్ ధర రూ.1818.50కి పెరిగింది. ధరలు పెరుగడం వరుసగా ఇది ఐదోసారి. అలాగే, ఐదు కిలోల ఎఫ్‌టీఎల్ సిలిండర్ ధరపై రూ.4 వరకు పెంచింది. ఇక గృహ వినియోగ 14.2 కిలోల సిలిండర్ ధరలను మాత్రం పెంచలేదు. గత నెలల ప్రారంభంలో కమర్షియల్ ఎల్‌పీజీ గ్యాస్ లిండర్ ధరను రూ.62 పెంచగా.. అక్టోబర్ 1న రూ.48.5 పెరిగి రూ.1,740కి చేరింది. ఆగస్ట్ 1న సిలిండర్‌పై రూ.6.5 పెరిగింది. సెప్టెంబర్ 1న రూ.39 పెరిగింది. ఇప్పటికే పెరిగిన ధరలతో అందరూ ఇబ్బందులుకు గురవుతున్నారు. పెళ్లిళ్ల సీజన్‌లో సిలిండర్ల ధరల పెంపుదలతో ఎల్‌పీజీపై ఆధారపడే వాణిజ్య సంస్థలు, చిరువ్యాపారులపై భారీగా ప్రభావం పడే అవకాశం ఉన్నది. కమర్షియల్ ఎల్‌పీజీ ధరలు పెరిగినప్పటికీ డొమెస్టిక్ ఎల్‌పీజీ సిలిండర్ ధరలో మార్పులు చేయకపోవడం స్వల్పంగా ఊరటనిచ్చినట్లయ్యింది. అంతర్జాతీయ చమురు ధరల ట్రెండ్‌కు అనుగుణంగా ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధరను ఆదివారం 1.45 శాతం పెంచారు. దేశ రాజధానిలో ఏవియేషన్ టర్బైన్ ఇంధనం (ATF) ధర కిలోలీటర్‌కు రూ.1,318.12 పెరిగి రూ.91,856.84కి చేరింది. తాజాగా పెరిగిన ధరలతో కోల్‌కతాలో రూ.1927, ముంబయిలో రూ.1771, చెన్నైలో రూ.1980, హైదరాబాద్‌లో రూ.2066 పలుకుతున్నది. ఇక డొమెస్టిక్ సిలిండర్ ధర ఢిల్లీలో రూ.803 ఉండగా.. ఉజ్వల పథకం లబ్ధిదారులకు రూ.603కే అందుబాటులో ఉంది. ముంబయిలో రూ.802.50, చెన్నైలో రూ.818.50, హైదరాబాద్‌లో రూ.855 వద్ద కొనసాగుతున్నది.

## రెండు నెలల్లో 48 బిలియన్ డాలర్లు ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు ఆవిరి..!




**ముంబయి:** గత రెండు నెలల్లో ఫారెక్స్ రిజర్వు 48 బిలియన్ డాలర్లు తగ్గుముఖం పట్టాయని ఆర్బీఐ తెలిపింది. సెప్టెంబర్ 27 నుంచి నుంచి ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు పతనం అయ్యాయన్నది. అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ పతనం కాకుండా నివారించడానికి బహిరంగ మార్కెట్లో జోక్యం చేసుకున్నట్లు వెల్లడించింది. సెప్టెంబర్ 27తో ముగిసిన వారానికి ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 705 బిలియన్ డాలర్ల జీవిత కాల గరిష్టానికి చేరుకున్నాయి. ప్రస్తుతం వరుసగా ఎనిమిదో వారం ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు పడిపోతున్నాయని ఆర్బీఐ వివరించింది.నవంబర్ 22తో ముగిసిన వారానికి ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 1.31 బిలియన్ డాలర్లు పతనమై 656.58 బిలియన్ డాలర్లకు చేరాయి. ఫారెక్స్ రిజర్వ్ నిల్వల్లో ప్రధానమైన ఫారిన్ కరెన్సీ అసెట్స్ 3.043 బిలియన్ డాలర్లు పడిపోయి 566.791 బిలియన్ డాలర్ల వద్ద స్థిర పడ్డాయి. బంగారం రిజర్వ్ నిల్వలు 1.828 బిలియన్ డాలర్లు పెరిగి 67.573 బిలియన్ డాలర్ల వద్ద ముగిశాయి. మరోవైపు స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్‌ఎస్) 79 మిలియన్ డాలర్లు పతనమై 17.985 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇక అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)లో భారత్ రిజర్వ్ నిల్వలు 15 మిలియన్ డాలర్లు తగ్గి 4.232 బిలియన్ డాలర్లకు పడిపోయాయి.

## గ్రావ్టోన్ క్వాంటా ఎలక్ట్రిక్ బైక్



**ముంబయి :** ప్రముఖ ఎలక్ట్రిక్ టూ వీలర్స్ తయారీ సంస్థ గ్రావ్టోన్ మోటార్.. భారత్ మార్కెట్లోకి క్వాంటా ఎలక్ట్రిక్ మోటారు సైకిల్ ఆవిష్కరించింది. లిథియం మాంగనీస్ ఐరన్ ఫాస్పేట్ బ్యాటరీతో వస్తున్న తొలి మోటారు సైకిల్ ఇది. గ్రావ్టోన్ క్వాంటా మోటారు సైకిల్ రూ.1.2 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది. బజాజ్ చేతక్, టీవీఎస్ ఐక్యూబ్, ఓలా ఎస్1, ఎథేర్ 450ఎక్స్ వంటి ఈవీ మోటారు సైకిళ్లతో గ్రావ్టోన్ క్వాంటా ఈవీ మోటార్ సైకిల్ పోటీ పడుతుంది. ఈ మోటారు సైకిల్ లో 2.78 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ ఉంటుంది. ఏకో మోడ్ లో 125 కి.మీ, స్పోర్ట్స్ మోడ్ లో 85 కి.మీ, పవర్ మోడ్ లో 100 కి.మీ వేగంతో ప్రయాణిస్తుంది. ఈ బ్యాటరీ ప్యాక్ 90 నిమిషాల్లో పూర్తిగా చార్జింగ్ అవుతుంది. గరిష్టంగా గంటకు 75 కి.మీ వేగంతో దూసుకెళ్తుంది.






# సెన్సేషనల్ కాన్సెప్టుతో రాబోతున్న M4M

హైదరాబాద్: మూవీ మేకర్ మోహన్ వడ్లపట్ల దర్శకుడిగా, జో శర్మ (యూఎస్ఏ) హీరోయిన్‌గా తెరకెక్కిన పాన్ ఇండియా మూవీ M4M (Motive For Murder) విడుదలకు ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ మోహన్ వడ్లపట్ల సినిమా గురించి మాట్లాడారు.. వరల్డ్‌వైడ్‌గా అందరికి కనెక్ట్ అయ్యే సబ్జెక్టుతో తెరకెక్కించామని చెప్పారు. 110 ఏళ్ల సినీ చరిత్రలో ఇంతవరకు ఎవరూ తీసుకోని కాన్సెప్టుతో ఈ సినిమా చేసినట్టు తెలిపారు. రాబోయే పదేళ్లు ఈ సినిమా గురించే మాట్లాడుకుంటారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ మోహన్ వడ్లపట్ల మాట్లాడుతూ.. ''ఇటీవల 'ఎంఫోర్‌ఎం' మూవీ హిందీ ట్రైలర్ ప్రతిష్టాత్మక గోవా ఫిలిం ఫెస్టివల్‌లో ఇండియన్ మోషన్ పిక్చర్స్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విడుదల చేయగా మంచి రెస్పాన్స్ వచ్చిందని, అంచనాలు భారీగా పెరిగాయన్నారు. ఎక్సలెంట్ టీంతో సినిమాను ఎంతో అద్భుతంగా పూర్తి చేశామన్నారు. హీరోయిన్ జో శర్మ తన ఫర్మార్మెన్స్‌తో సినిమాకు హైలైట్‌గా మారిందని డైరెక్టర్ తెలిపారు. ఈ చిత్రం విడుదలైన ఫస్ట్ డే ఈ సినిమా చూసి ఇందులో కిల్లర్ ఎవరో గెస్ చేస్తే ఒక్కొక్కరికి లక్ష రూపాయలు బహుమతిగా ఇస్తామని ప్రకటించారు.

హీరోయిన్ జో శర్మ మాట్లాడుతూ.. మోహన్ వడ్లపట్ల నాకు గాడ్‌ఫాదర్. నాకు మంచి అవకాశం ఇచ్చారు. ఈ సినిమా కోసం అమెరికా నుంచి హైదరాబాద్‌కు ఈ ఏడాదే ఆరు సార్లు వచ్చాను. నేను ఇందులో ఇన్విస్టిగేషన్ జర్నలిస్టుగా చేశాను. క్షణక్షణం ఉత్కంఠతో నడిచే ఈ సినిమా.. చూస్తున్నంత సేపు ఊపిరి బిగబెట్టేలా ఉంటుంది. ఇది బ్లాక్ బస్టర్ అవుతుందన్న నమ్మకం ఉంది.


ఈ సందర్భంగా గోవా తీరంలో హీరోయిన్ జోశర్మ (USA) తళుక్కుమంటూ ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. M4M కాన్సెప్ట్ 110 ఏళ్ల సినీ చరిత్రలో ఫస్ట్ టైమ్ అని, తాను ఈ సినిమాలో హీరోయిన్‌గా చేయడం గర్వంగా ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాను త్వరలోనే 5 భాషల్లో విడుదల చేయబోతున్నారు.



# 'శ్రీ సీతా రామజననం'కు

## 80 వసంతాలు

నటసామ్రాట్, లెజెండరీ అక్కినేని నాగేశ్వరరావు కథానాయకుడిగా నటించిన తొలి చిత్రం శ్రీ సీతా రామజననం 80 వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ చిత్రంతో అత్యంత పిన్న వయస్కుడైన తొలి కథానాయకుడిగా చరిత్ర సృష్టించారు ఏఎన్ఆర్. తొలి చిత్రంతోనే కథానాయకుడిగా శ్రీ రాముని పాత్ర ధరించిన ఏకైక నటుడిగా ప్రేక్షకుల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని పొందారు. ఘంటసాల బలరామయ్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పద్యాలని ఏఎన్ఆర్ సొంతగా పాడారు. 80 ఏళ్ల క్రితం శ్రీ సీతారామజననం చిత్రంతో కథానాయకుడిగా వెండితెరపై ప్రారంభమైన అక్కినేని ప్రయాణం కోట్లాదిమంది హృదయాలను హత్తుకుంటూ, స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ఏఎన్ఆర్ అసమానమైన వారసత్వం ప్రకాశిస్తూనే ఉంది. అందరి హృదయాలను తాకుతూ.., తరతరాలుగా కోట్లాది మందికి స్ఫూర్తినిస్తుంది. ఏఎన్ఆర్ సినీ ప్రస్థానం భారతీయ సినీ చరిత్రలో ఎప్పటికీ సువర్ణాక్షరాలతో లిఖించి ఉంటుంది.




# తెలుగులో పా..పా..గా రాబోతున్న తమిళ బ్లాక్ బస్టర్



తెలుగు తెరపైకి ఓ ఫీల్ గుడ్ ఎమోషనల్ డ్రామా రాబోతోంది. తమిళ సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ 'డా..డా' చిత్రం తెలుగులో 'పా.. పా..' టైటిల్‌తో జేకే ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై, నిర్మాత నీరజ కోట విడుదల చేయబోతున్నారు. డిసెంబర్ 13న ఈ చిత్రాన్నిఆంధ్ర, తెలంగాణతోపాటు అమెరికా, ఆస్ట్రేలియా థియేటర్‌లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. గత ఏడాది తమిళంలో 'డా..డా' మూవీ సెన్సేషనల్ హిట్ సాధించింది. కవిన్, అపర్ణ దాస్ ప్రధాన పాత్రదారులుగా, డైరెక్టర్ గణేష్ కే బాబు తెరకెక్కించిన ఈ చిత్రం తమిళ ఆడియన్స్‌ని విపరీతంగా ఆకట్టుకుంది. కోలీవుడ్ ఇండస్ట్రీలో డిస్ట్రిబ్యూటర్‌లకు కాసుల వర్షం కురిపించింది. అతి తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా సుమారు రూ.30 కోట్లు వసూళ్లు సాధించి బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతంచేసుకుంది. తండ్రి కొడుకుల సెంటిమెంట్‌తో తెరకెక్కి తమిళంలో బ్లాక్ బస్టర్‌గా నిలిచిన 'డా..డా' చిత్రం 'పా..పా..' పేరుతో తెలుగు ప్రేక్షకులను కూడా బాగా ఆకట్టుకుంటుందని నిర్మాత నీరజ కోట ఆశభావం వ్యక్తం చేశారు. కామెడీ, భావోద్వేగం, ప్రేమ.. నవరసాలను సరైన స్థాయిలో మిక్స్ చేసిన ఈ ఫీల్ గుడ్ ఎమోషనల్ డ్రామా.. తెలుగు ప్రేక్షకులకు కూడా బాగా కనెక్టు అవుతుందని, బ్లాక్ బస్టర్ అవ్వడం ఖాయమన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎంజీఎం సంస్థ నుంచి అచ్చిబాబు విడుదల చేయబోతున్నారని తెలిపారు.

# కేరళలో 1000 కోట్లు



మోహన్ లాల్ హీరోగా శ్రీకర్ మూవీ మేకర్స్ పతాకంపై కాసుల రామకృష్ణ (శ్రీధర్), శ్రీకరగుప్త, సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం "1000" కోట్లు. గతంలో "100 కోట్లు" వంటి హిట్ చిత్రాన్ని నిర్మించిన కాసుల రామకృష్ణ ప్రస్తుతం "1000 కోట్లు" చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుత ఈ చిత్రం కేరళ లో డబ్బింగ్ జరుపుకుంటుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత కాసుల రామకృష్ణ మాట్లాడుతూ.. మలయాళంలో సూపర్ హిట్ అయిన చిత్రాన్ని తెలుగులో 1000 కోట్లు పేరుతో విడుదల చేయుటకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. మోహన్ లాల్ సరసన కావ్య మాధవన్ హీరోయిన్‌గా నటిస్తుంది. మరో విశేషమేమిటంటే ప్రముఖ సీనియర్ ఆర్టిస్ట్ నాగ మహేష్ మోహన్ లాల్ కు వాయిస్ ఓవర్ ఇస్తున్నారు.ఈ చిత్రానికి ప్రముఖ పీఆర్ ఓ వీరబాబు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు ముగించుకుని త్వరలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం. అని అన్నారు. మోహన్ లాల్, కావ్య మాధవన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రాతీష్ వేగ, డీఓపీ: ప్రదీప్ నాయర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బాసింశెట్టి వీరబాబు, నిర్మాతలు: కాసుల శ్రీకర్ గుప్తా, కాసుల రామకృష్ణ, జోషి దర్శకత్వం వహించారు.

# వీణారావు ఫస్ట్ దర్శన్ లాంచ్

మహిళా శక్తిగా ఎదిగిన సుప్రియ, స్వప్న చేతుల మీదుగా కథానాయికగా పరిచయమవుతున్న తెలుగు అమ్మాయి వీణారావు ఫస్ట్ దర్శన్ లాంచ్ చేశారు డైనమిక్ డైరెక్టర్ వైవీఎస్ చౌదరి. తెలుగు చిత్రసీమలో విశిష్టమైన నందమూరి వారసత్వాన్ని మరింత ముందుకు తీసుకువెళుతూ.., దివంగత నందమూరి జానకిరాం తనయుడు యంగ్ చాప్ నందమూరి తారక రామారావు ఫిలిమ్స్ లోకి గ్రాండ్ ఎంట్రీ ఇస్తున్నారు. వైవీఎస్ చౌదరి రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్ ని న్యూ టాలెంట్ రోర్స్ @ బ్యానర్‌పై యలమంచిలి గీత నిర్మించనున్నారు. ఇప్పటికే లాంచ్ చేసిన నందమూరి తారక రామారావు ఫస్ట్ లుక్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం ద్వారా ప్రతిభావంతులైన కూచిపూడి డ్యాన్సర్, తెలుగు అమ్మాయి వీణారావు కథానాయికగా పరిచయం అవుతున్నారు. అచ్చతెలుగు అందాలరాశి వీణారావు ఫస్ట్ దర్శన్ అందరినీ మెస్మరైజ్ చేసింది. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన షో రీల్ గ్లింప్స్ అందరినీ అలరించింది. 'కథలు, సన్నివేశాలు, పాత్రలకు అనుగుణంగా నటించి ప్రేక్షకుల్ని రంజింపచేయడంలో తన వంతు నిరంతర కృషి చేస్తానని, తన అభిమాన నటి డాక్టర్ పీ భానుమతి రామకృష్ణ సాక్షిగా ప్రమాణం చేశారు వీణారావు.

ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణి మ్యూజిక్ అందిస్తుండగా.. మరొక ఆస్కార్ విజేత చంద్రబోస్ లిరిక్స్, స్టార్ డైలాగ్ రైటర్ సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ సమకూరుస్తున్నారు. ఈ చిత్రం తెలుగు సినిమా అభిమానులకు అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ని అందించనుందని చిత్ర యూనిట్ ధీమ వ్యక్తం చేసింది.

వీణారావు ఫస్ట్ దర్శన్ ప్రెస్ మీట్ లో వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ... 'అశ్వినిదత్ కాంపౌండ్‌లో దాదాపు ఐదేళ్లపాటు ఉన్నాను. నా తొలి సినిమా వారి బ్యానర్ లోనే చేయాల్సింది. తర్వాత నాకు అన్నపూర్ణ లో డైరెక్షన్ ఛాన్స్ వచ్చింది. దత్తు, నాగార్జున ఇద్దరూ నాకు చిరస్మరణీయులు. వారి కుటుంబం నుంచి వచ్చి మహిళా శక్తులుగా ఎదిగిన సుప్రియ, స్వప్న చేతుల మీదుగా కథానాయక వీణారావు ఫస్ట్ లుక్ దర్శన్ ని లాంచ్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. వీణా మంచి కూచిపూడి డ్యాన్సర్, అందాల రాశి తనకి మంచి భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నాను. నందమూరి తారక రామారావు గారు నాకు స్ఫూర్తి. ఆయన వల్లే నేను పరిశ్రమలోకి వచ్చాను' అన్నారు.

నిర్మాత స్వప్నదత్ మాట్లాడుతూ.. 'వైవీఎస్ చౌదరి అనడం కంటే చౌదరి అన్న అనడమే మాకు ఇష్టం. మేము చిన్నప్పుడు చెన్నైకి వెళ్తుండే వాళ్ళం. అన్నని చూస్తూనే మేం పెరిగాం. అన్న మా ఫ్యామిలీ లానే. ఇవాళ ఇలాంటి లాంచ్ లో నేను భాగం అవ్వడం చాలా ఆనందంగా ఉంది. అన్న ఈ విషయంలో ఓ అడుగు ముందుకేయడం చాలా ఆనందంగా ఉంది' అన్నారు.

నిర్మాత సుప్రియ యార్లగడ్డ మాట్లాడుతూ.. 'వైవీఎస్ చౌదరి అన్నపూర్ణ స్టూడియోస్ నుంచే డైరెక్టర్‌గా పరిచయమయ్యారు. ఆ సినిమాతో తాత గారిని డైరెక్టర్ చేశారు. సీతారాముల కళ్యాణం చూతము రారండి సినిమా చూసిన తర్వాత తాతగారు చాలా హ్యాపీగా ఫీలయ్యారు. వైవీఎస్ చౌదరి కొత్తవారిని పరిచయం చేయడంలో ముందుంటారు. వీణారావు ఎంతో అదృష్టవంతురాలు. ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్నాను' అన్నారు.

నిర్మాత యలమంచిలి గీత మాట్లాడుతూ.. 'మా హీరోయిన్ ఫస్ట్ దర్శన్ ని లాంచ్ చేసిన సుప్రియ, స్వప్నకి థాంక్స్. మా హీరో ఎలా అయితే ప్రపంచ వ్యాప్తంగా హిట్ అయ్యారో మా హీరోయిన్ ని కూడా మనస్ఫూర్తిగా ఆదరిస్తారని కోరుకుంటున్నాను' అన్నారు.

ఘంటసాలకు

# భారతరత్న ఇవ్వాలి

**ఘంటసాల బయోపిక్ పోస్టర్ లాంచ్ చేసిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు**

అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితం మీద తెరకెక్కిన బయోపిక్ 'ఘంటసాల ది గ్రేట్'. కృష్ణ చైతన్య టైటిల్ పాత్ర పోషించారు. ఈ సినిమాలో ఘంటసాల భార్య సావిత్రి పాత్రలో కృష్ణ చైతన్య భార్య మృదుల నటించారు. సీహెచ్ రామారావు దర్శకత్వంలో సీహెచ్ ఫణి నిర్మించారు. ఫిబ్రవరి 14 2025న ఈ సినిమాను విడుదల చేయనున్నారు. హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా రిలీజ్ డేట్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పీపుల్స్ స్టార్ ఆర్ నారాయణమూర్తి, నిర్మాత అశోక్ కుమార్, సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్, నటులు అశోక్ కుమార్, సుబ్బరాయ శర్మ, నటి జయవాణి, నిర్మాత దామోదర ప్రసాద్, దర్శకులు కర్రి బాలాజీ తదితరులు హాజరయ్యారు.

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ... 'నేను సినిమా కార్యక్రమాలకు వెళ్లను. అప్పుడప్పుడూ సినిమాలు చూస్తాను, ముఖ్యంగా పాత సినిమాలు చూస్తాను. ఘంటసాల జీవితం గురించి నేటి తరానికి తెలియచెప్పే కార్యక్రమం కనుక వచ్చాను. ఈతరం ఆయన జీవితం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర సమరయోధుడిగా, ప్రజా గాయకుడిగా, ప్రముఖ సంగీత దర్శకుడిగా దేశానికి, తెలుగు ప్రజలకు పరిచయస్తులు. వారి జీవితం ఆధారంగా తీసిన 'ఘంటసాల ది గ్రేట్' చిత్రాన్ని వీక్షించే అవకాశం లభించడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. భగవద్గీత శ్లోకాలు ఆయన పాడుతుంటే ప్రజలు అందరూ ఎంతో తన్మయత్వంతో వినేవారు. ఘంటసాల గారిపై సినిమా తీయడం సాహసం. అందుకు ముందడుగు వేసిన నిర్మాత ఫణికి, నిర్మాణంలో పాలు పంచుకున్న జీవీ భాస్కర్, లక్ష్మి ప్రసాద్ లకు అభినందనలు. ఘంటసాల పాత్రలో నటించిన యువ గాయకుడు కృష్ణ చైతన్య, శ్రీమతి పాత్రలో నటించిన మృదులను ప్రత్యేకంగా అభినందిస్తున్నా. ఇదొక చక్కటి ప్రయత్నం. సంగీతం ఉన్నంత కాలం ఆయన ప్రజల మనసుల్లో ఉంటారు. ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తారని, ప్రోత్సహిస్తారని ఆశిస్తున్నాను'' అని అన్నారు.

పీపుల్స్ స్టార్ ఆర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ.. ''ఓ ఎన్టీఆర్, ఓ అక్కినేని, ఓ ఘంటసాల. ఎన్టీఆర్, అక్కినేని ఉన్నంత కాలం ఘంటసాల ఉంటారు. ఆ మహనీయుడి చరిత్ర సినిమా తీసి జన్మ ధన్యం చేసుకుంటున్న దర్శకులు రామారావుకి, నిర్మాత ఫణికి, ఘంటసాల పాత్రలో నటించిన తమ్ముడు కృష్ణ చైతన్యకు అభినందనలు'' అని అన్నారు.

ఈ చిత్రంలో టైటిల్ రోల్ పోషించిన కృష్ణ చైతన్య మాట్లాడుతూ... ''వెంకయ్య నాయుడుకి ధన్యవాదాలు. నేను ఒక గాయకుడిని. నన్ను ఆశీర్వదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. నాకు అవకాశం ఇచ్చిన దర్శకులు రామారావుకి థాంక్స్'' అని అన్నారు.

దర్శకులు సీహెచ్ రామారావు మాట్లాడుతూ .. ''ఘంటసాల పాట అందరికీ తెలుసు. ఆ పాట ఎంత గొప్పదో తెలుసు. కానీ, ఆయన వ్యక్తిత్వం చాలా కొంతమందికి తెలుసు. కృషితో నాస్తి దుర్భిక్షం, వినయంతో విద్య ప్రకాశిస్తుందని చెప్పడానికి నిలువెత్తు నిదర్శనం ఘంటసాల. ఆయన వ్యక్తిత్వాన్ని, ఆ జీవితాన్ని మా సినిమాలో చెప్పడం జరిగింది. భారతదేశ సినిమా చరిత్రలో ఏ గాయకుడి మీద పూర్తిస్థాయి నిడివి సినిమా రాలేదు. ఆ అవకాశాన్ని నాకు ఇచ్చిన భగవంతుడికి సర్వదా కృతజ్ఞుడిని'' అని అన్నారు.

ఈ సినిమాలో సుమన్, సుబ్బరాయ శర్మ, దీక్షితులు మాస్టారు, మాస్టర్ అతులిత్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమాకు ఎడిటర్: క్రాంతి (KR), డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: వేణు మురళీధర్ వి, మ్యూజిక్: వాసు రావు సాలూరి, నిర్మాతలు: శ్రీమతి సిహెచ్ ఫణి, సిహెచ్ రామారావు, కథ కథనం మాటలు దర్శకత్వం: సీహెచ్ రామారావు.




# ధైర్యాన్ని, నమ్మకాన్ని క సినిమా ఇచ్చింది

థ్రిల్లర్ జానర్ లో ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చి ఘన విజయాన్ని అందుకుంది కిరణ్ అబ్బవరం మూవీ "క". ఈ సినిమాలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్స్ గా నటించారు. శ్రీమతి చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్ టైన్ మెంట్స్ తో బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో నిర్మించారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ "క" సినిమాతో తమ ప్రతిభ నిరూపించుకున్నారు. "క" సినిమాను తెలుగులో ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి రిలీజ్ చేయగా..మలయాళంలో స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ తన వేఫరర్ ఫిలింస్ పై డిస్ట్రిబ్యూట్ చేశారు. దీపావళి బాక్సాఫీస్ రేసులో విన్నర్‌గా నిలిచిన ఈ సినిమా వరల్డ్ వైడ్ 50 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. ఈ మూవీ ఈటీవీ విన్ లో డాల్బీ విజన్ 4కే, అట్మాస్ టెక్నాలజీతో స్ట్రీమింగ్ కు వచ్చి అక్కడా గ్రాండ్ సక్సెస్ అందుకుంది. అతి తక్కువ టైమ్ లో 100 మిలియన్ మినిట్స్ వ్యూయర్ షిప్ దక్కించుకుంది. ఈ సందర్భంగా "క" బ్లాక్ బస్టర్ ధమాకా ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ క సినిమాకు మేము ఎంతగా ప్రమోషన్ చేశామో, ఈటీవీ విన్ టీమ్ అంతా అంతే ప్రమోషన్ చేసి ఆడియెన్స్ కు సినిమా బాగా రీచ్ అయ్యేలా చేస్తున్నారు. పైరసీ అనేది జరగకుండా జాగ్రత్తలు తీసుకుని ప్రతి ఒక్కరి ఇంటికి క సినిమాను చేర్చారు. ఈటీవీ విన్ టీమ్ బాపినీడు గారు, సాయి కృష్ణ ఇతర అందరికీ థ్యాంక్స్ చెబుతున్నాం. అలాగే డాల్బీ విజన్ 4కే, అట్మాస్ టెక్నాలజీ నుంచి ఓటీటీలోకి వచ్చిన ఫస్ట్ తెలుగు సినిమా క కావడం విశేషం అన్నారు. నటీనటులు కిరణ్ అబ్బవరం, నయన్ సారిక తదితరులు

రిపోర్టర్స్ కావలెను V3 NEWS విశ్వంభర తెలుగు దినపత్రిక
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com